# చావు తప్పితే చాలు...

నవల

## కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 25




(తెలుగులో మొట్టమొదటి హారర్ ఫిక్షన్ నవల ఇది . మొదటి ముద్రణ: 1962లో)

47 సంవత్సరాల క్రిందట విడుదలైన ఈ నవల ఆ రోజుల్లో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1962 నుంచీ 1976 వరకూ మూడు సార్లు పునర్ముద్రించబడింది. దాదాపు 15,000 కాపీలు పైగా అమ్ముడుపోయాయి ఆ రోజుల్లోనే. ఈ నవల పుస్తకం వెనుక నున్న క్రింది వాక్యాలు నవల పట్ల ఉత్కంఠతని రెట్టింపు చేస్తాయి.

***

భారతి భుజాల మీద ఏదో చేతులు వేసింది. మొహానికి ఏదో రాసుకుంది? ఏమిటది?

మెట్లమీద ప్రసాద్ చూసిన ఆకారం ఏమిటి? మనిషి కాదని నిశ్చయంగా ఎందుకన్నాడు?

వైకుంఠరావు చనిపోయి రెండు రోజులైంది. అతని శవం, మేడమీద కుర్చీలో ఎట్లా ఉంది? ఇంట్లో ఎట్లా తిరుగుతోంది?

"దూరంగా పొండి, తలుపు దగ్గరకి వెళ్ళకండి" అని అరుస్తూ భారతి ప్రసాద్‌నీ, శేఖర్‌నీ ఎందుకు వెనక్కి లాగింది.?

ఈ పుస్తకం రాత్రిళ్ళు ముట్టుకోవద్దు. ఒంటరిగా ఉన్నప్పుడు చదవొద్దు. భయం వేసినప్పుడు అప్పటికి చదవడం ఆపి కొంతసేపటి తర్వాత మళ్ళీ మొదలుపెట్టండి..!




## 1

"రాజారాంని రేపు విడుదల చేస్తున్నారు." అన్నాడు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు,

"ఎవరా రాజారాం?" అడిగాడు డిటెక్టివ్ యుగంధర్.

"మీకు జ్ఞాపకం లేదూ! పదేళ్ళ క్రితం సరోజ్ జ్యూయలరీ షాపుని దోచుకున్న దొంగ."

"అసలు విషయంఏమిటో చెప్పండి ఇన్‌స్పెక్టర్!" అన్నాడు యుగంధర్.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు సిగరెట్ వెలిగించి, గట్టిగా పొగ పీల్చి "చెప్పడానికేగా వచ్చాను. తొందరెందుకు? పదేళ్ళ క్రితం సరోజ్ జ్యూయలరీ షాపు ఈ ఊళ్ళో ఉండిన అన్ని నగల షాపులలోకి పెద్దది - ఇప్పుడయితే కాంపిటీషన్ ఎక్కువయింది అనుకోండి! ఒక అమావాస్య నాటి రాత్రి రాజారాం ఆ షాపులో ప్రవేశించి పది లక్షల రూపాయల విలువగల నగలు దొంగిలించాడు."

యుగంధర్ ఇన్‌స్పెక్టర్ని ఆశ్చర్యంతో చూసి "ఒక్కడూనా?" అడిగాడు.

"అవును ఆ దొంగతనంలో రాజారాంకి ఇంకెవరూ సహాయపడినట్లు నిదర్శనాలు లేవు."

"అంత పెద్ద నగల షాపుకి రాత్రిపూట కాపలా జవాను ఉండేవాడు కాడా?!"

"ఉండేవాడు. ఆ జవానును కర్రతో తలమీద కొట్టి, మారుతాళం చెవులతో తాళాలు తెరిచి లోపల ప్రవేశించాడు. రాజారాం అదృష్టమో ఆ జవాను అదృష్టమో కాని జవాను మరణించలేదు. అందుకే హత్యానేరం కాక దోపిడీ నేరం రాజారాం మీద మోపబడ్డది."

"రాజారాంని ఎలా పట్టుకున్నారు! దొంగతనం చేస్తూ ఉండగా షాపులో పట్టుకున్నారా?" యుగంధర్ ప్రశ్నించాడు.

"లేదు. అప్పుడే పట్టుకునుంటే ఇవాళ మిమ్మల్ని కలుసు కోవలసిన అవసరం లేకపోయేది. నాలుగురోజుల తర్వాత చెంగల్పట్ రైలు స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా పట్టుకున్నాము."

"నగలు?"

"దొరకలేదు." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"రాజారాంని ఎలా పట్టుకున్నారు?" అని అడిగాడు యుగంధర్.

"అంతకుముందు ఒకటి రెండు చిన్న చిన్న దొంగతనాలు చేసి జైలుకి వెళ్ళిన మనిషి రాజారాం. అతని వేలి ముద్రలు మా రికార్డులలో ఉన్నాయి. నగల బీరువా అద్దాల మీద, తలుపుకున్న క్రోమియం పిడి మీద రాజారాం వేలి ముద్రలు కనిపించాయి. రాజారాం గురించి అన్ని పోలీస్ స్టేషన్‌లకి అతని ఫోటోతో సహా హెచ్చరిక పంపాము. చెంగల్పట్ పోలీసులు అరెస్టు చేశారు. "

"నగలు ఏమయ్యాయి?" అడిగాడు రాజు.

యుగంధర్ నవ్వి, "నగలు దొరకలేదు. అందుకే ఇన్‌స్పెక్టర్ మనకి విషయాలన్నీ చెపుతున్నారు." అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ తలూపి 'అవును, నగలు దొరకలేదు, ఇన్సూరెన్స్ కంపెనీవాళ్ళు యాభైవేల రూపాయలు బహుమానం ఇస్తామని ప్రకటించారు. నగల ఆచూకీ కనుక్కొని వాటిని తెచ్చిన పోలీస్ ఆఫీసర్లకి కూడా పారితోషికం ఇస్తామన్నారు. డిపార్ట్‌మెంటులో కలిగిన సంచలనం గురించి మీరు ఊహించవలసినదే! బీటు కానిస్టేబుల్ కూడా ఆ నగల గురించి దర్యాప్తు చేశాడు. ప్రయోజనం లేకపోయింది. రాజారాం నగలు ఎక్కడ దాచినదీ, ఎవరికిచ్చినదీ అంతు చిక్కలేదు." అన్నాడు.

"రాజారాం ఏమన్నాడు?" అడిగాడు యుగంధర్.

"తను నేరం చేయలేదన్నాడు."

"తర్వాత?"

"రాజారాంకి పదేళ్ళ కఠిన శిక్ష పడింది. దొంగతనం జరిగిన నాలుగురోజులు ఏం చేశాడో కనుక్కునేందుకు ఎంతో శ్రమ పడ్డాము. ప్రయోజనం లేకపోయింది. చెంగల్పట్టు పోలీసులకి చిక్కే రోజు వరకూ ఎక్కడున్నాడో, ఏం చేశాడో తెలియలేదు. ఆనాటి నుంచీ ఈ నాటివరకూ నగలు అమ్మకానికి రాలేదు. విదేశాలకు తీసుకుపోలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎవరికయినా ఇచ్చివుంటే ఆ మనిషి వాటిని కరిగించి అమ్మేశాడేమో!"

"రాజారాంకి ఒక చెల్లెలు మాత్రం ఉంది. తల్లీ, తండ్రీ, వేరే తోబుట్టువులూ లేరు. అతను జైలుకి వెళ్ళినపుడు ఆ చెల్లెలికి ఎనిమిదేళ్ళు. ఆ పిల్లకి ఆ నగలు ఇచ్చివుంటాడా? ఆ అమ్మాయి కూడా అన్న మార్గం అనుసరించింది. ఒక ఇంట్లో పనికి కుదిరింది. ఆ ఇంట్లోనుంచి పట్టు చీరెలు ఎత్తుకుపోయినందుకు ఒకసారి, ఇంకో ఇంట్లో బంగారు గొలుసు దొంగిలించినందుకు ఇంకోసారీ పట్టుబడ్డది. రాజారాం ఆ నగలు ఎక్కడో దాచాడని నా అనుమానం. విడుదలయి వచ్చాక వాటిని తీసుకోదలిచాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇన్సూరెన్స్ కంపెనీ ఇస్తామన్న బహుమానం విషయం?" అడిగాడు రాజు.

"ఆ నగలు తెచ్చి ఇస్తే ఇప్పుడూ ఇస్తారు. సరోజ్ జ్యూయలరీస్‌కి ఇన్సూరెన్స్ కంపెనీ అప్పుడే డబ్బు ఇచ్చేసింది. ఆ ఇన్సూరెన్సు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నిన్ననే నన్ను కలుసుకున్నాడు. రాజారాం విడుదలయిన తర్వాత ఆ నగల ఆచూకీ తెలుసుకునేందుకు వచ్చాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ అయిదు నిమిషాలపాటు ఆలోచిస్తూ ఉండిపోయిన తర్వాత "రాజారాంని ఎన్నిగంటలకి విడుదల చేస్తారు?" అడిగాడు.

"రేపు చెపుతాను. అతని ఫోటో కూడా ఇస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

## 2

"అదుగో! అటే ఆయన ఇల్లు." అన్నాడు డాక్టర్ సుదర్శనం కారు బ్రేక్ నొక్కి, గేటు దగ్గర కారు ఆపుతూ. అది ఇనుపకడ్డీల గేటు, గేటు పక్కన ప్రహరీ గోడలేదు కాని ముళ్ళతీగె కంచె ఉంది. గేటుకి యాభై గజాల దూరంలో ఉన్న ఓ చిన్న అవుట్ హౌస్‌లోంచి నలభై ఏళ్ళ మనిషి పరిగెత్తుకు వచ్చి గేటు తెరిచాడు. డాక్టరు సుదర్శనం గేర్ మార్చి కారు లోపలికి పోనిచ్చాడు.

గేటు తెరిచిన అతను డ్రైవర్.

"కామరాజుగారు ఈ ఇంట్లో ఎందుకుంటున్నారో అర్థం కాదు. పట్నం వచ్చి ఉండమని చెప్పి చూశాను. వింటేగా!" అన్నాడు డాక్టర్ పక్కన కూర్చున్న యువతితో.

గేటుకి దాదాపు ఫర్లాంగు దూరంలో ఉన్న పెద్ద బంగళాని రెప్పవాల్చకుండా చూస్తూ "పాలెస్‌లా ఉంది" అన్నది ఆమె.

"నిజానికిది పాలసే. పూర్వం జమిందారులది ఈ భవనమూ, ఈ తోటా. చెడ్డరోజులు రావడంవల్ల అమ్మేశారు. కామరాజుగారు కొన్నారు" అన్నాడు డాక్టర్.

"ఇంత పెద్ద ఇంటికంతటికీ ఆయన ఒక్కరేనా ఉంటున్నది?" అడిగింది ఆమె.

డాక్టర్ తల ఊపాడు. "నౌకర్లున్నారు. కొడుకు అమెరికాలో ఏదో ట్రెయినింగ్ అవుతున్నాడు బంధువులున్నారు కాని ఈ మారుమూలకి వచ్చి ఎవరుంటారు?" అంటూ డాక్టర్ కారు పోర్టికోలో ఆపాడు. వెంటనే ఇంట్లోంచి ఓ నలభై ఏళ్ళ మనిషి పరిగెత్తుకు వచ్చి, కారు తలుపు తెరిచి డాక్టర్ తోలుపెట్టె తీసుకున్నాడు.

"అయ్యగారు ఎలా ఉన్నారు రత్నయ్యా?" అడిగాడు డాక్టర్,

"కులాసాగానే ఉన్నారండి. మీకోసమే చూస్తున్నారు" అంటూ డాక్టరు వెనకే రత్నయ్య నడిచాడు. హాల్లోకి వెళ్ళగానే "నువ్వు ఇక్కడ కూర్చో - పిలుస్తాను" అని డాక్టర్ రత్నయ్యతో లోపలికి వెళ్ళాడు.

హాల్లో రెండు సోఫా సెట్లు, నాలుగు కుర్చీలు, గోడలకి అందమైన పెయింటింగ్స్ ఉన్నాయి. యజమాని సుస్తీగా ఉండి పడుకున్నా నౌకర్లు ఇల్లు శుభ్రంగానే ఉంచుతున్నారని గమనించిందామె. ఆ ఇంట్లో ఎన్ని గదులున్నాయో ఊహించడం కష్టం. కొంతకాలం పాటు అది తన నివాస స్థలం కాబోతున్నది. ఆమె తనలో తన నవ్వుకుంది, పాలెస్‌లో నివసించబోతున్నది తను. ఇంకేం మద్రాసు నగరానికి ఇరవై రెండు మైళ్ళ దూరంలో ఒక పెద్ద బంగళాలో ఉంటున్న కామరాజు అనే వృద్ధుడికి సుస్తీగా ఉన్నదనీ, నర్సు కావాలనీ, ఆ ఉద్యోగానికి వెళతావా అనీ డాక్టర్ సుదర్శనం తనని పిలిపించి అడిగాడు క్రితం రోజు.

రెండు సంవత్సరాలుగా ఆమె నర్స్‌గా పనిచేస్తున్న నర్సింగ్‌హోం నష్టంగా ఉందని రెండు నెలల క్రితం మూసేశారు. ఆమెకి రెండు నెలలనుంచీ ఉద్యోగం లేదు. అంతకు ముందు ఏమీ కూడబెట్టలేదు తండ్రిలేడు. తల్లీ, పన్నెండేళ్ళ తమ్ముడూ ఉన్నారు. వాళ్ళ పోషణ భారము ఆమెదే ఉద్యోగం దొరక్క, సంపాదనలేక చికాకుపడుతున్న సమయంలో డాక్టర్ సుదర్శనం పిలిపించి అడగ్గానే తల ఊపింది ఆమె.

డాక్టరు నవ్వి "తొందరపడక, విను. కామరాజుగారికి అరవై రెండేళ్ళు. హై బ్లడ్ ప్రెషర్. గుండెజబ్బు - నౌకర్లూ, ఆయనా తప్ప ఆ ఇంట్లో ఇంకెవరూ ఉండరు. నవ్వు అనుక్షణమూ ఆయన దగ్గిరే ఉండాలి. రెండుగంటలకోసారి మందు ఇవ్వాలి. అంటే అక్కడే ఆ ఇంట్లోనే ఉండాలి. ఆయనకి ఆరోగ్యం వచ్చేంతవరకూ సెలవ అనేది ఉండదు. ఆ ఇంటికి చుట్టు ప్రక్కల ఇళ్ళేమీ లేవు. బజారు లేదు సినిమాలు లేవు. రైలు స్టేషన్ ఆరుమైళ్ళు - నలభై అయిదేళ్ళ డ్రయివర్, ఏభై ఏళ్ళ తోటమాలి, నలభై ఏళ్ళ వంటవాడు, ముప్ఫయి ఏళ్ళ దాసీది, దాదాపు అదే వయస్సువున్న పనివాడు - అంతే"

ఆమె తలూపింది.

"భోజనమూ, నివాసమూ అక్కడే నీకు. నెలకి రెండు వందలు జీతం - ఇష్టమేనా?" అడిగాడు డాక్టర్.

రెండువందలా అనుకుని ఆత్రంగా తల ఊపింది ఆమె. మర్నాడు సాయంకాలం తన డిస్పెన్సరీకి రమ్మని, తనే తీసుకెళతాననీ చెప్పాడు డాక్టర్.

"డాక్టర్ అయ్యగారు పిలుస్తున్నారు." అన్నాడు రత్నయ్య వచ్చి. ఆమె రత్నయ్య కూడా వెళ్ళింది. మెట్లు ఎక్కి మేడమీద ఓ గది తలుపు ముందు ఆగిపోయాడు రత్నయ్య. ఆ గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. తలుపు తెరిచే ఉంది ఆమె లోపలికి వెళ్ళగానే "ఈమే మీ నర్సు. పేరు భారతి. ఈయన కామరాజుగారు. నీ పేషెంటు!" అన్నాడు డాక్టర్.

భారతి నమస్కారం పెట్టి డాక్టర్ పక్కన నిలుచుని పెద్ద మంచం మీద పడుకున్న ఆ వృద్ధుణ్ణి చూసి చిన్నగా నవ్వింది. నెరిసిన వెంట్రుకలు వెండి తీగెలలా వేలాడు తున్నాయి, విశాలమైన నుదురు దళసరి కళ్ళద్దాలు. బలహీనంగా కనిపించడం లేదు కాని అసలు భారీ మనిషి కాడు. కండ పుష్టి ఉన్నవాడూ కాడు. దయ వాత్సల్యము ఆయన కళ్ళల్లో గోచరిస్తున్నాయి.

"నీ వయస్సెంత?" అడిగాడు కామరాజు భారతిని.

"ఇరవై రెండు" అన్నది భారతీ తడుముకోకుండా.

భారతిని ఆపాదమస్తకమూ పరీక్షించి చూస్తున్నాడు కామరాజు. ఆయన కళ్ళల్లో ఏదో ఆవేదన, బాధ గోచరించాయి భారతికి. ఏమిటో అర్థంకాలేదు ఏదో దిగులు పుట్టుకొచ్చింది ఆమెలో. కామరాజు కళ్ళల్లోకి చూడలేక మొహం తిప్పేసుకుని గదిని పరీక్షించడం ప్రారంభించింది, చాలా విశాలమైన గది. గదిమధ్య మంచం. మంచానికి ఒకపక్కన నాలుగు కుర్చీలు. అవతలవైపు చిన్న బల్ల! దాని మీద పుస్తకాలు, ఆష్ట్రే, టెలిఫోన్. ఫౌంటెన్ పెన్. తలుపుకి ఎదురుగా రెండు కిటికీలు. ఆ కిటికీలు. ఆ కిటికీలకు ఆకుపచ్చ రంగు తెరలు. మంచం కాళ్ళవైపు ఇంకో తలుపున్నది. ఆ తలుపు మూసేసి ఉంది. గోడకి ఒక పెద్ద ఫోటో - యాభై ఏళ్ళ స్త్రీది. ఆ ఫోటోకి చెంకీదండ వేసి ఉంది. దాని పక్కన పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఫోటో ఒకటి ఉంది. ఆ ఫోటోకి తెల్లని కాగితం పూవుల దండ తగిలించి ఉంది.

"ఏమిటి చూస్తున్నావు? ఆ ఫోటోలా? నా భార్య, నా కూతురు. ఇద్దరూ పోయారు" అని దిండు కిందనుంచి జేబురుమాల తీసి కళ్ళు తుడుచుకున్నాడు కామరాజు.

ఏమనాలో భారతికి తెలియలేదు. మౌనంగా ఉండిపోయింది.

"కూర్చో. నిలబడే ఉన్నావేం?" అన్నాడు కామరాజు.

డాక్టర్ చేతిగడియారం చూసుకుని, లేచి నిలుచుని "నేనిక వెళ్ళాలి. క్లినిక్‌లో పేషెంట్లు కాచుకుని ఉంటారు. మద్రాసు చేరుకునేందుకు గంట పడుతుంది. భారతీ! ఏ యే మందులు ఎప్పుడు ఇవ్వాలో రాసుకున్నావుగా!? గుడ్! సందేహం ఏదయినా కలిగితే ఫోన్ చెయ్యి. నీ పెట్టె రత్నయ్యకి ఇచ్చి లోపలికి పంపిస్తాను." అని వెళ్ళిపోయాడు.

కామరాజు భారతిని కనురెప్ప వాల్చకుండా చూస్తున్నాడు ఇంకో పురుషుడు వృద్ధుడయినా సరే అలా చూస్తే భారతికి చిరాకు కలిగేది. కాని కామరాజు చూపుల్లో లేకితనం లేదు. ఏదో పోగొట్టుకున్నదాన్ని వెతుకుతున్నట్లున్నాయి అతని చూపులు.

"మీ అమ్మాయి జ్ఞాపకం వచ్చిందా?" అడిగింది భారతి.

కామరాజు తల ఊపాడు.

"పేరు?"

"సీత."

"జబ్బు చేసిందా?"

తల ఊపాడు కామరాజు.

భారతి లేచి నిలుచుని "నన్ను చూడడం వల్ల మీకు మీ అమ్మాయి జ్ఞాకం వచ్చి బాధ కలిగిఉంటుంది. నేనే మీ అమ్మాయి అనుకోండి! నా గది చూపిస్తే డ్రెస్ మార్చుకుని వస్తాను" అన్నది.

ఏదో కలకంటున్న మనిషి తెప్పరిల్లినట్లు కామరాజు తలతిప్పి "అదుగో! అదే నీ గది. అని మంచానికి బిగించి ఉన్న మీట నొక్కాడు. ఎక్కడో దూరంగా గణగణమని గంట మ్రోగింది. నిమిషంలో రత్నయ్య పరుగెత్తుకు వచ్చాడు.

"ఈవిడ పెట్టె తెచ్చి ఆ గదిలో పెట్టు!" చెప్పాడు కామరాజు.

రత్తయ్య వెళ్ళిపోగానే మంచం కాళ్ళపై ఉన్న తలుపు తెరిచి భారతి అవతల గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది.

## 3

రాజారాం వెనక్కి తిరిగి చూశాడు. జైలు తలుపులు మూసేశారు. తలుపు బయట ఆగిపోయి, ఆకాశాన్నీ, చెట్లనీ, వీధిలో వెళుతున్న మోటారు కార్లనీ, పేవ్మెంట్ల మీద నడుస్తున్న జనాన్ని చూస్తూ అయిదు నిముషాల పాటు ఉండి పోయాడు. ఇప్పుడు తను ఎక్కడికి ఇష్టమైతే అక్కడికి వెళ్ళవచ్చు. ఎవరితో మాట్లాడదలచుకుంటే వాళ్ళతో మాట్లాడవచ్చు. పదేళ్ళ తర్వాత మళ్ళీ ప్రపంచంలోకి వచ్చాడు. గట్టిగా ఊపిరి పీల్చాడు. పదేళ్ళు జైలులో గడిపాననే విచారం కన్నా విడుదలయ్యాననే సంతోషమే అతనిలో ఎక్కువగా ఉంది.

చక చక నడుస్తున్నాడు. శుభ్రమైన బట్టలు, నున్నగా గీసుకున్న గెడ్డం చూసి, అతను జైలునుంచి వస్తున్న మనిషి అని ఎవరూ అనుకోలేరు. ఆరు అడుగుల మనిషి, ఉంగరాల జుట్టు, ఛామనఛాయ, కొంచెం పీక్కుపోయినట్లున్న మొహం. చిన్న కళ్ళు, దట్టమైన కనుబొమలు, ఒంటిమీద కండ లేదు కానీ బలమైన ఎముకలు. చుట్టూ చూసుకుంటూ నడుస్తున్నాడు రాజారాం.

సెంట్రల్ బ్రిడ్జ్ వరకూ వెళ్ళాక ఒకసారి వెనక్కి చూసి నిట్టూర్చి మళ్ళీ ఆ జైలు లోపలికి వెళ్ళకూడదని నిశ్చయించుకుని ముందుకు అడుగు వేశాడు.

"అన్నయ్యా!"

ఎవరో ఎవర్నో పిలుస్తున్నారు. ఇంకో అడుగు వేశాడు.

"అన్నయ్యా! ఆగు! నిన్నే!"

రాజారాం ఆగి పక్కకి తిరిగాడు. బ్రిడ్జి పిట్టగోడ ఆనుకుని నిలుచున్నది ఓ యువతి. తనవైపే చూస్తోంది.

"నన్నా?" అడిగాడు రాజారాం.

"అవును, నిన్నే! గుర్తు పట్టలేదూ? నేను సావిత్రిని."

రాజారాం కళ్ళప్పగించి చూశాడు ఆ యువతిని.

"ఏవరూ? నువ్వు సావిత్రివా?"

ఆమె తలూపి నవ్వింది. "అవును అన్నయ్యా! నేను సావిత్రినే! నువ్వసలు మారనే లేదు. నేను మారిపోయాను కదూ! నువ్వు జైలుకి వెళ్ళినపుడు నాకు ఎనిమిదేళ్ళు!"

రాజారాం తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. అతను జైలుకి వెళ్ళినపుడు సావిత్రికి ఎనిమిదేళ్ళు.. నిజమే. ఎనిమిదేళ్ళ పిల్ల పద్దెనిమిదేళ్ళ యువతిగా మారినపుడు గుర్తు పట్టడం కష్టమే! పరికిణీ, చొక్కా, చింపిరి జుట్టు, చేతులకి కట్టు గాజులు - ఎండిపోయినట్లు బక్కగా ఉండే ఎనిమిదేళ్ళ సావిత్రి దాదాపు అయిదున్నర అడుగుల పొడుగు, ఆ పొడుగుకి తగ్గ లావు, ఛామనఛాయ, ఒత్తయిన నల్లని గీతలు గీసినట్లున్న కనుబొమలు, కాటుక కళ్ళు, గులాబీ రంగు పెదిమలు, నిండు చెంపలు, కుదురుగా ఉన్న మెడ, మెళ్ళో మెరుస్తున్న హారం, ప్రింటెడ్ జాకెట్, వాయిల్ చీర, చేతులకి బంగారంలా మెరుస్తున్న రెండేసి గాజులు, గోళ్ళకి ఎర్రని రంగు, వేళ్ళకి ఉంగరాలు, నగిషీలు కుట్టిన చెప్పులు చూసి, "నువ్వు సావిత్రివి అంటే నమ్మలేకుండా ఉన్నాను" అన్నాడు రాజారాం.

సావిత్రి పక పక నవ్వి "ముందు ఇక్కణ్ణించి వెళదాం పద!" అని అతని పక్కకి వెళ్ళి చెయ్యి పట్టుకుని "పద!" అన్నది.

ఇద్దరూ సెంట్రల్ వైపు నడుస్తున్నారు.

"నీ విషయం చెప్పు! ఎక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు?" అడిగాడు రాజారాం.

"ఏముంది చెప్పడానికి! నువ్వు జైలుకి వెళ్ళిపోగానే నేను ఒంటరిదాన్ని అయిపోయాను. ఇంటివాళ్ళు ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నారు. పిల్లలకి స్కూలుకి అన్నం తీసుకెళ్ళడానికి, ఇంట్లో చిల్లర పనులు చెయడానికి, ఒక ఇంట్లో  కుదిరాను. భోజనమూ, ఉండడమూ వాళ్ళ ఇంట్లోనే. రెండేళ్ళ తర్వాత ఆ ఇంటి యజమానికి బదిలీ అయి వెళ్ళిపోయాడు. ఇంకో ఇంట్లో పనికి చేరాను, నాకు పదహారు ఏళ్ళు వచ్చేంతవరకూ అలాగే జరిగిపోయింది."

"తర్వాత?" అడిగాడు రాజారాం.

"నేను ఆఖరుసారి పనికి కుదిరిన ఇంటి యజమాని భార్య పోయింది. వాళ్ళకి పిల్లలు లేరు భార్య పోయిన తర్వాత కూడా నన్ను పనిలో అట్టేపెట్టుకున్నాడు ఆయన. ఇంట్లో ఒంటిగా మొగాడు, పదిహేనేళ్ళ పిల్లని నేనూ ఉంటే ఏం జరుగుతుందో అదే జరిగింది" అని నవ్వింది సావిత్రి.

"అతనికెన్నేళ్ళు! ఉద్యోగం ఏమిటి?" అడిగాడు రాజారాం,

"నలభై అయిదు. గవర్నమెంటు ఉద్యోగం. నెల తప్పింది నాకు. గొడవ చేశాను డబ్బు ఇస్తాననీ, నన్ను ఇంకో ఊరు వెళ్ళిపొమ్మని బతిమాలుకున్నాడు ఆయన. పెళ్ళి చేసుకుంటే కాని వీల్లేదని పట్టుపట్టాను.పెళ్ళి చేసుకున్నాడు."

రాజారాం చెల్లెలి తెలివికి ముచ్చటపడి "గాలం వేసి పట్టావన్నమాట" అన్నాడు.

"పెళ్ళయిన ఏడాదికే జబ్బు చేసి నా భర్త పోయాడు."

"పిల్లా! పిల్లడా!"

సావిత్రి తలతిప్పి "నాలుగో నెలలోనే పోయింది. ఇప్పుడు నేను ఒంటరిదాన్ని. వితంతువుని. నెలకి అరవై రూపాయలు పెన్షను వస్తుంది. మా వారి ఇన్సూరెన్సు డబ్బు కొంత వచ్చింది"

"ఏమాత్రం?" అడిగాడు రాజారాం ఆత్రంగా.

"అయిదువేలు."

"ఉండడం ఎక్కడ?"

"ట్రిప్లికేనులో. పద ఇంటికి పోదాం" అని టాక్సీని పిలిచింది సావిత్రి.

## 4

"నా గదిలో కూడా కాలింగ్‌బెల్ పెట్టిస్తే మంచింది. మీ కేదయినా అవసరమయితే పిలవచ్చు" అన్నది భారతి ఔన్సు గ్లాసులో మందు పోస్తూ.

"మంచం మీంచి కదలలేని మనిషిని కాను. అయినా రేపు ఏర్పాటు చేయిస్తాలే. పిలిచినా మెలుకువరానంత మొద్దు నిద్రపోతావా ఏమిటి?" అడిగాడు కామరాజు నవ్వుతూ.

ఔన్సు గ్లాసు కామరాజుకి అందించి చేతిగడియారం చూసుకుంది భారతి. తొమ్మిదిగంటలయింది. కిటికీలోంచి బయటికి చూసింది. ఆకాశం నల్లగా ఉంది. చెట్ల ఆకారాలు కూడా కనిపించటంలేదు.

"భోజనానికి నువు వంట ఇంటికి వెళ్ళినా సరే - నీ గదికి భోజనం తెమ్మన్నా సరే." అన్నాడు కామరాజు.

"డ్రెస్ మార్చుకుని వంట ఇంట్లోకే వెళతాను." అన్నది భారతి తను తొడుక్కున్న తెల్లగౌను వంక చూస్తూ.

"ఈ నర్సు యూనిఫాం దేనికి! ఇది ఆస్పత్రికాదుగా!!" అన్నాడు కామరాజు.

"ఇందులో ఓ కిటుకుంది, పేషెంటు చెప్పిన మాట వింటారు" అన్నది భారతి నవ్వుతూ.

కామరాజు భారతిని తదేకంగా చూశాడు. గులాబీరంగు ఒళ్ళు. లేతగా ఉన్న ఆ ఒంటి నునుపు మెరుస్తున కళ్ళు కట్టేస్తునాయి. నడుం నుంచి బుట్టలా మోకాళ్ళవరకూ గౌను, ఒంటి ఒంపులను ఎంత దాచాలని ఆమె ప్రయత్నించినా దాగడం లేదు. నున్నని మెడ, మెళ్ళో సన్నని బంగారం గొలుసు, గుండ్రని మొహం, మామిడి పండులా ఉన్న గెడ్డం, రెండు బుగ్గల మీదా నవ్వినప్పుడు పడే రెండు చిన్న గుంటలు, అప్పుడే రేకులు విచ్చుకున్న గులాబీ పువ్వులా ఉన్న నోరు, చాలా ఎర్రగా ఉన్న కింద పెదిమ, తాంబూలం వేసుకున్నట్టు తడితో మెరుస్తోంది. నవ్వినప్పుడు, మాట్లాడుతున్నప్పుడు పై పళ్ళవరస పెదిమల మధ్య నుంచీ కనీ కనిపించకుండా దాగుడు మూతలు ఆడుతోంది. గర్వమూ, అహంకారమూ ఎక్కువేమోననిపించే పల్చని ముక్కు, తలకి కట్టుకున్న తెల్లని బట్టకిందనుంచి నొక్కులు తిరిగిన కురులు కణతల మీదా చెంపల మీదగా పడుతున్నాయి. నల్లని కాటుక కళ్ళు. తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, పువ్వు రేకులలాంటి కను రెప్పలు. ఆ రెప్పలకి ఈనెల్లా ఉన్న వెంట్రుకలు, నవ్వుతున్నప్పుడు ముడుచుకుని రెప్పల మధ్యనుంచి వజ్రాలమల్లే మెరిసే కళ్ళు.

"ఇలా కూర్చోమ్మా"! అన్నాడు కామరాజు చేత్తో తన పక్కన చూపిస్తూ.

భారతి నిస్సంకోచంగా కామరాజు పక్కన కూర్చుని ప్రశ్నార్థకంగా చూసింది,

"నువ్వు చాలా అందమైన దానివని నీకు తెలియదా!" అన్నాడు కామరాజు.

భారతి ఆశ్చర్యంతో చూసింది ఆ వృద్ధుణ్ణి. ఆయనకి అటువంటి వికారం ఉందని అనుకోలేదు. కొంచెం దూరంగా జరిగింది.

కామరాజు నవ్వి "భయపడక, దురుద్దేశంతో ఆ మాట అనలేదు నేను. ఆ అందం తనకు కావాలనే స్వార్థం లేకపోతే అందాన్ని చూసి మెచ్చుకోవటంలో తప్పులేదు. అమ్మాయి భారతీ! ఏ అందమైన యువకుణ్ణో పెళ్ళి చేసుకుని, అతన్ని సుఖపెడుతూ, పిల్లల్ని కనిపెంచవలసినదానివి నాలాంటి ఓ ముసలాడికి ఉపచర్యలు చేస్తూ కాలం గడపడం న్యాయంగా లేదు నాకు" అన్నాడు.

"జబ్బు చేసిన వాళ్ళకి ఉపచర్యలు చెయ్యడం జీవితం వృధా చెయ్యడం అని నాకు అనిపించలేదు - ఎవరూ చెప్పలేదు"

"నువ్వు చేస్తున్న పని గొప్పదే అందులో సందేహం లేదు. కాని ఈ పని ఇంకే స్త్రీ అయినా చెయ్యగలదు. ఇంత అందం అనవసరం. నర్సు ఎందుకు అయ్యావు! నీకు తండ్రీ, తల్లీ లేరా!" అడిగాడు కామరాజు.

అతని ప్రశ్నలలో ఆదరణా, వాత్సల్యమూ ధ్వనించాయి. తండ్రిపోయి చాలాకాలం అయిందని, ఆస్తి లేదనీ, పిల్లల పోషణార్థం తల్లి వంట మనిషిగా పనిచేసి, తనకు చదువు చెప్పించిందనీ, తల్లికి ఆరోగ్యం సరిగా లేదనీ, తల్లినీ, తమ్ముణ్ణీ పోషించవలసిన బాధ్యత తనదేననీ తమ్ముడు పెద్దవాడయి, సంపాదన ప్రారంభించేవరకూ తను ఉద్యోగం చెయ్యవలిసిందేననీ చెప్పింది భారతి.

"నీ తల్లి అదృష్టవంతురాలు. వెళ్ళమ్మా! వెళ్ళు! భోంచేసి పడుకో!" అన్నాడు కామరాజు.

భారతి తన గదిలోకి వెళ్ళి లోపల గడియపెట్టి, రెండో వైపునుంచీ బయటికి వెళ్ళి, మెట్లు దిగి వంట ఇంట్లోకి వెళ్ళింది. వంటమనిషి సుబ్బయ్య లేచి నిలబడి "రండమ్మా రండి! మీ కోసమే కాచుకున్నాను" అన్నాడు.

భారతి భోజనం ముగించుకుని మేడమీదకి వెళ్ళింది. తన గదికీ కామరాజు గదికీ మధ్య ఉన్న తలుపు నెమ్మదిగా తోసి చూసింది.

కామరాజు నిద్రపోతున్నాడు. తలుపు దగ్గిరకేసి, తన గదిలో దీపం వెలిగించింది. ఒక మంచమూ, బల్లా, రెండు కుర్చీలు, ఒక పడక కుర్చీ ఉన్నాయి పైన ఫాను ఉంది. ఒక డ్రెస్సింగ్ టేబుల్, దాని పక్కన ఓ చిన్న బీరువా ఉన్నాయి. ఆ బీరువాకి తాళం చెవి తగిలించి ఉంది. కిటికీ పక్కన ఇంకో పెద్ద బీరువా ఉంది. భారతి చిన్న బీరువా తెరిచి బట్టలు అందులో సర్దుకుంది. నర్సు యూనిఫాం విప్పేసి, తెల్ల వాయిల్ చీర కట్టుకుని, జడ విప్పి వదులుగా వేసుకుని, నుదురుకి చెవులకి ఉడుకులాం పూసుకుని, దీపం ఆర్పేసి మంచం మీద వాలిపోయింది. కామరాజు గదిలో బెడ్‌రూం లైటు వెలుగు కొద్దిగా తలుపు సందులోంచి తన గదిలో పడుతోంది. భారతికి వెంటనే నిద్రపట్టలేదు. ఏవో ఆలోచనలు. ఒక దారితెన్నూ లేనివి ఓ క్రమం లేనివి, ఆలోచించాలని ఆలోచించేవి కానివి మెదడులో తిరుగుతున్నాయి.

ఎక్కడో కరకరమని చప్పుడయినట్లు అనిపించి మగత నిద్రలోంచి మేల్కొన్నది, కిటికీ రెక్కలు తెరిచి ఉన్నాయి. బయట బాగా చీకటిగా ఉండడంవల్ల ఏమీ కనిపించటం లేదు. కళ్ళు మూసుకుని దుప్పటి మెడవరకూ కప్పుకున్నది. మళ్ళీ కరకర చప్పుడు ప్రారంభం అయింది. పెద్ద చప్పుడేమీ కాకపోయినా ఆ నిశ్శబ్దంలో చెవుల్లో గింగురుమంటున్నది. ఎక్కణ్ణించీ వస్తోంది? ఎందుకు వస్తోంది? భారతి లేచి కూర్చుంది. శబ్దం ఆగిపోయింది. విచిత్రంగా ఉన్నదే అనుకుంటూ చెవులు రిక్కించుకుని విన్నది. రెండు నిమిషాల తర్వాత మళ్ళీ ప్రారంభం అయింది చప్పుడు. భారతి మంచం మీదనుంచీ లేచి కిటికీ దగ్గిరికి వెళ్ళి ఊచలు పట్టుకుని కిందకి చూసింది. ఏమీ కనిపించలేదు. చప్పుడు మళ్ళీ ఆగిపోయింది. కామరాజు గదిలోంచి ఆ చప్పుడు వస్తున్నదేమోనని మధ్య తలుపు కొద్దిగా తెరిచి చూసింది కామరాజు సుఖంగా నిద్రపోతున్నాడు. తలుపు దగ్గరకివేసి ఆలోచిస్తూ మంచం వేపు తిరిగింది. మళ్ళీ చప్పుడు ప్రారంభం అయింది. టక టక, కర కరమనే చప్పుడు తను కదిలినా, ఏ కొంచెం చప్పుడు చేసినా ఆ శబ్దం ఆగిపోతోంది. భారతి అడుగులో అడుగు వేసుకుంటూ శబ్దం వస్తున్న వైపు వెళ్ళింది. పెద్ద బీరువాలోంచి వస్తున్నాయి చప్పుళ్ళు. భారతి జాగ్రత్తగా విని తనలో తను నవ్వుకుంది. ఎలుకలు అయ్యుంటాయి. బీరువాలో చేరి గొడవ చేస్తున్నాయి. బీరువా తలుపుకి ఉన్న పిడి పట్టుకుని లాగింది. తలుపు తెరుచుకోలేదు. మళ్ళీ లాగింది.

పూర్తిగా చీకటిగా లేదు కాని, స్పష్టంగా కనిపించే వెలుగు లేదు గదిలో. బీరువా తలుపు తెరుచుకుంది. బీరువా లోంచి ఏదో వచ్చి మీద పడ్డది - చిన్నది కాదు - ఎలుక కాదు - పిల్లికాదు. తన కన్నా పొడుగ్గా ఉంది. భారతి గుండె ఆగిపోయినంత పనయింది. నోటమాట రాలేదు. అరవడానికి వీల్లేకుండా గొంతు పూడుకుపోయింది. బీరువా లోంచి మీదకొచ్చి తన భుజాల మీద చేతులు వేసింది. అస్తిపంజరం, పుర్రె తన మొహానికి తగులుతోంది. మీద పడుతున్నప్పుడు చూసింది కళ్ళు ఉండవలసిన రెండు కంతల్లోనూ ఏదో మెరుస్తోంది.

అస్తిపంజరం తన మీద పడి తనని కౌగిలించుకుంది.

భారతి భయంతో వణుకుతోంది, నేలమీద కుప్పగా కూలిపోయింది. తనతోపాటు తన మీద కుప్పగా పడింది ఆ అస్తిపంజరం. కర్ర ముక్కలలా ఉన్న ఎముకలు వీపుకి గుచ్చుకుంటున్నాయి. భుజం మీద పుర్రె ఊగుతోంది. ఎముకలు తన పొట్టకి రాసుకుంటున్నాయి. భారతికి పిచ్చెక్కినట్లయింది. కాని తనతోపాటు తన వెనకే ఆ అస్తిపంజరం కూడా పరిగెత్తితే? తను అరవగానే అది ఎముకల చేత్తో తన నోరు నొక్కేస్తే!? అస్తిపంజరం దవడ ఎముక తన చెంపకి ఆనించింది. భారతి వెనక్కి జారిగిలబడి తల విదిలించింది, పుర్రె ఇటూ అటూ కదిలి తన మొహం మీదకు వచ్చింది. ముద్దుపెట్టుకుంటున్నట్టు తన మొహం మీద వాలింది ఆ పుర్రె.

భారతికి ఎముకలన్నా, శవాలన్నా భయంలేదు. నర్సింగ్ శిక్షణ పొందుతున్నప్పుడు భయం పోయింది. కాని ఆపరేష థియేటర్లోనో, క్లాసురూంలోనో శవాల్ని, అస్తిపంజరాల్ని పరీక్షించడం వేరు, ఇది వేరు,

ధైర్యం, మనోబలం కూడదీసుకుని "ఎవరు నువ్వు? దెయ్యానివా? ఎందుకు నా మీద పడుతున్నావు? " అడిగింది భారతి.

అస్తిపంజరం జవాబు చెప్పలేదు.

"ఛీ! అవతలకి పో!" అని ఒక తోపు తోసింది.

ఆ ఎముకలగూడు భారతికి దూరంగా కుప్పగా నేలమీద పడిపోయింది.

ముచ్చెమటలు పోశాయి భారతికి. గజగజ ఒణికిపోతోంది. పరుగెత్తి వెళ్ళి అవతల గదిలో నిద్రపోతున్న కామరాజుని నిద్రలేపాలనుకున్నది. కాని అసలే గుండె జబ్బుతో బాధపడుతున్న కామరాజు ఈ దృశ్యం చూస్తే గుండె ఆగిపోవచ్చు.

భారతి కళ్ళు మూసుకుని, క్షణం పాటు భగవంతుని ప్రార్థించి కళ్ళు తెరిచింది. ఆ అస్తిపంజరం అలాగే నేలమీద ఉంది.

"ఎవరు నువ్వు? చెప్పు!"

అస్తిపంజరం మాట్లాడలేదు. భారతి నిర్భయంగా నడిచింది. వెనక్కి తిరిగి చూడలేదు. తను వెనక్కి తిరగగానే అస్తిపంజరం కూడా లేచి తన వెనకే వచ్చి తనని పట్టుకుంటుందనే భయంతో రక్తం గడ్డకట్టిపోతోంది. అడుగు తీసి అడుగు వెయ్యడానికి ఎంతో శక్తి కావలసివస్తోంది.

నెమ్మదిగా వెళ్ళి దీపం వెలిగించింది. గదిలో వెలుగుపడిన మరుక్షణం అస్తిపంజరం అదృశ్యమవుతుందనుకున్నది.

దీపం వెలిగించి, కళ్ళు నులుపుకుని నేల మీద చూసింది. బీరువాకి రెండడుగుల దూరంలో నేలమీద ఎముకల కుప్ప ఉన్నది. పుర్రె మాత్రం కదులుతోంది. కిటికీలోంచి చల్లని గాలి వస్తోంది. భారతి ఆ అస్తిపంజరాన్ని చూస్తూ నిలబడిపోయింది.

## 5

"మీ మామయ్యకి ఒంట్లో బాగాలేదట. సాయంకాలం డాక్టర్ సుదర్శనం కనిపించి చెప్పాడు" అన్నాడు వైకుంఠరావు పడక కుర్చీలో కూర్చుంటూ.

"ఏం జబ్బు?" అడిగింది పద్మ చదువుతున్న పుస్తకం మీద నుంచీ దృష్టి మరల్చకుండా,

"గుండె జబ్బుట మంచం మీదనుంచీ కదలడానికి వీలు లేదట, ఏక్షణాన్నయినా ప్రమాదం కలగవచ్చని చెప్పాడు డాక్టర్."

"పట్నంలో ఏ నర్సింగ్ హోంలో నైనా చేరకూడదూ ఆ మారుమూల ఎక్కడో విసిరి పారేసినట్లున్న చోట ఉండకపోతే!" అన్నది పద్మ విసుగ్గా.

"రేపు పొద్దున్న మనం అక్కడకి వెళుతున్నాం." అన్నాడు వైకుంఠరావు చుట్ట వెలిగిస్తూ,

పద్మ పుస్తకం మూసేసి తండ్రివైపు చూసి 'నేనెందుకు! నువ్వు వెళ్ళి చూసిరా!" అన్నది.

"బావుండదు. నువ్వూ రావాలి!"

"రేపు బయలుదేరడానికి వీల్లేదు, నేనూ నా స్నేహితురాళ్ళం కలిసి రేపు సాయకాలం సినిమాకి టిక్కెట్లు బుక్ చేసాము."

వైకుంఠరావు కూతుర్ని కోపంగా చూస్తూ "టిక్కెట్టు వృథా అవకుండా ఇంకెవరికయినా ఇయ్యి. రేపొద్దున్న మనం బయలుదేరుతున్నాము. అది నిశ్చయం" అన్నాడు.

పద్మ తండ్రిని తీక్షణంగా చూస్తూ మౌనంగా ఉండి పోయింది.

వైకుంఠరావు కూతుర్ని చాలా గారాబంగా పెంచిన మాట నిజమే అడిగిందల్లా ఇచ్చేవాడు. పద్మ నాలుగో ఏటే తల్లిని పోగొట్టుకుంది. అప్పట్నించీ వైకుంఠరావే పద్మకి తల్లీ, తండ్రి.

"ఆ మారుమూల నాకేం తోస్తుంది నాన్నా!" అన్నది పద్మ.

వైకుంఠరావు కుర్చీలోంచి లేచి పద్మ దగ్గరికి వెళ్ళి తల నిమురుతూ "పద్మా! పంతొమ్మిదేళ్ళు వచ్చాయి నీకు. ఇంకా ఇలా చిన్నపిల్లలా మారాం చేస్తే ఎలా చెప్పు! నాకూ యాభై ఐదేళ్ళు నిండాయి. రిటైర్ అయ్యాను. వచ్చే పెన్షన్ మన జీవనానికి సరిపోవడంలేదు. సంపాదన ఉన్న రోజుల్లో జాగ్రత్త పడి వెనక వెయ్యలేదు. నేను చటుకున కన్ను మూస్తే నీ గతేం కాను!" అన్నాడు.

"ఇప్పుడా విషయం దేనికి?" అన్నది పద్మ.

"స్కూలు ఫైనల్ వరకూ చదివి మానేశావు. ఇంకా చదివి ఏ డాక్టరు పరీక్షో పాసవడం మంచిది అంటే విన్నావు కావు. రెండేళ్ళయిది. చదువు మానేసి. నీకు పెళ్ళి కావాలా! కట్నం ఇవ్వనిదే అల్లుడు దొరకడు. కట్నం ఇవ్వడానికి నా దగ్గిర డబ్బులేదు అవి నీకు తెలుసు - నీ గతేం కాను!"

"అందుకని?" అడిగింది పద్మ.

"శేఖరం అమెరికాలో చదువుతున్నాడు నీ చిన్నప్పుడు మీ అమ్మ, మీ మామయ్య మీ ఇద్దరి విషయం అనుకునే వాళ్ళు, అందుకే అక్కడికి వెళదాం."

"శేఖరం లేడుగా అక్కడ?"

"శేఖరం లేకపోతేనేం? మీ మామయ్య మాట ఇస్తే చాలదూ?"

"శేఖరం గురించి మామయ్య మాట ఇస్తాడని అనుకోను."

"అదంతా నీకెందుకు! రేపు పొద్దున్న బయలుదేరుతున్నాం" అన్నాడు వైకుంఠరావు.

## 6

"ఏం రా! ఏమైంది?" అడిగాడు లింగమూర్తి, కొడుకు లోపలికి రాగానే.

ప్రసాద్ టై ఊడదీస్తూ "ఏమవుతుంది! నాకన్నా పెద్ద చదువులు చదివిన వాళ్ళు వచ్చారు." అన్నాడు నీరసంగా.

"బి.ఏ. ప్యాసయ్యావు. ఉద్యోగం దొరక్క ఏమవుతుంది! కొంచెం ఓపిక పడితే సరి!" అంటూ కాఫీ గ్లాసు అందించింది భానుమతి కొడుక్కి.

"మీ పెదనాన్నకి ఒంట్లో బాగాలేదట. గుండె జబ్బుట, మంచం మీదే ఉన్నాడుట ఉత్తరం వచ్చింది" అన్నాడు లింగమూర్తి కొడుక్కి ఉత్తరం అందిస్తూ.

ప్రసాద్ ఉత్తరం చదివి మడిచి తండ్రి చేతికిచ్చి "చూడటానికి వెళుతున్నావా?" అడిగాడు.

"రేపు బయలుదేరుదాం" అన్నాడు లింగమూర్తి.

"బయలుదేరుదాం అంటున్నావు - నేనెందుకు?"

"నువ్వేకాదు మీ అమ్మకూడా."

"సారీ నాన్నా! ఆ మెడికల్ కంపెనీకి నిన్న దరఖాస్తు పడేశాను. బహుశా ఒకటి రెండు రోజుల్లో జవాబు రావచ్చు. తీరా ఇంటర్వ్యూకి రమ్మంటే ఎనిమిదివందల మైళ్ళు ప్రయాణం చెయ్యాలి" అన్నాడు ప్రసాద్.

"అంతదూరం పోవడమెందుకు! నీ పెద్దనాన్నకి చాలా వ్యాపారాలున్నాయి. మంచి పరపతీ ఉన్నది. క్షణంలో నీకు ఉద్యోగం ఇప్పించగలడు."

"నీకంత నమ్మకం ఉంటే సరే! నాకు కావలసింది ఉద్యోగం."

రాత్రి పడుకున్నాక "ఏమండీ! బావగారు మనవాడికి కూడా కొంత ఆస్తి రాస్తారంటారా!" భర్తని అడిగింది భానుమతి రహస్యంగా.

"ఏమో చూడాలి. శేఖర్ అమెరికాలో ఉన్నాడు. అన్నయ్యకి జబ్బుగా ఉంది. సమయానికి వెళ్ళి కాస్త తోడుగా, సహాయంగా ఉంటే అభిమానం కొద్దీ కొంత ఇవ్వవచ్చు. అదే నా ఆశ." అన్నాడు లింగమూర్తి.

లింగమూర్తి కామరాజుని చూసి అయిదేళ్ళయింది. అదీ కామరాజు ఏదో పనిమీద బొంబాయి వచ్చినప్పుడు కలుసుకున్నాడు. లింగమూర్తి బొంబాయిలో ఒక ఫ్యాక్టరిలో టైపిస్టుగా చేరి ఇరవయి అయిదేళ్ళు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. పెన్షన్ వచ్చే ఉద్యోగం కాదు. గ్రాట్యుటీ కొంత వచ్చింది. కొడుక్కి ఉద్యోగం దొరికి, తనని పోషించేటంతవరకూ ఆ డబ్బు పొదుపుగా వాడుకోవాలి. రెండేళ్ళయినా ప్రసాద్‌కి ఉద్యోగం దొరకలేదు, డబ్బు అయిపోవస్తోంది. మద్రాసుకి వెళ్ళి కామరాజు ఇంట్లో ఉంటే ఖర్చు ఉండదు, ప్రసాద్‌కి ఉద్యోగం దొరుకుతుంది అనే ఆశతో బొంబాయినుంచి మకాం మార్చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు.

"బావగారు మనల్ని రమ్మని రాయలేదు కదండీ! మూటా ముల్లే కట్టుకుని వెళితే ఆయన ఏమైనా అనుకుంటారేమో!" అన్నది భానుమతి.

లింగమూర్తి నవ్వాడు. "అన్నయ్య  అలాంటివాడు కాడు. పైగా లంకంత ఇల్లు. ఆ ఇంటికంతటికీ ఒక్కడూను. అప్పుడు ఇక్కడికి వచ్చినప్పుడే నన్ను మద్రాసుకి రమ్మని చెప్పాడు. ఇంకా ఉద్యోగంలో ఉన్నాననీ, రిటయిర్ అయినా తర్వాత ఆలోచిస్తాననీ చెప్పాను" అన్నాడు లింగమూర్తి.

## 7

తెల తెలవారుతుండగా కామరాజు నిద్ర లేచాడు. రాత్రి నిద్రమందు తీసుకోవడం వల్ల మొద్దు నిద్రపోయాడు. లేచి కిటికీలకి ఉన్న తెరలు పక్కకి తీసేశాడు. నీళ్ళ గదిలోకి వెళ్ళడానికి వెనక్కి తిరిగాడు. అప్పుడు చూశాడు పడక కుర్చీలో పడుకున్న భారతిని.

భారతి తన గదిలోకి ఎందుకు వచ్చింది! రాత్రి తనకి తెలియకుండానే తను నిద్రలేచి గొడవ చేశాడా! పాపం! తనకి శుశ్రూష చేస్తూ ఆ పడక కుర్చీలో కూర్చుని నిద్రపోయినట్లుంది. భారతిని లేపి, లేచి వెళ్ళి సుఖంగా పక్క మీద పడుకోమని చెబుదామనుకున్నాడు. లేపితే మళ్ళీ నిద్రపోదు అనుకుని నీళ్ళ గదిలోకి వెళ్ళి అరగంట తర్వాత మళ్ళీ తన గదిలోకి వచ్చి తల తుడుచుకుంటూ భారతి ఇంకా నిద్ర పోతూ ఉండడం చూసి బెల్ నొక్కి, రత్తయ్య రాగానే రెండు కప్పుల కాఫీ తెమ్మని చెప్పి "భారతీ! భారతీ" అని పిలిచాడు కామరాజు.

భారతి ఇటునుంచి అటు కదిలింది.

"అమ్మాయిలే! కాఫీ తాగి వెళ్ళి నీ గదిలో పడుకో!" అన్నాడు కామరాజు భారతి భుజం మీద మృదువుగా తట్టుతూ.

భారతి కళ్ళు తెరిచింది. క్షణంపాటు తనెక్కడ ఉన్నదీ, తన ముందు ఎవరున్నదీ తెలియనట్లు చూసి, తర్వాత జ్ఞాపకం వచ్చి చటుక్కున లేచి నిలుచుని "సారీ! ఒళ్ళు తెలియనంత మొద్దు నిద్ర పట్టింది" అన్నది.

"ఫర్వాలేదులే. ముందు నువ్వు మొహం కడుక్కురా, కాఫీ వస్తోంది." అన్నాడు కామరాజు.

కాఫీ తాగుతుండగా "రాత్రి నేను నిద్ర లేచానా. జ్ఞాపకం లేదే?" అడిగాడు కామరాజు.

"మీరా! నిద్ర లేవలేదు, బాగా నిద్రపోయారు"

"అయితే నువ్వు నా గదిలోకి వచ్చి ఎందుకుపడుకున్నావు!" అడిగాడు కామరాజు ఆశ్చర్యంతో.

భారతి నవ్వి "భయమేసింది. అందువల్ల వచ్చి పడుకున్నాను" అంది.

"పిచ్చి పిల్లా! నన్ను లేపకపోయావా! పీడకల వచ్చిందా!"

"లేదు, మెలుకువ ఉండగానే భయం వేసింది. ఆ గదిలో ఓ అస్తిపంజరం ఉందని నాకు తెలియదు."

"అస్తిపంజరమా!"

"అవును అస్తిపంజరమే! బీరువాలో ఏదో చప్పుడయ్యేటప్పటికి తలుపు తెరిచాను. నా మీద పడింది ఆ ఆస్తిపంజరం. ప్రాణాలు ఎగిరిపోయినంత పనయింది."

"తర్వాత?"

"దీపం వెలిగించి చూశాను. నేలమీద ఎముకుల కుప్ప. మీ గదిలోకి వచ్చి మధ్య తలుపు గడియ పెట్టి పడక కుర్చీలో పడుకున్నాను."

కామరాజు చటుక్కున లేచి అవతల గదిలోకి వెళ్ళాడు. అతని వెనకే భారతీ వెళ్ళి మధ్య తలుపు దగ్గర నిలబడి లోపలికి చూసింది. అస్తిపంజరం ఇంకా అక్కడే ఉంటుందని అనుకోలేదు ఆమె. కాని ఎముకల కుప్ప నేలమీద అలాగే - రాత్రి తను చూసినట్లుగానే ఉంది.

"ఈ బీరువాలోనా?" అడిగాడు కామరాజు పెద్ద బీరువా చూపిస్తూ. భారతి తల ఊపింది. కామరాజు బీరువా తలుపు తెరిచాడు, బీరువాలోంచి నాలుగు ఎలుకలు ఎగురుతూ బయటికి వచ్చి, బీరువా అడుక్కి వెళ్ళిపోయాయి. రెండు నిమిషాలు కామరాజు బీరువాలో ఏదో పరీక్ష చేసి "పాపం! రాత్రి నువ్వు బాగా దడుసుకునుండాలి. నా కూతురు సీత మెడిసన్ చదువుతుండేది అని చెప్పానుగా. ఈ అస్తిపంజరం ఎక్కడో కొనితెచ్చుకున్నది. ఇక అస్తిపంజరం నీమీద ఎలా పడిందంటావా! చూడు! ఇదుగో! తల ఈ కొక్కికి తగిలించి ఉండాలి. నువ్వు తలుపు తీయగానే, ఎలుకలు ఎగరడంతో, కొక్కెంనుంచీ అస్తిపంజరం ఊడి ముందుకి పడి ఉంటుంది" అన్నాడు కామరాజు.

భారతి బీరువా దగ్గరికి వెళ్ళి పరీక్షగా చూసింది. కామరాజు చెప్పినది నిజమే అయిఉండాలి. లేకపోతే అస్తిపంజరం ఏమిటి మీదకి రావడమేమిటి!

భారతి నవ్వి "అవును. నేను అనవసరంగా దడుచుకున్నాను, కాస్త ధైర్యం తెచ్చుకుని పరీక్షచేసి ఉంటే సరిపోయేది" అన్నది.

అంతలో రత్నయ్య వచ్చి "అయ్యగారూ!" అని పిలిచాడు.

"ఏమిటి!"

"డ్రయివరు మీతో మాట్లాడాలిట"

"రమ్మను." అన్నాడూ కామరాజు తన గదిలోకి వెళుతూ.

డ్రయివర్ గదిలోకి రాగానే "ఏమిటి?" అడిగాడు

"మా అమ్మకి చాలా జబ్బుగా ఉందట. వెంటనే రమ్మని కబురు వచింది." అన్నాడు డ్రయివర్ దీనంగా.

"అలాగా! అయితే ఎన్ని రోజులు శెలవు కావాలి?"

"మళ్ళీ ఎప్పుడు పనిలోకి రాగలుగుతానో తెలియదు సార్!"

కామరాజు మొహం చిట్లించాడు, "ఉన్నట్లుండి, అలా వెళ్ళిపోతే ఇక్కడ మా విషయం! మీ అమ్మని చూసి వెంటనే రా! అవసరమైతే మళ్ళీ వెళ్ళొచ్చు" అన్నాడు.

"చిత్తూరు దగ్గర చిన్న పల్లెటూరు సార్. బస్ కూడా లేదు. ఎడ్ల బండిలో వెళ్ళాలి. ఆ ఊరు చేరుకునేందుకే రెండు రోజులు పడుతుంది"

కామరాజు విసుగుతో చూశాడు.

"అయ్యగారూ నేను వచ్చేంతవరకూ ఇంకో డ్రైవర్ని ఏర్పాటు చేసి వెళతాను."

కామరాజు తలవూపి "ఎవరతను?" అడిగాడు.

"మా దూరపు బంధువులెండి, ఇక్కడే ఉన్నాడు. పిలవనా!"

"పిలు!"

అయిదు నిమిషాలలో డ్రయివర్ ఇంకో మనిషితో తిరిగి వచ్చాడు.

"ఇతనేనండీ!"

"పేరు?" అడిగాడు కామరాజు కొత్తగా వచ్చిన మనిషిని పరీక్షగా చూస్తూ.

"రాజారాం."

"ఇంతకుముందు ఎక్కడ పని చేశావు!"

"రాజారాం జేబులోంచి రెండుకాగితాలు తీసి కామరాజుకిచ్చాడు. తన వద్ద అయిదేళ్ళపాటు డ్రయివర్గా పనిచేశాడనీ, నమ్మకస్తుడనీ, చాలా జాగ్రత్తగా కారు నడుపుతాడనీ, తను కారు అమ్మేయడంవల్ల రాజారాంని పనిలోంచి తీసివెయ్యవలసి వచ్చిందనీ ఉంది ఓ కాయితంలో.

"జీతం, మిగతా వివరాలు చెప్పావా?" అడిగాడు కామరాజు డ్రయివర్ని.

"చెప్పాను! ఒప్పుకున్నాడు. ఇతనికి ఓ చెల్లెలు ఉంది. ఆమె ఇక్కడే ఉంటుందంట."

"ఉండనీ. దానికేం!" అన్నాడు కామరాజు.

"అయితే నేను ఇవాళే వెళ్ళిపోతాను సార్. వీలయినంత త్వరలో వస్తాను" అన్నాడు డ్రయివర్.

కామరాజు దిండు కిందనుంచి పర్సుతీసి, యాభై రూపాయలు ఇచ్చి "మీ అమ్మకి మందు ఇప్పించు, వెళ్ళు!" అన్నాడు.

"ఇవిగో! అయిదువందలు! నేను ఉత్తరం రాస్తాను, అంతవరకూ ఈ ప్రాంతాలకి రాక!" అన్నాడు రాజారాం డ్రయివర్కి డబ్బు ఇస్తూ.

"నన్నీగొడవలోకి ఈడ్వకేం!" అంటూ డ్రయివర్ డబ్బు జేబులో పెట్టుకుని సామాను తీసుకుని అవుట్ హౌస్లోంచి వెళ్ళిపోయాడు.

"ఇప్పటికి అయిదువందలు ఖర్చయింది!" అన్నది సావిత్రి విసుగ్గా.

"కొంచెం ఓపిక పట్టు! నీ అయిదువందలే కాక ఇంకా ఎన్ని వందలు నీచేతిలోకి వచ్చి పడతాయో చూడు!" అన్నాడు రాజారాం నవ్వుతూ.

సావిత్రి ఇంట్లో సామాను సర్దడం ప్రారంభించింది.

వంటిల్లూ, నీళ్ళగదీ కాక ఇంకొక్క గదే ఉంది ఆ అవుట్ హౌస్‌లో. అదే హాలూ, పడక గదీ

"చాలా చిన్న ఇల్లు!" అని మొహం చిట్లించింది సావిత్రి.

"కాసిని రోజులేగా ఇక్కడ ఉండడం! ఆ తర్వాత నీ ఇష్టమొచ్చినంత పెద్ద బంగళా కొనుక్కో!" అన్నాడు రాజారాం.

సామానులు సర్దేసి, సావిత్రి రాజారాం దగ్గరకి వచ్చి "సరేగాని, ఇంతకీ ఇన్నిసార్లు అడిగినా చెప్పవేం! ఆ ఇంట్లో ఉన్నాయా?" అడిగింది.

రాజారాం జవాబు చెప్పలేదు.

"ఆ ఇంట్లో ఉన్నాయని ఊహించానులే. ఎక్కడ ఉన్నాయి? నువ్వు ఎక్కడ దాచావు వాటిని?"

"చెప్పను - చెప్పనని చాలాసార్లు చెప్పాను."

"ఏం నామీద నీకు నమ్మకం లేదా! నేను ఆ నగలు తీసుకుని పారిపోతానని భయమా!"

"సావిత్రీ! ఈ రకమైన వాదన ఇప్పటికి పదిసార్లు సాగింది. నీ మీద నమ్మకం లేకపోవడం కాదని చాలా సార్లు చెప్పాను. ఆ నగలు ఎక్కడ ఉన్నదీ నీకు తెలియడం మంచిది కాదు. నేను పదిసంవత్సరాలు ఆ రహస్యం దాచుకోగలిగాను. ఎవరు నన్ను ఎంత హింసించినా, మభ్యపెట్టినా చెప్పలేదు. కాని నీ విషయం వేరు, తెలియక పోవడం నీకే మంచిది."

"ఈ విషయం నాకు తెలిస్తే ఎవరైనా నన్ను ఎత్తుకు పోయి హింసించి ఆ విషయం కనుక్కుంటారని నీ భయం!"

రాజారాం తల ఊపాడు.

"నాకు ఆ విషయం తెలియకపోయినా, నాకు తెలుసునని ఎత్తుకు వెళ్ళి హింసించవచ్చుగా"

రాజారాం మళ్ళీ తలఊపాడు. "నీకు తెలియని విషయం నువ్వు ఎలా చెప్పగలవు!" అన్నాడు నవ్వుతూ.

"సరే మనం ఇక్కణ్ణించీ ఎప్పుడు వెళతాం!"

"ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా" అన్నాడు రాజారాం.

## 8

"వైకుంఠరామయ్యగారు వచ్చారండీ" అన్నాడు రత్నయ్య.

పిలుచుకు రమ్మని రత్నయ్యతో చెప్పి భారతి వేపు తిరిగి "నా బావమరిది. మద్రాసులో ఉంటున్నాడు" అన్నాడు కామరాజు.

అంతలో వైకుంఠరావు, ఆయన కూతురు పద్మ కామరాజు పడక గదిలోకి వచ్చారు.

"ఏం బావా! ఒంట్లో బాగా లేకపోతే కబురు చెయ్యక పోయావా! నిన్న సాయంత్రం డాక్టరు సుదర్శనం చెప్పాడు. వెంటనే బయలుదేరాం" అన్నాడు వైకుంఠరావు పడక కుర్చీలో కూర్చుంటూ.

"పెద్ద జబ్బేమీ చెయ్యలేదు. ప్రస్తుతం ప్రమాదం ఏమీ లేదు. నాకు శుశ్రూష చేసేందుకు డాక్టరు ఒక నర్సుని కూడా పంపాడు. ఇదుగో ఈ అమ్మాయే" అన్నాడు కామరాజు నవ్వుతూ.

"అయితే మాత్రం! నన్ను తోడుగా ఉండమంటే ఉండమా! పట్నంలో ఏం పనున్నది నాకు!" అంటూ వైకుంఠరావు చుట్టతీసి వెలిగించాడు.

అంతలో రత్నయ్య వచ్చి టెలిగ్రాం వచ్చిందని చెప్పాడు టెలిగ్రామూ, సంతకం పెట్టటానికి కాగితమూ ఇచ్చాడు కామరాజుకి.

"ఎరైవింగ్ టుమారో బాంబే మెయిల్ - లింగమూర్తి"

కామరాజు నవ్వుతూ టెలిగ్రాం మడిచి పెట్టి "బాగానే ఉంది" ఒంట్లో బాగాలేదనీ ఇంట్లోనే ఉంటున్నాననీ బయటికి వెళ్ళటం లేదనీ లింగమూర్తికి రాశాను. అంతమాత్రానికే కంగారుపడి బయలుదేరి వస్తున్నాడు" అన్నాడు వైకుంఠరావుతో.

వైకుంఠరావు మొహం చిట్లించి "అంత దూరం నుంచీ వస్తున్నాడా! ఉత్త కంగారు మనిషి" అన్నాడు.

కామరాజు రత్నయ్యని పిలిచి మర్నాడు ప్రొద్దున్నే బొంబాయి మెయిల్ టైముకి సెంట్రల్‌కి కారు తీసుకు వెళ్ళమని డ్రయివర్‌కి చెప్పమన్నాడు.

రత్నయ్య తలఊపి "అయ్యగారూ! తోటమాలి మీతో ఏదో మాట్లాడాలట" అన్నాడు.

"తోటమాలి మాట్లాడాలా! ఏం మాట్లాడాలట!"

"పని మానుకుంటాడట. ఆ విషయం మీతో చెపుతానంటున్నాడు."

"బాగానే ఉంది డ్రైవరు పని మానుకుని వెళ్ళిపోయాడు. ఇప్పుడు తోటమాలా! ఏం వచ్చింది వీళ్ళకి! ఇట్లా రమ్మను".

చేతులు జోడించుకుని యాభై ఏళ్ళ తోటమాలి గదిలోకి వచ్చాడు.

"ఏమోయ్! పని మానేస్తున్నావట? ఎందుకు?" అడిగాడు కామరాజు.

"మావాడికి ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికిందట నెలకి నూటాయాభై జీతం వస్తుందట. ఇంకా పని చెయ్యడం ఎందుకు వచ్చి తన దగ్గర ఉండమని పోరు పెట్టుతున్నాడు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను." అన్నాడు తోటమాలి.

ఎండిపోయిన శరీరం, ముడతలు పడ్డ మొహం, పీక్కుపోయిన కళ్ళు, యాభై ఏళ్ళకే డెబ్బై ఏళ్ళవాడిలా అయిపోయిన తోటమాలిని చూసి కామరాజు జాలిపడ్డాడు.

"సరే! వెళుదువుగానిలే! ఈ వృద్ధాప్యంతో కొడుకు దగ్గర ఉండి సుఖపడతానంటే నేను వద్దంటానా! కాని ఇంకో మనిషి కుదిరేదాకా ఉండకూడదూ!"

"నా పెత్తండ్రి కొడుకుని తీసువచ్చానండీ! కింద ఉన్నాడు. ఇవాళే పనిలో చేరతాడు. పిలవమంటే పిలుస్తాను."

"పిలువు."

తోటమాలి కిందకి వెళ్ళి కొత్త తోటమాలిగా పని చేయడానికి ఒప్పుకున్న మనిషినీ, అతని కొడుకునీ పిలుచుకొచ్చాడు.

"ఇతను నా పెత్తండ్రి కొడుకు శేషయ్య. వాడు శేషయ్య కొడుకు మొద్దబ్బాయి." అన్నాడు తోటమాలి కామరాజుకి వాళ్ళని చూపిస్తూ.

కామరాజు వాళ్ళిద్దరినీ పరీక్షగా చూశాడు. శేషయ్యకి దాదాపు యాభై ఏళ్ళుంటాయి. మంచి పొడుగు, పొడుక్కి తగ్గలావు. కండలు తిరిగిన శరీరం బలమైన చేతులు.

శేషయ్య కామరాజుకి నమస్కారం పెట్టాడు. శేషయ్య కొడుకు మొద్దబ్బాయికి ఇరవై ఏళ్ళుంటాయి. మోకాళ్ళ వరకూ పంచ, బనియను, టర్కిష్ తువ్వాల భుజం మీద వేలాడుతోంది. కామరాజుకి అతను నమస్కారం పెట్టాడు.

"ఇద్దరెందుకు తోటపనికి?" అడిగాడు కామరాజు.

"ఇద్దరికి జీతం ఇవ్వనక్కర్లేదండీ! నాకు ఇస్తే చాలు. తల్లి లేనివాడు. చిన్నప్పటినుంచీ గారాబంగా పెంచాను. నాతోనే ఉంటాడు." అన్నాడు శేషయ్య.

కామరాజు తోటమాలిని చూసి "జీతం ఎంతో చెప్పావా?" అడిగాడు.

"చెప్పాడండీ మీరెంత ఇచ్చినా సరే. పట్నంలో మురుగు కాలవపక్కన చీకటి గుడిసెలో మగ్గిపోయామండీ! నాలుగు రోజుల పాటు హాయిగా బతుకుదామని వచ్చానండీ!" అన్నాడు శేషయ్య.

కామరాజు తోటమాలికి రావలసిన జీతం ఇచ్చేసి పైన ఇరవై రూపాయలు బహుమానంగా ఇచ్చాడు.

## 9

కామరాజు ఇల్లు కళకళలాడుతోంది. లింగమూర్తి, భార్య భానుమతి, వాళ్ళ కొడుకు ప్రసాదు కూడా వచ్చేశారు. చీకటి పడేటప్పటికి దాదాపు అన్ని గదుల లోను దీపాలు వెలుగుతున్నాయి. కామరాజుకి తోచక పోవడం అంటూ లేదు. వైకుంఠరావుతో చదరంగం ఆడడమో, లింగమూర్తితో కబుర్లు చెప్పడమో ఏదో ఒకటి రోజంతా ఇట్టే గడిచిపోతోంది. అంతమంది తన ఇంటికి వచ్చినందుకు కామరాజు సంతోషించాడు. ప్రసాద్‌కి ఎక్కడయినా ఉద్యోగం ఇప్పిస్తానని మాట ఇచ్చాడు లింగమూర్తికి. పద్మకీ, శేఖర్‌కీ పెళ్ళి విషయం వైకుంఠరావు ప్రస్తావించేసరికి, ఆవిషయం శేఖర్ కే వదిలి వేశాననీ తను మాట ఇవ్వలేననీ చెప్పాడు. ట్రయినింగ్ పూర్తయి ఒక సంవత్సరంపాటు యూరప్‌లో తిరిగివద్దామనుకున్న శేఖర్, తండ్రి అనారోగ్యం తెలియగానే స్వదేశానకి తిరిగి వస్తున్నానని తండ్రికి టెలిగ్రాం ఇచ్చాడు. శేఖర్ తిరిగి వచ్చేవరకూ తను జీవించి ఉండమేనని భయపడుతున్న కామరాజు కొడుకు వస్తున్నందుకు సంతోషించాడు.

భారతికి ఇప్పుడు బాగా తీరికగా ఉంది. టైంకి మందులు ఇవ్వడం తప్ప కామరాజు పక్కన అనుక్షణమూ ఉండవలసిన అవసరంలేదు. ఆయన బంధువుల్లో ఎవరో ఒకరు ఎప్పుడూ ఆయన పక్కన ఉంటున్నారు.

భారతికీ, పద్మకీ తోటలో తిరగడం, టెన్నిస్ ఆడడంతో కాలం గడిచిపోతోంది.

రత్నయ్య కూడా పని మానేసి ఢిల్లీపోతానని చెప్పాడు.

"చాలా విచిత్రంగా ఉందే! మొదట డ్రయివర్, తర్వాత తోటమాలి ఇప్పుడు నువ్వూనా! అంతా రెండు రోజుల్లో ఏమొచ్చేసిందేమిటి!" అడిగాడు కామరాజు.

"ఏమీలేదండి! నాకు పెళ్ళయి ఏడేళ్ళయింది. నా భార్య కాపరానికి రావడం లేదు. పట్నంలో పుట్టి పెరిగింది. వాళ్ళ నాన్న ఒక బాంకిలో వాచ్‌మేన్. పట్నంలో ఉంటే కాపరానికి వస్తానంటోంది. నా మామ రిటైయిర్ అవుతున్నాడు. ఆ ఉద్యోగం నాకు ఇప్పిస్తానన్నాడు అందుకని -" అని గొణిగాడు రత్నయ్య.

"అయితే ఎప్పుడు వెళ్ళాలి?" అడిగాడు కామరాజు.

"ఇవాళే వెళ్తానండీ! రేపు బాంకి మేనేజర్ని చూడాలి."

"ఇలా అకస్మాత్తుగా వెళ్ళిపోతే ఎలా చెప్పు! ఇంట్లో బంధువులు కూడా చాలామంది ఉన్నారు."

"ఇవాళే వచ్చాడండీ నా మేనమామ నన్ను చూడడానికి. మీకిష్టమైతే అతను చేస్తానన్నాడు."

కామరాజు నవ్వాడు, "ముందే ఆలోచించి ఇంకోమనిషిని ఏర్పాటు చేశావన్నమాట. ఏడీ! పిలు!" అన్నాడు.

రత్నయ్య వెళ్ళి రెండు నిముషాలలో తిరిగి వచ్చి "ఇతనేనండీ, మునయ్య" అన్నాడు తనతో వచ్చిన మనిషిని చూపిస్తూ.

కామరాజు ఆ వచ్చిన మనిషిని రెప్పవాల్చకుండా చూశాడు. లావుగా ఉన్నాడు. మంచి పొడుగు, కండలు తిరిగిన చేతులు, పంచకట్టుకున్నాడు. పైన తువ్వాల వేసుకున్నాడు. ఛాతీ మీద, మెడ వెనుక, భుజాల మీదా నల్లగా బిరుసుగా వెంట్రుకలు రాలిపోయాయి నల్లని ఒళ్ళు, పెద్ద కళ్ళు వెడల్పాటి నల్లని కనుబొమ్మలు, పరుచుకున్న ముక్కు, లావుగా ఉన్న పెదిమలు - అతను నమస్కారం పెట్టాడు.

"ఇతను నీ మేనమామా?" అడిగాడు కామరాజు.

"అవునండీ."

"చాలా భయంకరంగా ఉన్నాడు" అన్నాడు లింగమూర్తి ఇంగ్లీషులో.

"రాత్రిళ్ళు కలలోకి వస్తాడు." అన్నది పద్మ ఇంగ్లీషులో.

"భగవంతుడు అలా పుట్టించాడు దానికి అతనా బాధ్యుడు!" అన్నాడు కామరాజు ఇంగ్లీషులో. తరువాత రత్నయ్య వైపు తిరిగి "సరే రత్నయ్యా! నువ్వు బయలుదేరే ముందు కనబడు, జీతం ఇస్తాను" అన్నాడు కామరాజు.

## 10

**అద్దం ముందు** నిలుచుని కోల్డుక్రీం చెంపలకి పూసుకుంటూ తనని తను శ్రద్ధగా చూసుకుంటోంది పద్మ. చిన్నగా నవ్వుకుంది. తను అందమైనది. అద్దం అబద్దం చెప్పదు. ఉన్నది ఉన్నట్లు చూపిస్తుంది. జడ నడుం కిందకి పడుతోంది అద్దానికి కొంచెం దూరం జరిగిన తన ప్రతిబింబం చూసుకుంది - సన్నని నడుం, సన్నగా వున్న శరీరం, పద్మ తృప్తిగా నవ్వుకుంది. విదేశాలకి వెళ్ళిన తర్వాత శేఖర్ బాగా మారిపోయి ఉంటాడు. తను చూసి మూడేళ్ళయింది. విమానాశ్రయానికి వెళుతూ చూడడానికి తను ఇంటికి వచ్చాడు. అప్పుడు తనని చూసి 'చూస్తూవుండగా చాలా పెద్దదానివయ్యావే!' అన్నాడు.

తను చీర కట్టడం అతను చూడడం అదే మొదటిసారి.

చిన్నప్పట్నించీ చాలా చనువుగా ఉండేవాళ్ళు తను సెకండు ఫారం చదువుతున్నప్పుడు శేఖర్ తనకి లెక్కలు చెప్పేవాడు. తను తప్పు చేస్తే రెండు చెవులూ పట్టుకుని, పుస్తకం మీదకి వంచి 'సరిగా చూసి చెయ్యి!' అనేవాడు. కోపంతో కాదు - నవ్వుతూ.

విదేశాలలో ఎంతో మంది తెల్లతోలు ఆడవాళ్ళతో స్నేహం అయిఉంటుంది అతనికి. అయినా తన బంగారం రంగు ఒంటి ముందు వాళ్ళ తెల్ల రంగు ఏపాటిది! శేఖర్ పొద్దున్నకి వస్తాడు. బహుశా ఏడు గంటలకల్లా రావచ్చని మామయ్య చెప్పాడు. తను ఆరుగంటలకల్లా నిద్రలేవాలి. బీరువా తెరిచి పొద్దున్న కట్టుకోవలసిన చీర, జాకెట్టు తీసి విడిగా పెట్టుకుంది. అయిదున్నరకి అలారం పెట్టింది. దీపం ఆర్పేసి పడుకుంది నిద్రపట్టలేదు.

శేఖర్ పెళ్ళి విషయంతో తనేమీ జోక్యం కల్పించుకోనని మామయ్య నాన్నకి చెప్పాడు. శేఖర్ నిన్ను పెళ్ళి చేసుకునేట్లు చెయ్యడం నీ బాధ్యత అని తన తండ్రి చెప్పాడు. తను నవ్వుతూ తలఊపింది.

తను తలుచుకుంటే శేఖర్ తన దాసుడుకాడూ! కళ్ళు చిట్లించి ఒకసారి చిన్నగా నవ్వితే ఆ నవ్వుకి అతను కరిగిపోడూ!

అవును. తను బజారుకి వెళ్ళినపుడు, సినిమాలకి వెళ్ళినపుడు మొగాళ్ళు నిలబడిపోయి, కళ్ళప్పగించి తనని చూడడం తను ఎన్నిసార్లో గమనించింది, తిరిగి చూసుకుంటూ వెళతారు తనని, అంతెందుకు పక్కింటి ఆయన కొత్తగా పెళ్ళయి భార్యని కాపరానికి తెచ్చుకున్న మనిషి! అతని భార్య బి.ఏ పాసయింది, చాలా అందమైన మనిషి. నాజూకుగా ముస్తాబు చేసుకుంటుంది. ఒకరోజు ఆమెతో మాట్లాడటానికి తను వాళ్ళ ఇంటికి వెళితే ఆమె ఇంట్లో లేదు; ఆయన తనని వెళ్ళనివ్వలేదు. ఏదో మాట్లాడుతూ కూర్చోపెట్టి, ఏదో

వంకతో తన చేతి వేళ్ళు ముట్టుకోవడం తన దగ్గరికి రావడం, తనని కళ్ళతో జుర్రుకోవడం - తలుచుకుంటే నవ్వు వస్తోంది. ప్రసాద్ బొంబాయిలో పుట్టి, బొంబాయిలో పెరిగాడు కదా ఎంతమంది అందమైన ఆడవాళ్ళని చూసి ఉంటాడు! అతనెందుకు రోజంతా తన వెనకే ఉంటాడు! తనే గదిలోకి వెళితే ఆ గదిలోకి ఏదో వంక పెట్టుకుని వస్తాడు! తనతో సినిమాకి రమ్మని టెన్నిస్ ఆడడానికి రమ్మనీ వేపుకు తింటాడు. తన చీర కొంగు కనపడితే చాలు ఎందుకు పరుగెత్తుకు వస్తాడు? శేఖర్ మాత్రం మొగాడు కాడా! అతను మాత్రం తనని చూసి మురిసిపోడా! ఇలా ఆలోచిస్తూ నిద్రపోయింది పద్మ.

పద్మ నిద్రలోంచి చటుక్కున లేచి కళ్ళు పెద్దవి చేసి చీకట్లోకి తీక్షణంగా చూసింది. ఏమీ కనిపించలేదు. తలుపు పక్కన దీపం స్విచ్ ఉంది. స్విచ్ నొక్కగానే క్లిక్ మన్న శబ్దం వినిపించిందిగాని దీపం వెలగలేదు పద్మకి భయం వేసింది. దీపం ఎందుకు వెలగలేదు! బల్బు చెడిపోయి ఉండవచ్చు. స్విచ్‌లో లోపం ఉండవచ్చు కాని ఆ గదిలో ఆమె ఇంకో క్షణం కూడా ఉండదలచుకోలేదు.

తలుపు వైపు వెళ్ళింది. ఎవరో తనని రాసుకుంటూ వెళ్ళినట్లు అనిపించింది. గాలి కావచ్చు. తలుపు గడియ తీసి లాగింది. తలుపు రాలేదు. మరింత గట్టిగా లాగింది. అయినా తెరుచుకోలేదు. తలుపు బిగుసుకుపోయిందా! మరిచిపోయి అవతలవైపు ఎవరయినా గడియ పెట్టారా! ఇంకోసారి తలుపు వైపు లాగి చూసింది. ప్రయోజనం లేకపోయింది. ముచ్చెమటలు పోస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. నిలబడ లేకుండా ఉంది. "తలుపు! తలుపు!" అని పెద్ద కేక పెట్టింది.

పక్క గదిలో పడుకున్న భారతికి ఆ కేక వినిపించింది. అప్పుడే పడుతున్న నిద్రలోంచి మేల్కొన్నది ఎవరు కేక వేశారో ఎందుకు కేక పెట్టారో ఊహించలేక నిముషం సేపు మంచం మీద కూర్చున్నది. పక్క గదిలో పద్మ పడుకున్నది. కేక ఆ గదిలోంచి వినబడ్డది. పద్మే కేక పెట్టి ఉండాలి అనుకుని మంచం మీద నుంచి ఒక దూకు దూకి తలుపు తెరవబోయింది. రాలేదు మొహం చిట్లించి మళ్ళీ లాగింది తెరుచుకోలేదు. చటుక్కున వెనక్కి తిరిగి కామరాజు గదికీ, తన మధ్యనున్న తలుపు తీసి, కామరాజు గదిలోకి పరిగెత్తి, ఆ గది తలుపు గడియ తీసి లాగింది. ఆ తలుపూ తెరుచుకోలేదు.

కామరాజు సుఖంగా నిద్రపోతున్నాడు. నిద్ర మందు తీసుకోవడం వల్ల పద్మ కేకలు గాని, భారతి చేస్తున్న చప్పుడు కాని ఆయనకి వినపించలేదు..

తన గది తలుపూ, కామరాజు గది తలుపూ కూడా ఎవరో బయట గడియపెట్టి ఉండాలి. అందుకే రావడం లేదు. కామరాజు గదిలో బెడ్‌రూం దీపం వెలగడం లేదు. భారతి మంచం దగ్గిరకి జరిగి స్విచ్ నొక్కింది. దీపం వెలగలేదు. దీపం చెడిపోయిందేమోననుకుని గోడకున్న స్విచ్ నొక్కింది. ఆ దీపమూ వెలగలేదు తన గదిలోకి పరిగెత్తి స్విచ్ వేసింది. ఆ దీపమూ వెలగలేదు.

చెవులు చిల్లులు పడేటట్లు పద్మ కేకలు ఇంకా వినబడుతున్నాయి. తనూ అరవాలనుకున్నది. గొంతు చించుకుని పొలికేకలు పెట్టాలనిపించింది. కామరాజు నిద్రలేస్తాడు. అసలే గుండె జబ్బుతో ఉన్న ఆ పెద్ద మనిషి దడుసుకుంటే గుండె ఆగిపోవచ్చు. తను ముందు తన పేషెంటు విషయం ఆలోచించాలి.

తెల్లారితే ఎవరో ఒకరు తలుపు తీస్తారు. అంతవరకూ ఓపిగ్గా కాచుకుని కూర్చోవడమే మంచిది. కాని పాపం పద్మగతేం కాను! ఏం చూసి భయపడిందో! లేక ఏదైనా ప్రమాదంలో ఉందా? లేకపోతే ఈ దీపాలు పోవడం ఏమిటి? తలుపులు బయట గడియలు పెట్టటమేమిటి? తనేం చెయ్యాలి ఇప్పుడు?

## 11

రాజారాం తొమ్మిది గంటలకల్లా భోజనం చేసి, సిగరెట్ వెలిగించి తోటలోకి వెళ్ళడానికి తలుపు తెరిచాడు.

"ఎక్కడికి ఇంత రాత్రివేళ?" అడిగింది సావిత్రి.

రాజారాం సావిత్రిని చూసి, నవ్వి "ఈవేళ మొదటి ప్రయత్నం" అన్నాడు

"అంటే - అందరూ నిద్రపోయిన తర్వాత ఇంట్లో ప్రవేశిస్తావా?" అడిగింది.

అతను తల ఊపాడు.

"జాగ్రత్త సుమా! పట్టుబడితే -"

"పట్టుబడను." అన్నాడు రాజారాం ధీమాగా తోటలోకి వెళ్ళిపోయాడు. తోటలో పచార్లు చేస్తూ గంట గడిపాడు. తర్వాత వాకిలి గుమ్మం దగ్గరికి వెళ్ళి, వసారాకి ఎదురుగా ఉన్న క్రోటన్ల వెనక నక్కి నిలుచున్నాడు.

దాదాపు పదకొండు గంటలు కావస్తున్నది. వాకిలి తలుపు వేయడానికి కొత్తగా వచ్చిన మునెయ్య తలుపు దగ్గిరికి వచ్చి ఒకసారి బయటికి తొంగి చూసి, హాల్లో దీపం ఆర్పేసి, తలుపు వెయ్యకుండానే ఏదో పనిమీద లోపలికి వెళ్ళిపోయాడు. రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది రాజారాంకి. చటుక్కున పొద వెనక నుంచి కదిలాడు. క్షణంలో హాల్లో ప్రవేశించి ఒక పెద్ద సోఫా కింద దాక్కున్నాడు పది నిమిషాల తర్వాత మునెయ్య హాల్లోకి తిరిగి వచ్చి తలుపు మూసి లోపల గడియ పెట్టి వెళ్ళిపోయాడు.

రాజారాం అరగంటసేపు ఆ సోఫా కిందే దాక్కున్నాడు. ఇంట్లో అందరూ నిద్రపోవాలి. తర్వాతే తను అక్కణ్ణించి కదలవచ్చు. చాలా ఓపికతో కాచుకున్నాడు ఎక్కడా చడీ చప్పుడూ లేదు. దీపాలన్నీ ఆర్పేశారు రాజారాం చప్పుడు చేయకుండా సోఫా కిందనుంచి లేచాడు. గోడలకి ఆనించి బీరువాలున్నాయి. ఆ బీరువాను ఆనుకుని నెమ్మదిగా జరిగాడు.

ఏ గది? పదేళ్ళ క్రితం తను ఆ ఇంట్లోకి వచ్చినపుడు ఈ సోఫాలు, ఈ తెరలు లేవు ఇన్ని తలుపులులేవు. కొత్తగా కొన్ని గోడలు గదులు కట్టించారు. పట్టపగలు ఇంట్లోకి వచ్చి ఆ గది ఏదో గుర్తుపెట్టుకోవడానికి అవకాశం లేకపోయింది. హాల్లోంచి నడవలోకి వెళ్ళాడు. కటిక చీకటి అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు.

మేడమీదకి వెళ్ళాలి. హాలు పక్క గదిలో మెట్లు ఉన్నాయి. రాజారాంకి అది తెలుసు. అటు నడిచాడు. మెట్లు ఎక్కి గోడపక్కన నక్కి నిలుచున్నాడు. ఎప్పుడు ఎవరు ఏ గదిలోంచి వస్తారో! తను మళ్ళీ పట్టుపడ్డాడా మళ్ళీ జైలు. కనీసం ఇంకో రెండేళ్ళు. కామరాజు గది అది. ఆ వేళ తనని ఆ డ్రయివర్ తీసుకెళ్ళింది ఆ గదిలోకే. బహుశా ఆ గదికి రెండో గది అయిఉండాలి. ఆ గదిలో ఎవరున్నారో! ఎవరూ లేకపోతే ఎంత బావుంటుంది! ఆ గది తలుపు దగ్గిరికి వెళ్ళి తలుపు సందుకి చెవి ఆనించి లోపల ఎవరయినా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఏమీ వినబడలేదు. తలుపు తోశాడు. తెరుచుకోలేదు. బయట గడియ పెట్టి ఉంది. అంటే లోపల ఎవరూ లేరన్నమాట. గడియ లాగి తలుపు నెమ్మదిగా తోశాడు కాని తెరుచుకోలేదు! రాజారాం ఆశ్చర్యంతో నిమిషం సేపు ఆలోచిస్తూ ఉండిపోయి, తర్వాత జేబులోంచి రెండు పనిముట్లు తీశాడు. సన్నని కడ్డీలాటిది తలుపుకీ, తలుపుకి మధ్య నున్న సందులో దూర్చాడు. సందు కొంచెం ఎక్కువయింది. కొంచెం లావుగా ఉన్న ఇంకో కడ్డీ ఆ సందులో ఇరికించాడు ఆ రెండో కడ్డీ చివర్న వున్న మీట నాలుగుసార్లు నొక్కాడు. అది నిజానికి కడ్డీ కాదు - గొట్టం. ఆ గొట్టంలో ఆసిడ్ ఉంది. ఆ ఆసిడ్ లోపల గడియ బిగించే కొక్కెం మీద పడగానే కొక్కెం కరిగిపోయింది. రెండు కడ్డీలు బయటికి తీసేసి, రాజారాం తలుపు తోశాడు. తలుపు తెరుచుకుంది. చప్పుడు చెయ్యకుండా గదిలో ప్రవేశించాడు. మోకాళ్ళ మీద ఒంగి చీకట్లోనే నేల పరీక్ష చెయ్యడం ప్రారంభించాడు.

మంచం మీద ఎవరో కదిలినట్లు అలికిడి కాగానే చటుక్కున లేచి నిలబడ్డాడు. ఆ చీకట్లో కనీ కనిపించకుండా కనిపిస్తోంది మంచం మీద ఆకారం. కదిలినప్పుడు చేతులు గాజులు గల గల మన్నాయి. ఎవరో స్త్రీ. అంతవరకు నయమే. రాజారాం మళ్ళీ నేల మీదకి దృష్టి పోనిచ్చి వెతకడం ప్రారంభించాడు అరగంట అయిన తర్వాత తను అన్వేషిస్తున్నది ఆ గదిలో లేదని, ఆ గది కాదని నిశ్చయించుకుని విసుగ్గా లేచి నిలుచున్నాడు. నిలుచుంటున్నపుడు జేబులోంచి ఒక కడ్డీ కిందపడి ఖంగుమని చప్పుడు అయింది.

రాజారాం రాతి బొమ్మలా నిలబడిపోయాడు పక్క మీద పడుకున్న స్త్రీ లేస్తుందేమోనని భయపడ్డాడు. ఆమే కదిలింది. కాని లేవలేదు. దుప్పటి లాగి కప్పుకుని పడుకుంది. రాజారాం బిగపట్టిన ఊపిరి నెమ్మదిగా విడుస్తూ కిందపడ్డ కడ్డీకోసం వెతకడం ప్రారంభించాడు. మంచం కిందకి పోయివుంటుందనుకుని మోకాళ్ళ మీద మంచం కిందకి జరిగి కడ్డీ తీసుకుని వస్తుండగా అది నేలకి తగిలి మళ్ళీ ఖంగుమని చప్పుడయింది.

మంచం మీద పడుకున్న మనిషి లేచి కూర్చున్నది. రాజారాం మంచం కిందకి జరిగాడు. మంచం మీద మనిషి లేచి, తలుపు దగ్గిరకి వెళ్ళి స్విచ్ నొక్కింది. కనిపించకుండా ఉండటానికి రాజారాం మంచం కింద మధ్యకి జరిగాడు. దీపం వెలగలేదు నిద్రలేచిన మనిషి తలుపు గడియలాగి తలుపు తెరుస్తోంది. ఎవర్నయినా పిలుస్తుందేమో! రాజారాం పారిపోవడానికి మంచం కిందనుంచి వచ్చి తలుపు వేపు జరిగాడు. ఆ చీకట్లో చూసుకోక ఆ మనిషికి మరీ దగ్గరగా వెళ్ళాడు. ఇద్దరూ ఒకర్ని రాసుకున్నంత పనయింది.

## 12

దీపం ఆర్పేసి పడుకున్నాడే కాని ప్రసాద్‌కి నిద్ర పట్టలేదు. పద్మిని గురించి ఆలోచిస్తున్నాడు. ఆ యువతిని చూసీ చూడ్డంతోనే అతను ఆమె దాసుడయిపోయాడు. తొలిచూపు ప్రేమ అంటారు అనుకున్నాడు. పద్మ దృష్టి తనమీద లేదనీ, శేఖర్ ఎప్పుడు వస్తాడా అని కాచుకున్నదనీ తెలుసు. విదేశాలు  తిరిగి వచ్చిన శేఖర్ పద్మని తృణీకరిస్తాడేమోనని అతని ఆశ. మెలకువగా ఉండే కలలు కంటున్నాడు ప్రసాద్. ఉన్నట్లుండి చెవులు చిల్లులు పడేటట్లు కేక, "తలుపు! తలుపు!" అని అరవడం వినిపించాయి. ఎవరు! ఎక్కణ్ణించి! ప్రసాద్‌కి వెంటనే తెలిసిపోయింది. పద్మ, తన పద్మ, ఏం అపాయంలో ఉందో! పక్క మీద నుంచి ఒక గంతేసి తలుపు తోసాడు. తలుపు తెరుచుకోలేదు. ఆశ్చర్యంతో దీపం మీద స్విచ్ వేశాడు. దీపం వెలగలేదు. ఏమిటిది! చెవులు గింగురుమంటున్నాయి పద్మ కేకలతో. తను తొందరపడి మతి పోగొట్టుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. వెనక్కి తిరిగి పరుపు కిందనుంచి టార్చిలైటు తీశాడు. టార్చి వెలుగులో తలుపు పరీక్షగా చూసి లాగాడు. తెరచుకోలేదు తలుపుకి దూరంగా వెళ్ళి ఒక్క పరుగున వచ్చి రెండు కాళ్ళతో బలంగా తన్నాడు. తలుపు కరకరమన్నది. మళ్ళీ వెనక్కి వెళ్ళి అదే విధంగా తన్నాడు. ఫెళఫెళమంటూ తలుపు విరిగి కిందపడ్డది. గదిలోంచి బయటికి పరిగెత్తాడు. నడవాలోకి వెళ్ళి రెండే మేడమెట్లు ఒకసారి గబగబా ఎక్కుతున్నాడు. చేతిలో టార్చి వెలుగుతోంది, ఇంకో ఆరుమెట్లు ఎక్కాలి. అప్పుడు తలపైకెత్తి చూశాడు. ఆఖరు మెట్టుమీద గోడకి ఆనుకుని ఎవరో నిలుచున్నారు.

టార్చి వెలుగులో అతనికి కనిపించిన ఆకారం భయంకరంగా ఉంది. ఆ టార్చి వెలుగు తప్ప ఇంకే వెలుగూ లేదు. అక్కడ వలయాకారంలో టార్చి వెలుగు అతనిమీద పడుతోంది. దాదాపు ఏడడుగుల పొడుగు, రెండు చేతులూ పైకెత్తి పెట్టాడు. చేతులకి వేళ్ళులేవు. మొండి చేతులు. తల ఉంది కాని మొహం లేదు. మెడవరకూ నల్లని గుబురు జుట్టు. ఆ జుట్టులో రెండు కళ్ళు, వాటి చుట్టూ వలయాకారంలో మెరుస్తున్న గీతలని బట్టి అవి కళ్ళని తెలుస్తోంది. పెద్ద కడుపు. వెలుగు కాళ్ళవరకూ పడడం లేనందువల్ల కాళ్ళు నేలమీద అని ఉన్నదీ లేనిదీ తెలియడంలేదు.

ప్రసాద్ ఆగిపోయి వినీవినిపించని స్వరంలో "ఎవరు నువ్వు"? అని అడిగాడు. ఆకారం జవాబు చెప్పలేదు. రెండు చేతులూ ఊపింది. ప్రసాద్ పిరికివాడు కాడు కాని మనిషో దెయ్యమో తెలియలేదు. పద్మ ఏదో ఆపదలో ఉంది. వెనక్కి తిరిగిపోలేదు. ముందుకి వెళ్ళడానికి ధైర్యం చాలలేదు.

ఆ ఆకారం మీదకి టార్చి విసిరేశాడు. టార్చి గోడకి తగిలి కింద పడిపోయింది. కటిక చీకటి. ఆ చీకట్లో ఆ ఆకారం కళ్ళచుట్టూ మెరుస్తున్నవి గీతలు భయంకరంగా ఉన్నాయి. అది మెట్లు దిగి తన మీదకి వస్తోంది. ప్రసాద్ కదలలేదు. గుండె రాయి

చేసుకున్నాడు పద్మకి ప్రమాదం తప్పిందని సంతోషించాడు. అది తనకి బాగా దగ్గరికి వచ్చాక పిడికిలి బిగించి చెయ్యి ఎత్తాడు ప్రసాద్. కాని తన చెయ్యి కదిలేలోగా ఆ ఆకారం తన చేతినీ, మెడనీ పట్టుకుని ఒక్క తోపు తోసింది. కింద పడ్డాడు.

రాజారాం పద్మ గదిలోంచి బయటికి రాగానే ఆగిపోవడానికి కారణం ప్రసాద్ చూసిన ఆ వికృతరూపాన్ని అతనూ చూడడమే. ప్రసాద్ వేసిన టార్చి వెలుగులో రాజారాం మరింత దగ్గిర్నించి చూశాడు ఆ భీకరాకారాన్ని. చూడగానే గుండె ఆగిపోయినంత పనయింది అతనికి. కాలు కదల్చలేక నిలబడిపోయాడూ. కళ్ళప్పగించి చూశాడు. తను పారిపోవాలంటే మెట్లు దిగాలి. మెట్ల మీద ఆ ఆకారం ఉంది. ఎలా వెళ్ళడం!

"ఎవరు నువ్వు" అన్న ప్రసాద్ ప్రశ్న వినపడగానే కొంచెం ధైర్యం వచ్చింది. తను ఒక్కడే కాదు, ఇంకో మనిషి ఉన్నాడు. ఆ భీకరాకారం తన మీదకి వస్తుందని భయపడనవసరంలేదు. తను కదలకపోతే తనని చూడదు.

ప్రసాద్ టార్చి విసిరేశాడు. టార్చి పగిలిపోయింది ఉన్న వెలుగు కాస్తా పోయింది. ఆ రూపం కళ్ళచుట్టూ మెరుస్తున్న గీతలు మాత్రం కనిపిస్తున్నాయి. రాజారాం గజగజవణుకుతున్నాడు.

ఆ ఆకారం మెట్లు దిగుతోంది. వెళ్ళిపోతోంది. తను పారిపోవచ్చు రాజారాం మెట్లదగ్గరకి వెళ్ళాడు. ప్రసాద్ ని మెట్లమీదనుంచి కిందకి తొయ్యడం అస్పష్టంగా కనిపించింది అతనికి. తర్వాత ఆ ఆకారం మెట్లు దిగి కిందకి వెళ్ళిపోయింది.

రాజారాం మెట్లమీద ఆగిపోయాడు. మెట్లు దిగి ఆ చీకట్లో కిందకి వెళ్ళేందుకు ధైర్యంలేకపోయింది. ఆ చీకట్లో ఏమూలో పొంచి ఉంటే ఆ ఆకారం? వెనక్కి తిరిగాడు. అవతల చిన్న బాల్కనీ ఉంది. బాల్కనీలోంచి కిందకి దూకేందుకు పరిగెత్తాడు.

## 13

మెట్లమీదనుంచి కిందకి దొర్లిపడుతూ ప్రసాద్ పెట్టిన పొలికేకకి కామరాజు కూడా ఉలిక్కిపడి నిద్రలేచాడు. వెంటనే మంచం పక్కనున్న టేబుల్ లైట్ స్విచ్ నొక్కి వెలగకపోయేసరికి "భారతీ!" అని పిలిచాడు. ప్రసాద్ పెట్టిన కేక విని భయంతో గజగజవణికిపోతున్న భారతి అతికష్టం మీద "ఆ!" అనగలిగింది.

"దీపం వెలిగించు. ఎవరు కేక పెట్టారు?" అడిగాడు కామరాజు.

"ఎవరో కిందనుంచి కేకేట్టారు. దీపాలు వెలగడం లేదు" అన్నది భారతి మంచం దగ్గరికి వచ్చి.

ఇంకో మనిషి మాట్లాడడం వింటేనే చాలనిపిస్తోంది ఆమెకి.

"దీపాలు ఎందుకు వెలగడం లేదు? తలుపు తీసి హాల్లోకి వెళ్ళి రత్నయ్యని కేకెయ్యి"

రత్నయ్య పనిలోలేడని, మునెయ్య అనే అతను ఉన్నాడనీ చెప్పాలనిపించింది భారతికి. ఎవరయితేనే అనుకుని "తలుపు రావడం లేదు" అన్నది.

"ఎందుకు రావడం లేదు?" అడిగాడు కామరాజు కూర్చుంటూ.

"నాకు తెలియదు"

"ఆ బల్ల సొరుగులో టార్చి ఉన్నది ఇలాతే."

భారతి కదలలేదు.

"అక్కడే నీ కుడివైపు రెండడుగులు వేస్తే బల్ల ఉంది."

"నాకు భయం వేస్తోంది."

కామరాజు చిన్నగా నవ్వాడు. "పిచ్చిపిల్లా ఎవరో మెట్లమీద నుంచి పడివుంటారు. ఈ మాత్రానికి భయం ఎందుకు!" అంటూ తనే లేచి వెళ్ళి టార్చి తీసుకుని వెలిగించాడు.

"అదేమిటి! అలా నీ మొహం పాలిపోయిందేమిటి!" అడిగాడు కామరాజు.

"పక్క గదిలోంచి పద్మ పొలికేకలు పెట్టింది."

"దడుచుకున్నదేమో! తలుపు ఎందుకు తెరుచుకోలేదో చూస్తానుండు" అని కామరాజు తలుపు లాగి చూశాడు. ఎంత బలంగా లాగినా ప్రయోజనం లేకపోయింది.

"ఎవరో బైట గడియపెట్టారు" అన్నాడు కామరాజు నిట్టూరుస్తూ.

భారతి తల ఊపింది. కామరాజు మొహం తీక్షణమైంది. టెలిఫోన్ రిసీవర్ తీసాడు. క్లిక్ మనలేదు.

"టెలిఫోన్ కూడా పనిచెయ్యడం లేదు" అన్నాడు కామరాజు.

భారతి మాట్లాడలేదు. కామరాజు కిటికీ దగ్గరికి వెళ్ళి బయటికి తొంగి చూశాడు! చీకట్లో చెట్ల ఆకారాలు, ఆకాశం మీద నక్షత్రాలు కనిపించాయి. "కొత్తగా వచ్చిన తోటమాలి పేరేమిటి?" అడిగాడు.

"శేషయ్య."

"శేషయ్యా" గట్టిగా కేక పెట్టాడు కామరాజు.

శేషయ్య పలకలేదు.

"మీరు ఊరుకోండి నేను పిలుస్తాను" అని భారతి గొంతు చీల్చుకుంటూ శేషయ్యని పిలిచింది.

"అమ్మగారూ!" అంటూ ఆ గది తలుపు దగ్గర నిలబడ్డాడు శేషయ్య.

కామరాజూ, భారతి తలుపువేపు చూశారు. టార్చి వెలుగులో తలుపు తెరిచి ఉండడం, శేషయ్య గుమ్మంలో నిలబడి ఉండడం కనిపించింది.

ఈ అర్ధరాత్రి నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?" అడిగాడు కామరాజు కోపంగా.

"ఇంట్లోనించి వచ్చిన కేకలు విని నేనూ, మొద్దబ్బాయి పరిగెత్తుకు వచ్చాము. వాకిలి తలుపు తెరిచేవుంది. ఇల్లంతా చీకటిగా ఉంది. మొద్దబ్బాయి వెళ్ళి లాంతరు తెచ్చాడు. మెట్లకింద చిన్నయ్యగారు రక్తం మడుగులో పడి ఉన్నారు" చెప్పాడు శేషయ్య.

"ఏ చిన్నయ్యగారు!" అడుగుతూ కామరాజు ముందుకు నడిచాడు.

"ప్రసాద్ అయ్యగారు. అందరూ గదుల్లోంచి తలుపులు రావడం లేదనీ, బయట ఎవరో గడియపెట్టారనీ కేకలు వేశారు. అన్ని గదుల తలుపులూ తెరిచాను" అంటూ శేషయ్య, కామరాజు, భారతీల వెనకాలే వెళ్ళాడు.

"మునెయ్య, దాసీది, వంటమనిషి ఏమయ్యారు?" అడిగాడు కామరాజు శేషయ్యని.

"మునెయ్య తన గది తలుపు బద్దలు కొట్టి బయటకి వచ్చాడండి"అన్నాడు శేషయ్య.

ముగ్గురూ మేడమెట్లు దిగారు. రక్తం మడుగులో ఉన్న ప్రసాద్‌ని లాంతరు మసక వెలుగులో చూసి, కామరాజు నిశ్చేష్టుడై మెట్లమీద చతికిలపడ్డాడు. ప్రసాద్ తండ్రి లింగమూర్తి, కొడుకు తల నెమ్మదిగా ఎత్తి ఒళ్ళో పెట్టుకున్నాడు. అతని తల్లి భానుమతి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

భారతి ప్రసాద్ దగ్గరికి వెళ్ళి చెయ్యి పట్టుకుని నాడి చూసి, తరువాత గాయం పరీక్ష చేసి "ప్రమాదం ఏమీ లేదు. గాయం భుజం మీద తగిలింది. రక్తం చాలా కారింది అంతే! ఎవరైనా నా గదిలోకి వెళ్ళి నా సంచి తీసుకు రండి" అన్నది.

మొద్దబాయి పరిగెత్తుకు వెళ్ళి నిమిషంలో సంచి తీసుకొచ్చాడు.

భారతి ప్రసాద్ భుజానికి కట్టుకట్టింది. వేడిపాలు తెమ్మని వంటమనిషికి చెప్పింది. ఒంటిగా వెళ్ళలేనన్నది వంట మనిషి. మొద్దబ్బాయి తోడు వెళ్ళాడు.

"ఎవడో దొంగ వచ్చివుంటాడు, అందరి గదుల తలుపులూ బయట గడియలు పెట్టి నింపాదిగా ఇల్లంతా దోచుకోవాలనుకున్నాడు" అన్నాడు వైకుంఠరావు.

భారతి ప్రసాద్ నోట్లో చెంచాతో వేడిపాలు పోసి సగం గ్లాసు పాలు తాగించింది. కాసేపటికి అతను కళ్ళు తెరిచాడు, ఎవరినీ గుర్తుపట్టనట్లు శూన్యంలోకి చూచాడు. తలొకరూ తలో ప్రశ్న వేశారు కాని ప్రసాద్ జవాబు చెప్పలేదు. అయిదు నిముషాల తర్వాత లేచి కూర్చుని మెట్ల మీదకి తీక్షణంగా చూశాడు చీకటిగా ఉంది. ఏమీ కనిపించలేదు.

"ఏమిటి చూస్తున్నావు!" అడిగాడు లింగమూర్తి.

"అసలు జరిగిందేమిటో చెప్పవయ్యా" అన్నాడు వైకుంఠరావు.

ప్రసాద్ పెదిమలు తడిచేసుకుని చెప్పాడు. అతను పూర్తిగా చెప్పేంతవరకూ అందరూ నిశ్శబ్దంగా విన్నారు. తరువాత తలొకరూ తలో అభిప్రాయం వెలిబుచ్చారు.

"ఎవడో దొంగ అయివుండాలి."

"మంచి భారీ మనిషి అయివుంటాడు."

"నీ టార్చి వెలుగుతో వాడి కళ్ళు మెరిసివుంటాయి."

"జుట్టు పొడుగ్గా పెంచుకుని గిరజాలు మొహం మీద వేసుకునుంటాడు."

ప్రసాద్ తల విదిలించాడు.

"ఏమిటి తల విదిలిస్తున్నావు!" అడిగాడు కామరాజు.

"దొంగకాడు" అన్నాడు ప్రసాద్.

"దొంగకాకపోతే మరెవరు."

"అసలు మనిషే కాదు."

"జంతువా?" అడిగాడు వైకుంఠరావు.

" మనిషీ కాదు, జంతువూ కాదు. దెయ్యం!" అన్నాడూ ప్రసాద్.

"షాక్ అయ్యావు. చీకట్లో అటువంటి వికృతాకారాన్ని చూస్తే అలాగే భ్రాంతి కలుగుతుంది. పొద్దున్నే పోలీసులకు కబురు చేస్తాను" అన్నాడు కామరాజు లేచి నిలుచుంటూ.

"పోలీసులు ఏం చేస్తారు? మనిషయితేగా? టార్చి వెలుగులో స్పష్టంగా చూశాను మనిషి కావడానికి ఏ మాత్రం వీలు లేదు" అన్నాడు ప్రసాద్.

"మనిషి కాదని అంత స్పష్టంగా ఎలా చెప్పగలవు? " అడిగాడు వైకుంఠరావు.

ప్రసాద్ కళ్ళు నులుపుకుని చేత్తో నుదురురాసుకుంటూ "ఉండండి జ్ఞాపకం చేసుకోనివ్వండి" అన్నాడు.

అందరూ ప్రసాద్ ఏం చెపుతాడో అని ఊపిరి బిగపట్టుక్కూర్చున్నారు.

"టార్చి వెలుగు పొట్టమీద పడ్డది. అప్పుడు స్పష్టంగా చూశాను. బొడ్డులేదు."

బొడ్డు లేదా! బొడ్డులేని మనిషి ఎక్కడుంటాడు! తల్లి కడుపులోంచి పుట్టిన ప్రతి మనిషికీ బొడ్డు ఉండి తీరాలి. బొడ్డు లేకపోతే మనిషి కాడు. ఒకళ్ళ మొహం ఒకరు చూసుకున్నారు. అందరూ భయపడుతూ మూల మూలల్లో చూశారు. దొంగయితే పట్టుబడే

ప్రమాదం వస్తే తప్ప దౌర్జన్యం చెయ్యడు. కాని ఆ ఆకారందౌర్జన్యంచేసింది. దొంగకాడేమో! మనిషీ కాదేమో! భయంతో అందరూ ఒణికి పోయారు.

## 14

"నాకు దెయ్యాలలో నమ్మకంలేదు. చదువుకున్నవాడివి. పట్నంలో పెరిగినవాడివి. నీకిలాటి పిచ్చి నమ్మకం ఎలా కలిగిందో ఊహించలేకుండా ఉన్నాను" అన్నాడు శేఖర్.

ప్రసాద్ బలహీనంగా నవ్వాడు. "ఇంతకుముందు నాకూ నమ్మకంలేదు. కాని రాత్రి ఆ దృశ్యం చూశాక -"

"ఎవరో మనిషే అలా వేషం వేసుకుని ఉండవచ్చు. ఇంకాసేపట్లో పోలీసులు వస్తారు తేలుతుంది," అని అందర్నీ ఒకసారి చూశాడు శేఖర్.

శేఖర్ ఆవేళ పొద్దున్న విమానంలో దిగాడు. ఎనిమిది గంటలకల్లా ఇంటికి చేరుకున్నాడు. విమానాశ్రయానికి లింగమూర్తి వెళ్ళాడు. కారులో వస్తూ తోవలో రాత్రి జరిగిన విషయాలన్నీ వివరంగా శేఖర్‌కి చెప్పాడు. ఇంటికి రాగానే శేఖర్ తండ్రిని పలకరించి తర్వాత ప్రసాద్‌ని చూడటానికి వెళ్ళాడు.

పద్మ, భానుమతి, లింగమూర్తి, వైకుంఠరావు, భారతీ అక్కడ ఉన్నారు.

"నేను వాదించదలచుకోలేదు" అని వెనక్కి జారగిలబడ్డాడు ప్రసాద్

పోలీసులు వచ్చారని మునెయ్య వచ్చి చెప్పగానే శేఖర్ లేచి హాల్లోకి వెళ్ళాడు.

రాత్రి జరిగిన సంఘటనలన్నీ వివరంగా చెప్పాడు కామరాజు పోలీస్ ఇన్‌స్పెక్టరుకి.

"ఇంట్లో నౌకర్లు ఎవరో చేసి ఉండవచ్చు. దర్యాప్తు చేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కామరాజు మొహం చిట్లించి "నౌకర్లు ఎవరో చేసి ఉంటారని నాకూ అనుమానం కలిగింది. కాని కారణం కనిపించదు. ఒక్క చీపురు పుల్లకూడా పోలేదు" అన్నాడు.

"అవకాశం ఉండి ఉండదు" జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అయినా ఎత్తుకుపోయి, అమ్మి డబ్బు చేసుకోడానికి ఈ ఇంట్లో నగలు లేవు. డబ్బేమైనా ఉంటే అది నా దగ్గర. నా దిండుకింద పర్సులో ఉంటుంది. నా గదిలోకి రావడానికి ఆ దొంగ ప్రయత్నించలేదు"

ఇన్‌స్పెక్టర్ తలవూపి "దర్యాప్తు చేస్తేకాని తెలియదు" అని సార్జంటు వైపు తిరిగి "ఇల్లంతా పరీక్ష చెయ్యి. ముఖ్యంగా మెట్లమీద, తలుపు గడియలమీద వేలిముద్రకోసం ప్రయత్నించి ప్రయోజనం ఉండదనుకుంటాను. ఐనా ప్రయత్నించు. నౌకర్లందర్నీ నా దగ్గరకి పంపు" అన్నాడు. తర్వాత కామరాజు వైపు తిరిగి "దయచేసి నాకు తాత్కాలికంగా ఒక గది ఇవ్వగలరా?" అడిగాడు.

"హాలు పక్కనున్న గదికి తీసుకు వెళ్ళు" అన్నాడు కామరాజు మునయ్యతో.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోగానే "బొడ్డు లేని మనిషి గురించిన మర్మం త్వరలో బయటపడుతుంది చూసుకోండి!" అని నవ్వుతూ శేఖర్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

# 15

"ఏమిటి చదువుతున్నావు?" అడిగాడు రాజారాం సావిత్రిని చూడగానే. సావిత్రి మొహం వివర్ణమైంది. చటుక్కున చేతిలో ఉన్న కాగితం మడిచి జాకెట్ లోపల దోపుకుంటూ "నా స్వవిషయం" అన్నది.

"పోస్టులో వచ్చిందా?" అడిగాడు.

"ఆ!" అని సావిత్రి వంట ఇంట్లోకి వెళ్ళింది.

రాజారాం కుర్చీలో చతికిల పడ్డాడు. రాత్రి తనకి కలిగిన అనుభవం సావిత్రికి చెప్పలేడు - చెపితే భయపడి వెళ్ళిపోతుంది. పొద్దున్న తను విమానాశ్రయానికి వెళ్ళి శేఖర్‌ని కారులో తీసుకు వచ్చాడు. కారు షెడ్లో పెట్టి తిరిగి వచ్చేప్పుడు పోలీస్ జీప్ పోర్టికోలో ఆగి ఉండడం చూశాడు. రాజారాం గుండె ఆగిపోయింది. కామరాజు పోలీసులకి రిపోర్టు చేస్తాడని అనుకున్నాడు కాని పోలీసులు వస్తే తనేం చెయ్యాలనేది ఆలోచించలేదు. తనని గుర్తుపడితే ఇంట్లో చొరబడింది తనే అని అనుమానం కలుగుతుంది. అనుమానం కలగగానే తనని కొన్నాళ్ళపాటు లాకప్‌లో పడేస్తారు. తర్వాత ఒదిలేసినా తను మళ్ళీ ఈ ఇంటి ప్రాంతాలకి రావడానికి వీలుండదు. జైలుకి వెళ్ళి వచ్చాక కామరాజు తనని డ్రైవర్‌గా ఉండనివ్వడు. తను ఇప్పుడు పారిపోయినా ప్రయోజనం లేదు. నేలమీద ఒక కవరు పడివుండటం చూసి దాన్ని తీశాడు. కవరు మీద ఓ అక్షరం కూడా లేదు, అతికించిన కవరు ఒక వైపు చింపబడి ఉంది. సావిత్రికి ఆ కవరులోనే ఆ ఉత్తరం వచ్చి ఉంటుంది అనుకుని చటుక్కున అనుమానంతో కవరు మళ్ళీ పరీక్ష చేశాడు రాజారాం. పోస్టులో వచ్చిందని చెప్పింది సావిత్రి. కవరు మీద పోస్ట్ ముద్ర లేదు. సావిత్రిని అడిగితే నిజం చెపుతుందని నమ్మకంలేదు అతనికి.

"పోలీసులు వచ్చారు. చూశావా!" అని అడుగుతూ వంట ఇంట్లోంచి బయటికి వచ్చింది సావిత్రి.

"అవును చూశాను" అన్నాడు రాజారాం

"రాత్రి బుజువులు ఏవైనా -?" అని ప్రశ్న పూర్తి చేయలేదు సావిత్రి.

"లేదు"

"అంతవరకూ నయమే. నేను స్నానం చేసి వస్తాను. నువ్వు ఇక్కడే ఉంటావుగా!" అడిగింది సావిత్రి. రాజారాం తలూపాడు. ఆరేసిన బట్టలు తెచ్చుకోడానికి పెరట్లోకి వెళ్ళింది సావిత్రి. వెంటనే రాజారాం ఒక్క గంతులో వెళ్ళి తలుపు తీశాడు. జేబులోంచి స్క్రూ డ్రైవర్ తీసి, గడియని కొద్దిగా వంచేసి, చటుక్కున హాల్లోకి వెళ్ళి కుర్చీలో కూర్చుని, కాళ్ళు జాపి, కళ్ళు మూసుకున్నాడు. రెండు నిమిషాల తర్వాత సావిత్రి హాల్లోకి వచ్చి రాజారాం కళ్ళుమూసుకునుండటం గమనించి, అట్టే చప్పుడు చెయ్యకుండా నీళ్ళ గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది,

నీళ్ళ చప్పుడు. సావిత్రి కూనిరాగం వింటూ కూర్చున్నాడు రాజారాం. అయిదు నిమిషాల తర్వాత నీళ్ళ గది దగ్గరకి వెళ్ళి చటుక్కున తలుపు తెరిచాడు.

"ఎవరు?" అంటూ బెదిరిపోయి తలుపువైపు తిరిగింది సావిత్రి.

"నువ్వు స్నానం చేస్తున్నావా!" అని తలుపు మూసేసి వెనక్కి తిరిగాడు రాజారాం

"ఇందాక చెప్పానుగా!" అరిచింది సావిత్రి

"అవును మరిచిపోయాను" అన్నాడు హాల్లోంచి రాజారాం. అతని మొహం ఎర్రనయింది. పళ్ళు పటపట కొరుకుతున్నాడు కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

తన చెల్లెలు సావిత్రి ఏడేళ్ళప్పుడు ఆడుకుంటూ గడప మీద పడింది. గడపకున్న ఇనుప కొక్కి గుచ్చుకుని అరంగుళం లోతు దిగబడి వీపుకి గాయం అయింది. వెంటనే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు రాజారాం. చాలా రక్తం కారి సావిత్రికి స్పృహ పోయింది. డాక్టర్ కుట్లువేశాడు గాయం పూర్తిగా మానడానికి పదిహేను రోజులు పట్టింది. వీపు మీద అరంగుళం పొడుగు, వేలు వెడల్పున మచ్చపడింది.

స్నానం చేస్తున్న సావిత్రి మీద అటువంటి మచ్చలేదు.

"నువ్వెవరు? నా చెల్లెలివి అని ఎందుకు చెప్పావు?" అని అడుగుదామనుకున్నాడు రాజారాం. ఇప్పుడు అడక్కూడదు. ఇంకా కొన్ని విషయాలు తెలుసుకోవాలి అనుకున్నాడు అంతలో ఒక పోలీస్ కానిస్టేబుల్ వచ్చి "డ్రయివర్వి నువ్వేనా?" అడిగాడు. రాజారాం తలూపాడు.

"ఇన్స్పెక్టర్ పిలుస్తున్నారు" చెప్పాడు కానిస్టేబుల్.

## 16

"భారతీ!"

"ఆ! మీరా!" అన్నది భారతి శేఖరాన్ని ఆశ్చర్యంతో చూసి.

శేఖర్ తలుపుకి అవతల నిలబడి "ఏం చేస్తున్నారు! తీరికగా ఉన్నారా" అడిగాడు.

భారతి చిన్నగా నవ్వుతూ "ఏం?" అడిగింది.

"మీరు చాలా బాగా టెన్నిస్ ఆడతారని చెప్పింది పద్మ."

"వస్తాను మీ నాన్నగారికి మందిచ్చేసి క్షణంలో వస్తాను" అని కామరాజు గదిలోకి వెళ్ళింది భారతి.

శేఖర్ భారతి గది దగ్గర పచార్లు చేస్తున్నాడు.

"బావా రాకెట్ పట్టుకుని యిక్కడ నిలబడ్డావేం? రా!"

అన్నది పద్మ అతని దగ్గరికి వచ్చి.

"సారీ పద్మా! భారతిని యిప్పుడే పిలిచాను"

పద్మ మొహం ఎర్రనయింది. అంతలో రాకెట్ తీసుకుని భారతి వచ్చి పద్మని చూసి "మీరు కూడా రండి,గెలిచిన వాళ్ళు మీతో ఆడాలి" అన్నది.

ముగ్గురూ హాల్లోకి వెళ్ళగానే భానుమతి ఎదురయి "అమ్మాయీ! పద్మా..ప్రసాదు నిన్ను పిలుస్తున్నాడు" అన్నది.

"ఎందుకు?" అంది పద్మ చిరాకుగా.

"ఏమో నాకేం తెలుసు, మంచం మీద వున్నాడు కనుక చెప్పమన్నాడు" అని వెళ్ళిపోయింది భానుమతి.

"మంచం మీద పడుకున్న మనిషికి నర్సింగ్ చెయ్యడానికి భారతి వెళ్ళాలి కానీ నేనెందుకు?" అన్నది పద్మ.

"ఎందుకు పిలిచాడో వెళ్ళిరా!" అన్నాడు శేఖర్.

పద్మ అయిష్టంతో ప్రసాద్ గదిలోకి వెళ్ళింది.

***

"ఇంట్లోకి వచ్చి అన్ని గదుల తలుపులకి బయటపెట్టిన గడియలు తీసిందెవరు?" అడిగాడు కానిస్టేబుల్.

"నేనూ, మొద్దబ్బాయి" అన్నాడు శేషయ్య.

"ఈ ఇంటి తోటమాలి నువ్వేనా?"

"అవునండి!"

"లోపలికి వెళ్ళు. ఇన్స్పెక్టర్ గారు నీతో మాట్లాడాలిట.."

శేషయ్య, మొద్దబ్బాయి లోపలికెళ్ళారు.

ఇన్స్పెక్టర్ వాళ్ళిద్దర్నీ తీక్షణంగా చూసి "జరిగిందేమిటో వివరంగా చెప్పండి!" అన్నాడు. అంతా విన్న తరువాత "మీ వేలిముద్రలు తీసుకోవాలి, అదుగో ఆ సిరా చేతులకి రాసుకోండి" అన్నాడు.

"మా వేలి ముద్రలు ఎందుకు? మేం ఏం నేరం చేశాము? ఇంట్లో వాళ్ళు ఏదో ప్రమాదంలో ఉన్నారని వచ్చి సహాయం చేసినందుకా?" మండి పడ్డాడు తోటమాలి.

"నువ్వు వేలి ముద్రలు యివ్వడానికి నిరాకరించవచ్చు. అటువంటి పక్షంలో నిన్నూ, నీ కొడుకునీ పోలీస్ స్టేషన్ తీసుకెళ్ళాల్సి వస్తుంది."

"తీసుకెళ్ళండి. మంచి పనిచేసినందుకు జైల్లో పెట్టండి. చాలా న్యాయంగా వుంటుంది. నేను మాత్రం వేలి ముద్రలు ఇవ్వను. మా వాణ్ణి ఇవ్వనివ్వను" అన్నాడు శేషయ్య.

"సరే! వీళ్ళిద్దర్నీ జీప్ లో ఎక్కించు" అన్నాడు ఇన్ స్పెక్టర్ కాన్ స్టేబుల్‌తో. తరువాత నౌకర్లని ఒక్కొక్కర్నే పిలిపించి ప్రశ్నించాడు.

పన్నెండు గంటల ప్రాంతంలో సార్జంటు వచ్చి ఇన్ స్పెక్టర్కి రిపోర్టు ఇచ్చాడు. "బాల్కనీ లోంచి ఎవరో నీటి గొట్టం పట్టుకుని కిందికి దిగినట్లు నిదర్శనాలున్నాయి సార్ అంతే.. ఇంట్లోకి దొంగ ఎలా వచ్చాడో నిదర్శనాలేమీ లేవు" అన్నాడు.

"సరే! నేను కామరాజు గారితో చెప్పి వస్తాను" అని ఇన్ స్పెక్టర్ కామరాజు గదికి వెళ్ళాడు.

"ఏం ఇన్ స్పెక్టర్! ఏమైనా తెల్సిందా?" అడిగాడు కామరాజు.

"దొంగ ఎలా ఇంట్లో ప్రవేశించాడో తెలియలేదు. ఇంట్లో వున్న వాళ్ళు ఎవరో ఒకళ్ళు తలుపు తెరిచి ప్రవేశం ఇచ్చి ఉండాలి. బాల్కనీలోంచి నీటి గొట్టం పట్టుకుని ఒక మనిషి కిందికి దిగినట్టు నిదర్శనాలు కనిపించాయి. ఇంట్లో ఒక్క వస్తువు కూడా పోలేదని నిశ్చయం అయింది. పని వాళ్ళందర్నీ తరచి తరచి ప్రశ్నించాను. ఏమీ తెలియలేదు. తోటమాలి, అతని కొడుకు వేలి ముద్రలు ఇవ్వడానికి నిరాకరించారు. అందువల్ల వాళ్ళమీద కొద్దిగా అనుమానం కలుగుతోంది. వాళ్ళని స్టేషన్ కి తీసుకెళ్తున్నాను"

"ఎందుకు?"

"కాసేపు లాకప్ లో పెడితే భయపడి ఏదయినా తెలిసి వుంటే చెపుతారని.."

"ముసలాడు..కొట్టకండి.."

"ఛా! ఛ! వూరికే బెదిరిస్తాను..అంతే" అని ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

"ఎందుకు పిలిచావ్" అడిగింది పద్మ ప్రసాద్ పడుకున్న గది తలుపు దగ్గరే ఆగిపోయి.

"లోపలికి వచ్చి ఇలా కూర్చో. నీతో మాట్లాడాలి" అన్నాడు ప్రసాద్ పద్మ కళ్ళలోకి చూస్తూ.

"త్వరగా చెప్పు నేను వెళ్ళాలి" పద్మ విసుగ్గా చేతిలో బాట్ ఊపుతూ మంచం దగ్గిరికెళ్ళి నిలబడి "ఊఁ..చెప్పు" అన్నది.

"నువ్వు ఈ ఇంట్లో ఉండడం మంచిది కాదు. మద్రాసుకి వెళ్ళిపో" అన్నాడు ప్రసాదు.

"ఏం? ఎవరికి మంచిది కాదు?"

"నీకే నేను రాత్రి చూసిన ఆకారం దెయ్యం అంటే ఎవరూ నమ్మడం లేదు. నిజం చెప్తున్నాను. నేను కల కనలేదు. భయంతో వూహించలేదు. అది మనిషికాదు. ఏదో తెలియని శక్తి ఎదిరించడం వివేకమైన పని కాదు"

"అయితే నువ్వెందుకు వెళ్ళి పోవూ?"

"నా విషయం వేరు. మొగాణ్ణి"

పద్మ నవ్వి "దెయ్యం విషయంలో మొగాళ్ళ ధిక్యం ఏం వుంది ప్రసాద్!? పిచ్చిగా మాట్లాడక నిద్రపో!" అని వెనక్కి తిరిగింది.

"పద్మా!"

"ఏమిటి?"

"ఇంకొక మాట!"

"నువ్వంటే నాకు ప్రాణం! నిన్ను చూసిన మరుక్షణమే నేను నీ దాసుణ్ణయిపోయాను.."

పద్మ అతన్ని చూసి ఆపాదమస్తకమూ పరీక్షగా చూసి "ఒక ఆడదాన్ని చూసీ చూడడంతోనే దాసుడు కావడం వివేకమైన పనికాదు..." అని చర చర గదిలోంచి వెళ్ళిపోయి తిన్నగా టెన్నిస్ కోర్టుకి పరుగెత్తింది. భారతి కాని, శేఖర్ కాని ఆ ప్రాంతాల ఎక్కడా కనిపించలేదు. మొహం చిట్లించి రొప్పుతూ పరికించి చూసింది. "ఏమయ్యారు? ఇటు వచ్చారే! ఎక్కడికి వెళ్ళారు!?"

పకపక నవ్వడం వినిపించి చటుక్కున వెనక్కి తిరిగింది. వెనక ఎవరూ లేరు. ఎవరు నవ్వారు..? పద్మ ఒళ్ళు ఝల్లుమన్నది. ఆ ఇంట్లో దెయ్యం వున్నదని ప్రసాద్ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. దెయ్యం పట్టపగలు కూడా వస్తుందా!?

"వెనక్కి తిరుగు..ఈ పువ్వు నీ తలలో పెట్టనియ్" అన్న్ శేఖర్ మాటలు వినిపించే సరికి పద్మకి ధైర్యమూ, కోపమూ వచ్చాయి.

ఆ మాటలు క్రోటన్స్ వెనకనుంచి వినపడ్డాయి. విసురుగా వెళ్ళి పద్మ ఓ క్రోటన్ వెనక ఆగిపోయింది ఎర్రని మందారం భారతి జడలో పెడుతున్నాడు శేఖర్. పద్మ పళ్ళు పట పట కొరుకుతోంది.

"థాంక్స్" అని వెనక్కి తిరిగి శేఖర్ కళ్ళల్లోకి చూసి "టెన్నిస్ ఆడదామా!" అడిగింది భారతి.

శేఖర్ ఆమెకి అడ్డం తొలగలేదు. గెడ్డం కింద వేళ్ళు పెట్టి మొహం పైకెత్తి చటుక్కున పెదిమలమీద మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు. భారతిలో ఆశ్చర్యమూ, కోపమూ తుఫానులా చెలరేగాయి. ఏం అనాలో తెలియలేదు. శేఖర్ తనని అవమానించాడనే బాధతో కుమిలి పోయింది.

"విదేశాలకు వెళ్ళి ఇందులోనా నువ్వు ట్రెయినింగ్ అయ్యావు!" అంటూ వాళ్ళ దగ్గరికి వెళ్ళింది పద్మ. భారతి పద్మని చూడలేకపోయింది. సిగ్గుతో తలవంచుకుని అక్కణ్ణించి పరిగెత్తింది.

పద్మ పకపక నవ్వుతూ "సారీ!" అన్నది. అక్కసు, హేళన, ఈర్ష్యా ధ్వనించాయి. ఆ నవ్వులో.

శేఖర్ మౌనంగా నిలబడిపోయాడు.

"చాలా గట్టివాడివే! పొద్దున్న వచ్చావు! మధ్యాహ్నానికల్లా ఆ అమ్మాయిని నీ చేతుల్లో మైనం ముద్ద చేశావు. లేక ఆ అమ్మాయే నిన్ను తన చేతుల్లో పిండి బొమ్మ చేసిందా!"

"షటప్!" అని శేఖర్ చకచక వెళ్ళిపోయాడు. పద్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

## 18

సాయంకాలం పోలీసు ఇన్స్పెక్టర్ తోటమాలి శేషయ్యనీ మొద్దబ్బాయినీ తీసుకొచ్చి దింపేశాడు. కామరాజుని కలుసుకుని "వాళ్ళిద్దరి విషయం ఆరా తీశాను. దొంగలు కాదు. పోలీసులంటే భయంవల్ల అలా ప్రవర్తించారు" చెప్పాడు.

కామరాజు తల ఊపాడు.

"మెయిన్ స్విచ్ ఆర్పేసి, తరువాత ఎవరో వెలిగించి ఉండాలి అని నా అనుమానం. కాని స్విచ్ మీద వేసి ముద్రలు ఏమీ లేవు. చేతికి జేబురుమాలు చుట్టుకుని ఉండవచ్చు దొంగ. ఇక పోతే పద్మ గది తలుపు లోపల గడియ ఆసిడ్‌తో కరిగించి వేయబడిందని తేలింది. తలుపు సందులోంచి గడియ మీదికి ఆసిడ్ పోసి ఉండాలి. టెలిఫోన్ తీగ ఎవరో కత్తిరించారు. కనుక ఈ పనులన్నీ ఎవరో మనిషే చేసి ఉండాలని తేలుతోంది. దెయ్యం అయితే తలుపు తెరవడానికి ఆసిడ్ పొయ్యవలసిన అవసరం ఉండదు. దెయ్యాలకి తలుపులూ, గోడలూ అడ్డురావు కదూ!" అన్నాడు ఇన్స్పెక్టర్.

కామరాజు నవ్వి "యు ఆర్ కరెక్ట్ దెయ్యం అనేది నాన్సెన్స్. నేను నమ్మను. వాకిలి తలుపు తెరిచి ఉండగా దొంగ లోపల ప్రవేశించి ఉంటాడు ఎవరూ తనకి అడ్డురాకుండా అన్ని గదులకీ గడియలుపెట్టి ఉంటాడు. పద్మ పడుకున్న గదిలో ధనరాసులుండ వచ్చునని అనుకుని ఆ గదిలో ప్రవేశించడానికి ప్రయత్నించి లోపలికి వెళ్ళి ఉంటాడు. ఏమీ లేకపోయేటప్పటికి బయటికి వచ్చేసి ఉంటాడు, దొంగని చూసి దెయ్యం అని ప్రసాద్ భ్రమ పడ్డాడు. థాంక్స్ ఇన్స్పెక్టర్! కబురు చెయ్యగానే వచ్చారు" అన్నాడు కామరాజు.

"థాంక్స్ ఎందుకు! మా డ్యూటీ మేము చేశాం. వస్తాను సార్!" అని ఇన్స్పెక్టర్ లేచి నిలుచున్నారు.

అంతలో మునయ్య ఓ కవరు తీసుకు వచ్చి కామరాజు కిచ్చాడు.

కామరాజు కవరు ఇటు అటు తిప్పి చూసి చింపాడు అందులో ఒకే ఒక పావుఠావు కాగితం ఉంది చదవడం ప్రారంభించాడు.

**"శ్రీ కామరాజుగారికి**

మీరు ఈ ఇంట్లో ఉండడం మంచిదికాదు దెయ్యాలంటే మీకు నమ్మకం లేకపోవచ్చు. కాని నా మాట వినండి. మీరూ, మీ ఆప్తులూ వెంటనే ఈ ఇల్లు వదిలి ఇంకెక్కడికయినా వెళ్ళండి. మొండిగా ఉంటే చాలా ఘోరాలు జరుగుతాయి. తర్వాత చింతించి ప్రయోజనం ఉండదు

శ్రేయోభిలాషి"

తేదీ లేదు. ఊరి పేరు లేదు. కామరాజు ఆ ఉత్తరం ఇన్స్పెక్టర్‌కి ఇచ్చి "చదవండి!" అన్నాడు.

"ఈ ఉత్తరం ఎవరు రాసి ఉంటారని మీ అనుమానం?" అడిగాడు ఇన్స్పెక్టర్ ఉత్తరం చదివి.

కామరాజు పెదవి విరిచి "ఎవర్ని అనుమానించను! ఏమో!" అన్నాడు.

"ఈ ఉత్తరం నేను తీసుకు వెళతాను. వేలిముద్రలు కాని, ఇతర నిదర్శనాలు కాని ఏమైనా కనపడతాయేమో చూస్తాను."

"సరే! అన్నాడు కామరాజు.

# 19

"ఏమమ్మా! ఎందుకు ఆ కళ్ళ నీళ్ళు నిన్ను ఎవరేమన్నారు?" అడిగాడు వైకుంఠరావు పద్మని. అయిదు నిమషాల సేపు పద్మ వెక్కి వెక్కి ఏడ్చింది. తండ్రి ఎంత ఓదార్చినా ఎంత బతిమాలినా ఏడుపు మానలేదు.

"చెప్పమ్మా! ఏం జరిగింది?" అడిగాడు వైకుంఠరావు పదోసారి.

"ఈ ఇంట్లో ఇంకొక క్షణం ఉండను. వెళ్ళిపోదాం" అన్నది పద్మ.

"అసలు ఏం జరిగిందో చెప్పు!"

పద్మ కళ్ళు తుడుచుకుని, ఎక్కిళ్ళు ఆపుకుంటూ జరిగింది చెప్పింది తండ్రికి.

"ఆస్తిపరుడు విదేశాలకి వెళ్ళి వచ్చినవాడు, అందగాడు శేఖర్, అతన్ని వలలో వేసుకుందామని ఆ అమ్మాయి ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎటొచ్చీ శేఖర్ అంత అవివేకంగా ఎందుకు ప్రవర్తించాడనేదే సమస్య. ఏమైనా మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోవడం అవివేకం. శేఖర్ని తన వశం చేసుకునేందుకు భారతికి పూర్తిగా అవకాశం ఇచ్చిన వాళ్ళం అవుతాం. ఆ అమ్మాయిని ఇక్కణ్ణించి పంపించేసే ఏర్పాటు చేస్తాను. అప్పుడు శేఖర్ ఎలా మారిపోతాడో నువ్వే చూద్దువుగాని" అని పద్మని ఒప్పించి వైకుంఠరావు చర చర కామరాజు గదిలోకి వెళ్ళాడు.

కామరాజు పడుకుని ఏదో చదువుకుంటున్నాడు. భారతి ఔన్సు గ్లాసులో మందు పోస్తోంది.

"ఏం బావా! చదరంగం ఆడతావా!" అడిగాడు కామరాజు పుస్తకం మూసేస్తూ.

"ఊ!" అన్నాడు వైకుంఠరావు. ముందు ఇచ్చి భారతి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఇంట్లో ఇంతమంది ఉండగా ఈ నర్సు ఎందుకు? డబ్బు దండగ. ఈ మాత్రం మందు ఇవ్వడం పద్మ చెయ్యలేదూ!" అన్నాడు వైకుంఠరావు.

"మంచి పిల్ల, తండ్రి లేడు తల్లినీ తమ్ముణ్ణి పోషించాలట. పాపం!" అన్నాడు కామరాజు

"అందుకని అవసరం లేకపోయినా జీతం ఇస్తావా?"

కామరాజు నవ్వి "అవసరం ఏముంది? నర్సింగ్ చేస్తోందిగా! నీ ఎత్తు ఆలోచించి వెయ్యి. రాజు కట్టుబడి పోతాడు" అన్నాడు.

భారతి గురించి ఇక కామరాజుతో మాట్లాడి ప్రయోజనం లేదని నిశ్చయించుకున్నాడు వైకుంఠరావు. రెండు ఆటలు ఆడి వెళ్ళిపోయాడు.

తండ్రి రాగానే "ఏమైంది?" అడిగింది పద్మ.

"ఆ అమ్మాయిని కామరాజు పనిలోంచి తీసేటట్లు లేడు. కనుక ఆ అమ్మాయే పనిలోంచి వెళ్ళిపోయే పథకం వేస్తాను."

"ఏం చేస్తావు!"

"ఇప్పుడేమీ అడగక. ఆలోచించాలి. ఎవరో అనామకురాలు వచ్చి మన శేఖర్ని పెళ్ళిచేసుకోవడానికి ప్రయత్నిస్తుందా! ఎంత ఆశ! దాని పని నేను పడతానుండు" అని వైకుంఠరావు తీవ్రంగా ఆలోచిస్తూ గదిలో పచార్లు ప్రారంభించాడు.

"భారతీ"

"ఎవరు? అని పడుకున్నదల్లా లేచి కూర్చున్నది భారతి.

"నేను శేఖర్ని" తలుపు తెరిచి అక్కడే ఆగిపోయాడు.

భారతి చటుక్కున లేచి "ఎందుకు వచ్చారు?" అడిగింది.

"క్షమాపణ అడగటానికి"

భారతి మాట్లాడలేదు.

"చొరవ చేసుకుని అలా మొరటుగా ప్రవర్తించినందుకు క్షమించు భారతీ! ఎందుకలా ప్రవర్తించానో నాకే తెలియదు. నిగ్రహించుకోలేకపోయాను."

భారతి తలవంచుకు నిలుచున్నది.

"నన్ను గురించి నువ్వు ఏమనుకున్నావో! ఏ ఆడది కనిపించినా ఒళ్ళు మరిచిపోయి అలా ప్రవర్తిస్తాననుకోకు. నా స్వభావం అలాంటిది కాదు."

"జరిగిందేదో జరిగిపోయింది. మరిచిపోండి" అని వెనక్కి తిరిగింది భారతి.

"నిన్ను మరిచి పొమ్మని చెప్పడానికి కాని నేను మరిచిపోతానని చెప్పడానికి కానీ రాలేదు నీ దగ్గరికి. నేను పుట్టినప్పటినుంచి వెతుకుతున్నదేదో కనిపించినట్టయింది. నిన్ను చూడగానే. అదేమిటో తెలియదు. ప్రేమంటారేమో!" అన్నాడు శేఖర్.

భారతి చటుక్కున అతనివైపు తిరిగి "దయచేసి వెళ్ళిపొండి నన్ను అలా హేళన చెయ్యకండి" అన్నది ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"నిన్ను హేళన చేస్తున్నానా! అదేమిటి భారతీ!"

"ప్లీజ్! మీ నాన్నగారికి నర్సింగ్ చెయ్యడానికి జీతం డబ్బుల కోసం మీ ఇంట్లో పనికి కుదిరాను నిజమే. అంత మాత్రాన -" వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది భారతి.

శేఖర్ నిశ్చేష్టుడయిపోయాడు. భారతిని ఎలా ఓదార్చాలో, ఏమని చెపితే ఆమె కళ్ళ నీళ్ళు తుడుచుకుంటుందో తెలియక తికమక పడుతున్నాడు.

"ఏమోయ్! ఇక్కడ ఉన్నావా నువ్వు?"

శేఖర్ ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. భారతి గది తలుపు తెరిచే ఉంది. తలుపుకి అవతల వైకుంఠరావు నిలుచున్నాడు.

"ఆ పిలిచావా మామయ్యా!"

"అవును. నీతో మాట్లాడాలి!"

శేఖర్ భారతి గదిలోంచి బయటకి వెళ్ళాడు.

"నీ పేరేమిటి? నువ్వెవరు?!" అడిగాడు రాజారాం.

"ఏమిటీ ప్రశ్న!" అన్నది సావిత్రి చదువుతున్న పుస్తకం మొహానికి అడ్డం తీయకుండానే.

"ఇదుగో! ఇటు చూడు. బుకాయించి ప్రయోజనం లేదు. నువ్వు నా చెల్లెలు సావిత్రి కావని తెలుసు."

సావిత్రి పుస్తకం పక్కన పెట్టి రాజారాంని సూటిగా కళ్ళల్లోకి చూస్తూ "నా పేరు సావిత్రే" అన్నది.

"నా చెల్లెలివి కావు."

"కానని నీ కెలా తెలుసు?"

"ఎలా తెలిస్తేనేం! తెలుసు. ఎవరివో చెప్పు! ఎందుకు అబద్ధం చెప్పావు? ఎవరు నిన్ను పంపించారు?" చాలా కఠినంగా అడిగాడు రాజారాం.

సావిత్రి నవ్వి "ఎందుకంత కోపం! నీ చెల్లెలిని కాక పోతే మాత్రం ఏం! నీకేం హాని చేశాను! డబ్బు ఇచ్చాను వంట చేసి పెడుతున్నాను" అన్నది.

"నోరుముయ్యి, నిజం చెప్పు" రాజారాం చేతిలో చాకు చూసి బెదిరిపోయి, లేచి కూర్చుని "నిజంగా నా పేరు సావిత్రి, సావిత్రే" అన్నది.

రాజారాం కత్తి అరిచేతిమీద సానపెడుతూ "నువ్వు నా చెల్లెలివి కావు" అన్నాడు.

"కాను"

"అయితే ఎందుకు నా చెల్లెలని చెప్పుకుని వచ్చావు?" రాజారాం మాటలు రాళ్ళు పగలకొడుతున్నట్లున్నాయి.

"నువ్వు ఆ నగలు ఎక్కడ దాచావో కనుక్కోవడానికి."

రాజారాం తలవూపి "నిన్ను ఎవరు పంపించారు? పోలీసులా?" అడిగాడు.

"కాదు"

"మరెవరు?"

"అతనెవరో నాకు తెలియదు. ఉత్తరం రాశాడు."

రాజారాం మొహం చిట్లించి "అబద్ధాలు చెప్పక, నేను మంచివాణ్ణి కాను" అన్నాడు.

"నేను నిజమే చెపుతున్నాను. నువ్వు నా మాట నమ్మాలి నీ చెల్లెలు సావిత్రిలా నేనూ రెండుసార్లు జైలుకి వెళ్ళాను. అవకాశం దొరికినపుడు సినిమాలలో చిల్లర వేషాలు వేస్తుంటాను. నువ్వు విడుదలయేందుకు వారం రోజులవి ముందు నాకు ఓ ఉత్తరం వచ్చింది."

"ఏమని?"

"నువు జైలునుంచి విడుదలై వస్తున్నావనీ, నీ చెల్లెలు సావిత్రిలా నటించి, నిన్ను మోసగించి, నీకూడా ఉండమనీ, పదేళ్ళక్రితం నువ్వు దొంగలించిన నగలు ఎక్కడో దాచావని, ఆ నగలు తీసుకోడానికి ప్రయత్నిస్తావనీ, ఆ నగలు ఎక్కడ దాచినదీ తెలుసుకోమనీ రాశారు ఎవరో. అందుకు నేను సమ్మతిస్తే అడ్వాన్సుగా రెండు వేల రూపాయలు ఇస్తానని నగల విషయం చెప్పిన తర్వాత పదివేల రూపాయలు ఇస్తాననీ రాశాడు. ఒప్పుకున్నాను. ఆ మనిషి ఎవరో నేను చూడలేదు. అతని పేరు నాకు తెలియదు. ఎక్కడుంటాడో కూడా తెలియదు."

"అయితే ఒప్పుకున్నట్లు అతనికి ఎలా తెలియజేశావు? నగల విషయం తెలుసుకున్న తర్వాత అతనికి ఎలా తెలియజేయమన్నాడు?"

"కేరాఫ్ పోస్ట్‌మాస్టర్, మౌంట్ రోడ్ పోస్ట్ ఆఫీసు," అన్న అడ్రసుకి ఉత్తరం రాయమన్నాడు. రాశాను. మర్నాడు నా గదికి ఒక ఆడమనిషి వచ్చి రెండువేల రూపాయలు ఇచ్చింది. నాకు డబ్బు ఇస్తున్న మనిషి చాలా చెడ్డవాడనీ, అతన్ని మోసం చేస్తే ప్రాణాలు తీసేస్తాడనీ, అన్నమాట ప్రకారం తు.చ తప్పకుండా చెయ్యమనీ హెచ్చరించింది. ఓ చిరునామా చెప్పి నగలు ఎక్కడదాచినది తెలుసుకున్న తర్వాత అక్కడకి ఉత్తరం రాయమన్నది.

"ఏమిటా చిరునామా?"

"నా పెట్టెలో దాచాను తెస్తానుండు"

"కదలక. అలాగే కూర్చో. పెట్టె నేను తీస్తాను" అని మంచం కిందవున్న పెట్టెని ఒక తన్ను తన్నాడు రాజారాం, సావిత్రి అవతల పక్కకి జరిగింది. మంచాన్ని చుట్టి వెళ్ళి పెట్టె బల్లమీద పెట్టి తెరిచి "ఎక్కడున్నది!" అడిగాడు.

"కుడివైపున ఆ ఎర్రచీర అడుగున ఒక కవరున్నది."

రాజారాం ఆ కవరు తీశాడు. అందులో ఒక ఉత్తరమూ, ఒక చిన్నకాగితమూ ఉన్నాయి. ముందు ఉత్తరం చదివాడు. సావిత్రికి ఆ అజ్ఞాత వ్యక్తిరాసిన ఉత్తరం అది. కాగితం మీద చిరునామా చూశాడు.

గణపతి పిళ్ళె వీధి, నెంబర్ 779, మొదిలియార్ అని రాసి ఉంది. కవరు మళ్ళీ పెట్టెలో చీరకింద పెట్టేసి సావిత్రి వైపు తిరిగి "నువ్వు నిజం చెపుతున్నావో, అబద్ధం చెపుతున్నావో నిశ్చయించుకో లేకుండా ఉన్నాను" అన్నాడు రాజారాం.

"నేను నిజమే చెపుతున్నాను. ఆ ఉత్తరం చూశావుగా!"

"ఏమో ఈ ఉత్తరం ఆలోచించి ముందుగానే నువ్వే రాసిపెట్టి ఉండొచ్చుగా! ఇవాళ నీకు ఏదో ఉత్తరం వచ్చింది. చదివి చింపేశావు ఎవరు రాశారు!"

"అతనే - నన్ను నియమించిన మనిషి."

"ఏమని రాశాడు?"

"నేను తాత్సారం చేస్తున్నాననీ. త్వరగా నగలు ఎక్కడున్నదీ తెలుసుకోమనీ."

"అది పోస్ట్‌లో రాలేదే!"

"అవును పోస్టులో రాలేదు. తలుపు దగ్గిర పడి ఉంది తీసుకున్నాను."

"అంటే ఆ మనిషి ఈ ప్రాంతంలో ఉండి నిన్నూ, నన్నూ ఓ కంట పెడుతూ ఉన్నాడన్నమాట".

రాజారాం గదిలో పచార్లు ప్రారంభించాడు. పదినిమిషాల సేపు సావిత్రి ఓపికతో కాచుకుని తర్వాత "ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగింది.

"నీ విషయమే! నిన్నేం చేద్దామా అని."

"అంటే -"

"నీ వల్ల ఇప్పటికి నాకు జరిగిన అపకారం ఏమీలేదు, నగలు ఆ ఇంట్లో ఉన్నాయనే విషయం నీకు తెలిసింది. అంతే. నేను ఇక్కడ పనికి కుదరడం వల్ల ఆ విషయం ఎలాగు తెలుస్తోంది. అందుకనే నిన్ను కనికరించి వదిలిపెట్టేద్దామా అని ఆలోచిస్తున్నాను.

సావిత్రి మంచం మీద నుంచి లేచి అతని దగ్గిరికి వెళ్ళి "రాజా! నేనొక సలహా చెపుతా విను. నన్ను పంపించెయ్యక, నీతో ఉండనియి. నన్ను నియమించిన మనిషి ఎవరో కనుక్కుని నీకు చెపుతాను నగలు ఎక్కడ దాచినదీ నాకు చెప్పనవసరంలేదు. నన్ను నీతో ఉండనియ్యి" అన్నది ఆవేశంతో.

"నువ్వు ఇక్కడ నాతో ఎందుకు! నువ్వు నా చెల్లెలివి కావని నేను కనుక్కుని తరిమేశానని చెప్పు."

సావిత్రి అతనికి మరింత దగ్గరిగా జరిగింది. అతని మెడచుట్టూ చేతులు వేసింది. అతని తల తన మొహం మీదకి లాక్కుని పెదిమిల మీద గట్టిగా ముద్దు పెట్టుకుని కావలించుకుంది.

"ఒదులు వొదులు - ఏమిటీ వికారం?" అన్నాడు రాజారాం ఆమె ఆలింగనంలోంచి తప్పించుకుంటూ.

"వికారం కాదు రాజా! ఆవాళే నిన్ను జైలు దగ్గిర చూసినపుడే నేను నీదాన్ని అయిపోయాను. నీ చీకి కళ్ళు చింపిరి జుట్టు నన్ను పిచ్చిదాన్ని చేసేశాయి రాజా!"

రాజారాం సావిత్రిని కోపంగా చూస్తూ "నాటకంలో ఇది రెండో సీనా" అడిగాడు.

"నాటకం కాదు. నేను నటించడం లేదు నా గుండెమీద చెయ్యి వేసి చూడు. ఎలా కొట్టుకుంటుందో! రాజా! నేను నీ చెల్లెల్ని కానుగా! ఎందుకు సందేహిస్తావు. నేను అందంగా లేనా? నా మీద నీకు ఇష్టం లేదా"

"ఆపు! ఆపు! సావిత్రీ ఇలా కూర్చో! నువ్వు నా చెల్లెలివి కాకపోవచ్చు కాని ఇన్నాళ్ళు నా చెల్లెలు అనే అభిప్రాయంతో చెల్లెలుగా చూసుకున్నాను. ఇప్పుడు ఉన్నట్లుండి ఎలా మారతాను? నువ్వు అందమైన దానివేగాని నీ అందం నాకక్కర్లేదు. నీ విషయం వేరు. నేను నీ అన్నని కానని నీకు మొదటినుంచీ తెలుసు కనక నన్ను అన్నగా నువ్వు మొదట్నించీ చూడలేది. నేను నిన్ను చెల్లెలుగానే చూసుకున్నాను"

"అయితే నీ మనసు మారదా?"

"ఏమో! నువ్వు నా చెల్లెలు కావనే విషయం మనసులో బాగా ఇంకాక."

అంతలో తలుపు తట్టిన చప్పుడు వినిపించేసరికి ఇద్దరూ తలుపు వైపు తిరిగారు.

"ఎవరు?" అడిగాడు రాజారాం.

"నేను" అన్న మాటలు వినిపించాయి. రాజారాం ఆ కంఠ స్వరం గుర్తుపట్టలేదు. వెళ్ళి తలుపు తీశాడు. ఎవరూ లేరు.

"ఎవరు! తలుపు తట్టిందెవరు?" అని అడుగుతున్నాడే కాని గొంతు ఎండుకుపోతుంది గుండె దడదడ మంటున్నది. కాళ్ళు ఒణుకుతున్నాయి. చెమట పోస్తోంది. బయట చీకటి. ఆ చీకట్లో తలుపు పక్కనుంచి ఒక చెయ్యి ముందుకు వచ్చింది. పెద్ద చెయ్యి, లావుగా, మొరటుగా ఉన్న వేళ్ళు, వేళ్ళ మీద గుబురుగా నల్లని వెంట్రుకలు. ఆ చెయ్యి చూడగానే అరవాలనీ, వెనక్కి తిరిగి పోవాలనీ అనిపించింది రాజారాంకి. కాళ్ళాడలేదు. రాతిబొమ్మలా నిలబడిపోయాడు.

చెయ్యి ముందుకు వచ్చి రాజారాం మెడపట్టుకుంది. గట్టిగా పట్టుకుని పక్కకి చీకట్లోకి లాగింది. రాజారాం అరవడానికి ప్రయత్నించాడు కాని గొంతు పెగలలేదు.

"ఎక్కడికి వెళ్ళావు? ఎవరు పిలిచారు?" అంటూ తలుపు దగ్గరికి వెళ్ళి గడపమీద నిలుచుని బయటికి తొంగి చూసింది సావిత్రి. ఎవరూ కనిపించలేదు.

"రాజా!" పిలిచింది. జవాబులేదు. ఇంకాస్త పెద్దగా కేకపెట్టడానికి నోరు తెరిచింది. నల్లగా, లావుగా ఉన్న చెయ్యి పక్కనుంచి తన మొహం ముందుకి రావడం గమనించి భయంతో వెనక్కి అడుగు వెయ్యబోయింది. అంతలోనే ఆ చెయ్యి బిగించిన పిడికిలితో నోటిమీద గట్టిగా కొట్టింది. సావిత్రి స్పృహ తప్పి పడిపోయింది.

## 20

**వైకుంఠరావుకి** నిద్రపట్టలేదు. పక్కమీద ఇటునుంచి అటు చాలాసార్లు దొర్లి దిండు రకరకాలుగా మార్చి నిద్రపోవడానికి ప్రయత్నించాడు కాని నిద్రపట్టలేదు. భారతి గదిలో శేఖర్‌ని చూడగానే అతని ఒళ్ళు మండిపోయింది. ఎవరో అనామకురాలు శేఖర్‌ని తన వశం చేసుకుంటోంది. తన కూతురు పద్మకోసం గతించిన తన భార్య మనశ్శాంతి కోసం, శేఖర్ క్షేమం కోసం తను జోక్యం కలిపించుకుని శేఖర్ భారతిల స్నేహం చెడగొట్టాలని నిశ్చయించుకున్నాడు,

ఏం చెయ్యాలి? భారతి మీద శేఖర్‌కి కోపమూ అసహ్యం కలిగేట్లు చేయడం ఎలా అని ఆలోచిస్తున్నాడు. బల్లమీదవున్న చేతి గడియారం తీసి చూశాడు. పదకొండు గంటలయింది. చప్పుడు చెయ్యకుండా తలుపు తెరిచాడు.

వైకుంఠరావుకి దెయ్యాలలో, భూతాలలో ఎన్నడూ నమ్మకం లేదు. ప్రసాద్ చెప్పిన విషయం అసలు నమ్మలేదు. కుర్రవాడు భయపడి భ్రమలో పడ్డాడని అనుకున్నాడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడవడం ప్రారంభించాడు. లింగమూర్తి గదిలోంచి గురక వినపడుతోంది. ఎక్కడా దీపాలు లేవు. చీకటిగా ఉన్నా వైకుంఠరావు ముందుకి సాగిపోయాడు. తను చెయ్యనున్న పని తలుచుకుని తనలో తనే నవ్వుకుంటున్నాడు. చాలా తెలివైన ఆలోచన స్ఫురించింది. ఎటొచ్చి బయట పడకూడదు. తను చేసినట్లు తెలియకూడదు. తెలిసిందా నామర్దా! హాల్లోకి వెళ్ళి క్షణంపాటు నిలబడి, ఇంట్లో ఎవరయినా మెలుకువగా ఉన్నారేమో తెలుసుకోవడానికి చెవులు రిక్కించుకుని విన్నాడు. అందరూ నిద్రపోతున్నారని నిశ్చయించుకుని మెట్లవైపు వెళ్ళాడు.

నెమ్మదిగా ఒక్కొక్క మెట్టుఎక్కడం ప్రారంభించాడు. అడుగు తీసి అడుగు వేస్తున్నప్పుడు స్వల్పంగా కూడా చప్పుడు కావడం లేదు. దాదాపు మెట్లన్నీ ఎక్కేసాడు. ఇంకా రెండు మెట్లు ఉన్నాయి. చేతికి ఏదో వెచ్చగా తగిలింది. పక్కకి చీకట్లోకి చూశాడు. ఆ చీకట్లో సరిగా ఏమీ కనిపించలేదు. కాని మెట్లమీద గోడకి ఆనుకుని అస్పష్టంగా ఓ ఆకారం కనిపిస్తోంది. నల్లని చీకట్లో మరీ నల్లగా ఉంది ఆకారం. వైకుంఠరావు గుండె దడదడ మన్నది. మెట్ల మీద కన్పించిన ఆకారం గురించి ప్రసాద్ చెప్పిన విషయాలు జ్ఞాపకం వచ్చాయి. అయినా ధైర్యం తెచ్చుకుని "ఎవరు నువ్వు?" అడిగాడు. ఆ ఆకారం పలకలేదు. కదలలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మాత్రం వైకుంఠరావుకి వినిపిస్తున్నాయి.

దెయ్యం కాదు. మనిషే! ధైర్యం తెచ్చుకుని "చెప్పు ఎవరు నువ్వు?" అంటూ ఆ ఆకారం దగ్గరికి జరిగాడు.

అంతే తర్వాత ఏం జరిగిందో వైకుంఠరావుకి తెలియదు. పెద్ద ఇనుపగుండు తలమీద పడినట్లయింది. ఆ మెట్ల మీద అక్కడే కిక్కురు మనకుండా కూలిపోయాడు.

## 21

"ఎక్కడ దాచావు నగలు చెప్పు!"

రాజారాం కళ్ళు పెద్దవి చేసి చూశాడు. కటిక చీకటి. ఏమీ కనిపించడం లేదు. ఎవరు ఆ ప్రశ్న తనని అడుగుతున్నారు? ఏం జరిగింది? తను ఎక్కడ ఉన్నాడు? జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నించాడు.

"ప్రాణం కన్నా డబ్బు ఎక్కువ కాదు. చెప్పు!" మళ్ళీ వినిపించాయి ఆ మాటలు. తన పక్కనుంచి కాదు. తన వెనకనుంచీ కాదు. ఎక్కడో దూరంనుంచి అడుగుతున్నట్లు వినిపించింది రాజారాంకి.

"ఎవరు నువ్వు?" అడిగాడు రాజారాం

"నే నెవర్నయితే నీకెందుకు? నేనడిగిన ప్రశ్నకి జవాను చెప్పు!"

తను ఎక్కడున్నదీ తెలుసుకోవడానికి చుట్టూ చూశాడు రాజారాం. తెలియలేదు. చీకట్లో ఏ గుర్తూ కనిపించడం లేదు. తెలిసిందల్లా తను మంచం మీద వున్నాడు. చేతులూ, కాళ్ళు మంచానికి కట్టేసివున్నాయి. కదలడానికి వీలు లేకుండా ఉంది. తన పక్కనే ఎవరో పడుకున్నారు! వెచ్చగా ఊపిరి మీదకి తగులుతోంది ఎవరది? పక్కకి తిరిగితే తెలుసుకోవచ్చు. కాని పక్కకి తిరగటానికి వీలుకాకుండావుంది.

"ఏం నగలు?" అడిగాడు రాజారాం. చిన్న నవ్వు వినిపించింది. "అలా ఎదురు ప్రశ్నలు వేసి, తప్పించుకోలేవు. పది ఏళ్ళ క్రితం నువ్వు దొంగిలించిన నగల విషయం. ఎక్కడ దాచావో చెప్పు."

"చెప్పకపోతే ఏం చేస్తావు?"

"ఏమైనా చెయ్యగలను. నీ ఒంటి చర్మం ఈ కత్తితో ఒలుస్తాను. చెవులు కోసేస్తాను. కళ్ళు పొడిచేస్తాను. అప్పటికీ చెప్పకపోతే వొంటి కండలు ముక్కలు ముక్కలుగా కోసేస్తాను."

"పదేళ్ళు నేను జైలులో గడిపింది ఆ నగలు నీకివ్వడానికా!" అడిగాడు రాజారాం.

"నీతో వాదిస్తూ కూర్చోడానికి నాకు వ్యవధి లేదు. చెప్పు!"

రాజారాం మాట్లాడలేదు. చల్లగా ఏదో తగిలింది చెంప మీద. ఒళ్ళు జలదరించింది. అది కత్తి. అరవడానికి వీలు లేకుండా నోటిని ఓ చెయ్యి బలంగా నొక్కిపట్టింది. ఉల్లగడ్డ తోలు గీకినట్లు చెంపమీద చర్మాన్ని కత్తితో గీకుతున్నాడు.

మంటా, బాధా, పళ్ళు బిగించి, నరాలు బిగించి ఆ యమబాధ భరించడానికి నిశ్చయించుకున్నాడు రాజారాం.

"ఇంకా కావాలా!"

రాజారాం మాట్లాడలేదు.

నిప్పులతో కాల్చేసినట్లయింది చెవి, చెప్పలేని మంట చెవి కింద కండ కోసేశాడు.

"నువ్వు చెప్పేంతవరకూ ఇలా హింసిస్తూనేవుంటాను."

ఆ కంఠస్వరంలో ఏకోశానా దయలేదు. అన్నంత పనీ చేస్తాడు ఎవడో వీడు రాక్షసుడులా ఉన్నాడు. బాధ భరించలేక, ప్రాణం రక్షించుకుంటే చాలునని (ఇప్పుడు కాకపోయినా) మనోబలం పూర్తిగా నశించి ఇంకాసేపట్లో ఎలాగు చెపుతాడు. ఇప్పుడే చెప్పి ఆ బాధ తప్పించుకోవడం వివేకం అనుకుని "ఆగు! చెపుతాను" అన్నాడు రాజారాం.

## 22

భారతికి మెలుకువ వచ్చింది. మెలుకువరాగానే కళ్ళు తెరవలేకపోయింది. కనురెప్పలు బరువుగా ఉన్నట్లు కళ్ళు అతుక్కుపోయినట్లు అనిపించింది గొంతు ఎండుకు పోయినట్లున్నది దేనితోనో ఒళ్ళంతా బిగించినట్లు నొప్పిగా ఉంది.

జ్వరం వచ్చిందా! ఇన్ఫ్లూయంజా???? ఏమో! లేచి కూర్చోవడానికి ప్రయత్నించింది కాని లేవలేకపోయింది. ఎవరో తనని గట్టిగా ఇనప చేతులతో కావలించుకున్నట్లుంది. కిటికీ తలుపు తెరిచే ఉంది. ఆకాశంలో నక్షత్రాల వెలుగు కూడా కనిపించడం లేదు, నల్లగా ఉంది. ఉరుములు, మెరుపులు, మెరుపు మెరిసినపుడు చూసింది. మంచం మీద తన ప్రక్కన ఎవడో పడుకున్నాడు. రెండు చేతులతోనూ తనని గట్టిగా కావలించుకుని పడుకున్నాడు. ఎవడు? తన గదిలోకి ఎలా వచ్చాడు! తన పక్కన పడుకుని తనని కావలించుకుంటుంటే తనేం చేస్తోంది!

"ఎవరు నువ్వు? ఛీ! లే!" అని తన చుట్టూ పెనవేసుకున్న చేతుల్ని విడిపించుకోవడానికి చేతులు విదిలించింది భారతి కాని తన ప్రక్కన పడుకున్న మనిషి పలకలేదు, కదలలేదు, చేతులు వదలలేదు.

భారతి దిగమింగుకో లేనంత కోపం వచ్చింది. నిద్రపోతున్న తనని చెరపడానికి ప్రయత్నించిన ఆ నీచుడు ఎవడు?

"ఎవరు నువ్వు? నన్ను ఒదులు! అరుస్తాను" అన్నది భారతి పళ్ళు పట పట కొరుకుతూ.

తన పక్కన పడుకున్న మనిషిని చెంపమీద ఫెళీమని కొట్టి "ఊ ఒదులు నన్ను!" అన్నది.

ఆ దెబ్బకి కూడా అతను పలకలేదు.

"ఒదులుతావా? లేదా?"

నిశ్శబ్దం! భారతి తలవంచి, మునిపళ్ళతో అతని భుజం కొరికింది.

అప్పటికీ ఆ మనిషిలో చలనం లేదు. ఎలా పడుకున్న మనిషి అలాగే ఉన్నాడు. .భారతి తలపైకెత్తి తన పక్కన పడుకున్న మనిషి మొహం చూసింది..

తను ఊపిరి పీల్చడం, ఒదలడం ఇంజను హోరుమల్లే చెవుల్లో వినిపిస్తోంది అది మినహా అంతా నిశ్శబ్దం. పక్కన పడుకున్న మనిషిలో అసలు చలనం లేదు.

భారతికి భయం వేసింది. ఓ చెయ్యి పైకెత్తి తల దగ్గరున్న టేబుల్ లాంప్ స్విచ్ నొక్కింది. దీపం వెలుగు మంచం మీద పడింది.

కెవ్వుమని కేకపెట్టింది భారతి. నల్లగా గడ్డకట్టిన రక్తం, కళ్ళు కనిపించడం లేదు. ముఖరేఖలు కనిపించడం లేదు. ఊపిరి పీల్చడం లేదు. చలనం లేదు. కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. కాని వాటిల్లో చూపులేదు. అది శవం. శవం కొయ్యబారిపోయింది. కొయ్యబారిన ఆ శవం ఆలింగనంలో తను ఇరుక్కుంది. ఆ శవం ఎవరిది? తన గదిలోకి వచ్చి తన మంచం మీద పడుకుని తనని కావలించుకుని తర్వాత ప్రాణం విడిచిన ఆ మనిషి ఎవరు అనే ఆలోచన కలగలేదు. ఒకటే ఆలోచన - కొయ్యబారిపోయిన శవం చేతుల్లో ఇరుక్కుంది తను, తన నడుం మీద నుంచి, రొమ్ము మీదకి చుట్టుకున్న ఆ చల్లని చేతులు తీసేసేందుకు బలం అంతా ప్రయోగించింది.

కాని ఆ శవం ఆలింగనంలోచి తప్పించుకోలేక పోయింది. మంచం మీద నుంచి లేవడానికి కూర్చోడానికి ప్రయత్నించింది. కొయ్యబారి తట్టెమల్లేవున్న ఆ శవం కూడా ఆమెతోపాటు లేచింది. భారతికి మతిపోయినట్లయింది. అరవాలని నోరు తెరిచిందే కాని గొంతు పెగలలేదు. చల్లగా తన ఒంటికి తగులుతున్న శవం చేతులు, తన మొహానికి అర అంగుళం దూరంలో ముద్దుపెట్టుకున్నట్లున్న ఆ శవం నోరు, గడ్డకట్టిన నెత్తురుతో భీభత్సంగా ఉన్న ఆ నిర్జీవమైన మొహం, తనతోపాటు తనని అంటి పెట్టుకుని కదులుతున్న ఆ శవం - భయంతో, రక్తపోటుతో స్పృహ పోతోంది భారతికి. స్పృహ పోతే ఇంకా ఎంతసేపు ఆ శవం చేతుల్లో అలా ఉండాలో అనే భయం మనస్సులో ఆందోళన చేస్తూ స్పృహ పోకుండా చేస్తోంది.

చెయ్యి చాచి మంచం ప్రక్కనున్న ఎలక్ట్రిక్ కాలింగ్ బెల్ మీట మీద వేలు పెట్టింది భారతి. ఎక్కడో దూరాన గణగణమని గంట మోగడం వినిపిస్తోంది,

భారతికి స్పృహ పోయింది.

## 23

జోరుగా వాన ప్రారంభం అయింది. ఈదురుగాలికి కిటికీల తలుపులు ధన్ ధన్ మని కొట్టుకుంటున్నాయి. చెవులు బద్దలు అయే ఉరుములు అయిదునిమిషాల కోసారి కళ్ళు జిగేలు మనిపించే మెరుపులు.

ఆ చప్పుళ్ళతోపాటు ఆగకుండా గణ గణ మోగుతుంది గంట. గాఢ నిద్రలో ఉన్నవాళ్ళు, సగం నిద్రలో ఉన్న వాళ్ళు అందరూ లేచారు - జల్లుపడకుండా కిటికీల తలుపులు మూసేసుకుని నిద్రపోవడానికి పూనుకున్న వాళ్ళు కొంతమంది, గణగణమని గంట ఎక్కడ మోగుతుందో అని ఆలోచిస్తున్న వాళ్ళు కొంతమంది.

కిటికీ తలుపులు మూసేశాడు శేఖర్. మళ్ళీ నిద్రపట్టడం లేదు అతనికి. సిగిరెట్ వెలిగించి చదువుకుందామని దీపం స్విచ్ నొక్కాడు. దీపం వెలగలేదు. తుఫానులో ఏ చెట్టో విరిగి ఎలక్ట్రిక్ తీగమీద పడివుంటుంది. అందుకే ఎలక్ట్రిసిటీ పోయి ఉండాలి అనుకున్నాడు. అయినా కాని లోపల ఏదో పీకుతోంది. క్రితం రాత్రి కూడా ఇలాగే జరిగిందనీ, దెయ్యం వచ్చిందనీ ప్రసాద్ అన్నాడు.

దెయ్యం ప్రత్యక్షమయ్యే ముందు దీపాలు వెలగకుండా చేస్తుందా? ఆ విషయం తెలుసుకుంటే తప్ప తనకి నిద్రపట్టదు. బల్ల సొరుగులోంచి టార్చిలైటు తీసుకుని గదిలోంచి బయటకి వెళ్ళాడు. రెండు క్షణాలు తలుపు బయట నిలబడి టార్చి వెలుగు నాలుగు మూలలా వేసి చూడాడు. బల్లలు, బీరువాలు, గోడలకున్న పఠాలు తప్ప ఇంకేమీ కనబడలేదు. మెయిన్ స్విచ్ హాలు పక్కనకింద వున్న

గదిలో ఉంది. అక్కడికి వెళ్ళి చూడాలి. ఎందుకయినా మంచిదని మళ్ళీ గదిలోకి వెళ్ళి పిస్తోలు తీసుకుని బయటికి వచ్చాడు. ఒక చేతిలో పిస్తోలు, రెండో చేతిలో టార్చి పట్టుకుని మెట్లు దిగాడు శేఖర్.

దొంగ కానీ, దెయ్యం కానీ అతనికి ఎదురు కాలేదు. రకరకాల చప్పుళ్ళు మాత్రం వినిపిస్తున్నాయి. ఆ చప్పుళ్ళన్నీ దెయ్యమే చేస్తోందని అంటాడు ప్రసాద్. తనలో తను నవ్వుకున్నాడు.

మెయిన్ స్విచ్ దగ్గరికి వెళ్ళి టార్చి వెలుగులో పరీక్ష చేశాడు. ఫ్యూజ్‌లు సరిగానే ఉన్నాయి. కాని దీపాలు ఆరిపోయాయి. తను మొదట అనుకున్నట్లు తీగె బయట ఎక్కడో తెగిపోయి ఉంటుంది. ఇల్లంతా ఇలా చీకటిగా ఉంటే ఎవరైనా దేనికైనా హాల్లోకి వచ్చి ఏ నీడో, మెరుపో, వెలుగో చూసి దడుసుకోవచ్చు.

హాల్లోనూ, మెట్లమీదా లాంతర్లయినా పెట్టించాలి అనుకుని శేఖర్ నౌకర్లు పడుకునే వైపు నడిచాడు అటు వెళుతున్న కొద్దీ గణ గణమంటూ గంటల చప్పుడు మరింత దగ్గిరగా వినిపిస్తోంది. చెవులు చిల్లులు పడేటట్లు గంట అలా మోగుతున్నా ఎవరు ఎందుకు నిద్రలేవలేదు. అందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లో కదలకుండా ఎందుకు పడుకున్నారు!

వంట ఇంటి తలుపు దగ్గర ఆగి చూశాడు. వంట ఇంటి తలుపు మూసేవుంది. తలుపు తట్టాడు. ఎవరూ పలకలేదు.

''సుబ్బయ్యా!'' కేకేశాడు.

లోపల్నుంచి జవాబు లేదు

''తలుపు తెరు. నేను శేఖర్‌ని.''

''అయ్యగారూ వస్తున్నానండి.''

నిమిషం తర్వాత వంట ఇంటి తలుపు తెరుచుకుంది. సుబ్బయ్య ఒణుకుతూ గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

''ఏమిటా గంట? ఎక్కణ్ణించి?'' అడిగాడు శేఖర్.

''అవతల నడవాలో వున్న కాలింగ్ బెల్ అయివుండాలి సార్.''

''అంటే ఎవరో పిలుస్తూ ఉండాలి. గంట మోగుతున్నా ఎవరూ ఎందుకు లేవలేదు?''

''చీకటి'' అన్నాడు సుబ్బయ్య.

అతనితో ఇక చర్చించదలుచుకోలేదు శేఖర్ ''మునయ్యా, దాసీది ఎక్కడుంటారు?'' అడిగాడు.

'' మునయ్య నడవాకి అవతల గదిలో పడుకుంటాడు. దాసీది ఇవతల గదిలో పడుకుంటుంది.''

''రా గంట ఎక్కడున్నదో చూపించు'' అని శేఖర్ వెనక్కి తిరిగాడు. సుబ్బయ్య నడవాలోకి వచ్చి గోడకి వున్న కాలింగ్ బెల్స్ చూపించాడు.

''ఇన్ని బెల్స్ ఎందుకు?''

''మేడమీద గదుల్లో ఎవరు పిలుస్తున్నదీ తెలుసుకోవడానికి సార్! ప్రతి గదికీ విడివిడిగా ఓ బెల్ ఉంది.''

శేఖర్ టార్చి వెలుగు వరసగా ఒక దాని కింద ఒకటి వున్న ఆ బెల్స్ మీద వేశాడు.

మూడో బెల్ మోగుతోంది.

''ఆ గంట ఎవరి గదిలోది?'' అడిగాడు శేఖర్.

''అది నర్సు అమ్మగారి గదిలోది''

ఆ మాట అనగానే శేఖర్ చటుక్కున వెనక్కి తిరిగి పరిగెత్తాడు.

సుబ్బయ్య విషయం ఆలోచించలేదు. చీకట్లో సుబ్బయ్యని ఒదిలి వెళుతున్నాననే ఆలోచన రాలేదు, భారతి గదిలో బెల్ మోగుతోంది. భారతి పిలుస్తోంది. అర్ధరాత్రి! చీకటి! భారతి ఏం అపాయంలో ఉందో అని అతని ఆందోళన. ఎలక్ట్రిసిటీ పోయిన ఇంట్లో ఎలక్ట్రిక్ బెల్ ఎలా మోగుతున్నదనే అనుమానం కలుగలేదు. ఊపిరి తీసుకోకుండా పరిగెత్తాడు. భారతి గది చేరుకోగానే తలుపు తట్టాడు. లోపల్నుంచి జవాబు లేదు. వెనక ఏదో అలికిడి అయేసరికి వెనక్కి తిరిగి చూశాడు శేఖర్. చీకట్లో ఒంటిగా ఉండడం ఇష్టంలేక సుబ్బయ్య శేఖర్ వెనకే మేడ మీదకి వచ్చాడు.

శేఖర్ తలుపు తోశాడు. తెరుచుకుంది. లోపల చీకటిగా ఉంది. టార్చి వెలుగు వెంటనే గదిలోకి వెయ్యడం ఇష్టం లేదు శేఖర్‌కి. ''భారతీ'' పిలిచాడు.

జవాబులేదు కిటికీలు దభీ దభీమని కొట్టుకుంటున్నాయి. టార్చి వెలిగించాడు. భారతిని కావలించుకుని ఓ మనిషి మంచం మీద పడుకునుండటం చూశాడు. శేఖర్ చటుక్కున టార్చి ఆర్పేసి, ఒక్క అడుగు వెనక్కి వేశాడు. ఏం చెయ్యాలో తోచలేదు. ఏదో పొరపాటు జరిగింది ఆ బెల్ భారతి గదిలోది అయి వుండదు.

''అయ్యగారూ! మంచం మీద మనిషి మొహం చూశారా!'' అడిగాడు సుబ్బయ్య.

''లేదు, ఏం?'' అడిగాడు శేఖర్ రహస్యంగా.

''రక్తం.. రూపు రేఖలు కనిపించడం లేదు''

''భారతి! భారతి! కాలింగ్ బెల్ నొక్కింది నువ్వేనా?'' అడిగాడు శేఖర్ టార్చి వెలిగించకుండా. టార్చి వెలిగించి భారతిని అవమానించదలుచుకోలేదు.

గదిలోంచి జవాబు లేదు. సుబ్బయ్య శేఖర్‌ని అడిగి టార్చి తీసుకుని వెలిగించి చర చర గదిలోకి వెళ్ళి మంచం దగ్గర ఆగిపోయి ''అయ్యగారూ'' అంటూ బెదిరిపోయి వెనక్కి తిరిగి నేలమీద ఒరిగిపోయాడు.

శేఖర్ ఒక్క గంతులో సుబ్బయ్య దగ్గరికి వెళ్ళి అతని చేతిలోంచి టార్చి లాక్కుని ''ఏమిటి! లే! నిలుచో!'' ఆ వెలుగు మంచం మీద వేసి చూశాడు. కళ్ళు తిరిగిపోయాయి, రక్తం మాడుమీంచి మెడవరకూ కారి గడ్డ కట్టిపోయింది కనురెప్పలు తెరుచుకునే ఉన్నాయి. కళ్ళ చుట్టూ రక్తపు మరకలు: చూపులేదు ఆ కళ్ళలో. నోరు తెరుచుకుని ఉంది. కింది దవడ బాగా కిందకి జారి బిగుసుకుపోయింది. నాలిక బయటికి వెళ్ళకు వచ్చింది.

వెంటనే ఆ వికృత రూపం ఎవరిదో గుర్తుపట్టలేకపోయాడు శేఖర్. కాని ఏదో స్ఫురించి ''మామయ్య!'' అన్నాడు.

''అవును'' అన్నాడు సుబయ్య తేరుకుని.

''మామయ్యా!'' పిలిచాడు శేఖర్.

''ప్రాణం లేదండీ!'' సుబ్బయ్య నెమ్మదిగా చెప్పాడు.

శేఖర్ ఒంగి వైకుంఠరావు ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. ఊపిరి లేదు వెంటనే ఆందోళనతో, భయంతో భారతిని చూశాడు. కళ్ళు మూసుకుని పడుకుంది. రొమ్ము పైకి కిందకీ కదులుతోంది. అది చూడగానే శేఖర్‌కి ప్రాణం వచ్చినట్లయింది. కాలింగ్ బెల్ మీదవున్న భారతి చెయ్యి చూశాడు. నెమ్మదిగా ఆ చెయ్యి తీసి ఆమె రొమ్ము మీద పెట్టి ''భారతీ! భయంలేదు! లే!'' అన్నాడు ఆప్యాయంగా.

భారతి పలక లేదు!

''స్పృహ పోయింది సారే!'' చెప్పాడు సుబ్బయ్య.

శేఖర్ చటుక్కున వెనక్కి తిరిగి కూజాలో నీళ్ళు గ్లాసులో పోసి తీసుకొచ్చి భారతి మొహం మీద చల్లాడు.

భారతి పెదిమలు తడి చేసుకుంటోంది. కనురెప్పలు కదులుతున్నాయి. తల ఆడిస్తోంది. బరువుగా ఊపిరి పీలుస్తోంది.

"భారతీ! లే! భయంలేదు. నేను శేఖర్ని" అన్నాడు ఆమె తల నిమురుతూ. భారతి మొహం మీదనుంచి దృష్టి మరల్చలేదు. ఆమె పక్కన పడుకున్న ఆ వికృతాకారాన్ని చూసే ధైర్యంలేదు అతనికి.

క్షణం పాటు అయోమయంగా చూసింది భారతి. లేచి కూర్చోవడానికి ప్రయత్నించింది కాని కొయ్యబారిన శవం చేతులలోంచి కదలలేకపోయింది. పక్కకి మొహం తిప్పి శవాన్ని చూసి జరిగిందంతా జ్ఞాపకం వచ్చి వెర్రి కేకలు ప్రారంభించింది.

"సుబ్బయ్యా! ఇలారా! ఈ చేతులు లాగు.." అన్నాడు శేఖర్.

సుబ్బయ్య రాతి బొమ్మలా నిలబడ్డాడు. కళ్ళు పెద్దవి చేసి శేఖర్ని చూశాడు.

"ఏం కదలవేం!" అన్నాడు శేఖర్.

"అయ్యా! నేను.. నాకు భయం!" అని గొణిగాడు సుబ్బయ్య.

"అయితే వెళ్ళి మా బాబాయిని లేపు - త్వరగా వెళ్ళు!"

సుబ్బయ్య గదిలోంచి పరిగెత్తాడు.

"భారతీ భయమేమీలేదు శవం కొయ్యబారింది అంతే" అని ఆమెకి ధైర్యం చెప్పాడు శేఖర్.

భారతి సొమ్మసిల్లిపోయి దిండుమీద తలవాల్చి, కళ్ళు మూసుకుంది.

భారతి కేకలకి ఇంట్లో అందరూ లేచారు. కామరాజు భారతి గది తలుపులకి అవతల నిలబడ్డారు. ప్రసాద్ కూడా వచ్చాడు. గదిలోపలికి రావడానికి ఎవరూ సాహసించలేకపోయారు.

"ఎవరది? ఏం జరిగింది? నాన్న ఏడీ?" అడిగింది పద్మ.

"ప్రసాద్ పద్మని అవతలకి తీసుకెళ్ళు!" కేకేశాడు శేఖర్.

లింగమూర్తి, శేఖర్ తమ బలం అంతా ఉపయోగించి భారతిని ఆ శవం చేతుల్లోంచి విడిపించారు. వెంటనే భారతిని కామరాజు గదిలోకి తీసుకెళ్ళి, పడుకోమనీ, కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పాడు శేఖర్. భానుమతిని పిలిచి తోడుండమని చెప్పి భారతి గదిలోకి వెళ్ళాడు. అప్పటికి కామరాజు తేరుకుని "ఏమిటిది? ఏం జరిగింది?" అడిగాడు శేఖర్ని.

"ఏం జరిగిందో నాకూ తెలియదు" అని తనకి తెలిసిన విషయాలు తండ్రితో చెప్పాడు శేఖర్.

భానుమతి, దాసీది, పద్మ, భారతి పక్కగదిలో వున్నారు శవం వున్న గదిలో మొగాళ్ళు మాత్రం ఉన్నారు.

"టెలిఫోన్ పనిచెయ్యడంలేదు. కనుక తెల్లారిన తర్వాత ఎవరయినా వెళ్ళి పోలీసులకి రిపోర్ట్ చెయ్యాలి" అన్నాడు శేఖర్.

"పోలీసులు వచ్చి ఏం చేస్తారు?" అడిగాడు కామరాజు.

"సహజమైన చావు కాదు ఇది. మామయ్య హత్య చెయ్యబడ్డాడు. తెలియజేయవలసిన బాధ్యత ఉంది"

"పోలీసులకి తెలియజేయవచ్చు కాని వాళ్ళు వస్తే మాత్రం ప్రయోజనం ఏం ఉంటుంది! మామయ్య హత్య చెయ్యబడ్డాడని అంటున్నావు. ఎవరిచేత హత్య చెయ్యబడ్డాడు? హత్యచేయ్యబడిన మనిషి భారతి గదిలోకి ఎలా వచ్చాడు? భారతి మంచం మీద ఎలా పడుకున్నాడు? కొయ్య బారిన శవం భారతిని ఎలా కావలించుకుంది? ఇవన్నీ మనిషే చేశాడనో, చేయించాడనో అనుకోవడం ఎలా?" అడిగాడు ప్రసాద్.

శేఖర్ ప్రసాద్ని కోపంగా చూశాడు. "నువ్వు అడిగిన ప్రశ్నలన్నింటికి నేను సమాధానం చెప్పగల స్థితిలో లేను అంతమాత్రాన మనిషి చెయ్యలేదని అనుకోవలసిన అవసరంలేదు. నింపాదిగా విచారిస్తే మనిషే చేశాడని తేలుతుంది" అన్నాడు.

ఆ రాత్రంతా తెరిపిలేకుండా, ఆకాశానికి చిల్లుపడినట్లు కుంభవృష్టి కురిసింది. ఆ ఇంట్లో ఒక్కరూ కన్నుముయ్యలేదు. రాత్రంతా కామరాజు గదిలో అందరూ గుంపుగా కూర్చున్నారు. భారతి గదిలో ఆమె మంచం మీద శవం అలానే ఉంది. తలుపులు మూసేశారు. ఇంట్లో ఉన్న నౌకర్లు ముగ్గురూ కామరాజు గది బయట నేలమీద చతికిలబడ్డారు. తండ్రి పోయాడని పద్మకి చెప్పారు. భారతి పక్కన పడున్న మనిషి తన తండ్రేనని పద్మ నమ్మలేకపోయింది.

"ఏం చేశావు? నాన్నని ఏం చేశావు? చెప్పు!" అని అరిచింది పద్మ. భారతిని చూసి తన తండ్రిని భారతే చంపి ఉండాలన్న పద్మ మొండి వాదనకి అందరూ చికాకుపడ్డారు.

"అతను నీ గదిలోకి ఎలా వచ్చాడు? నీకేమైనా తెలుసా అమ్మా?" అడిగాడు కామరాజు భారతిని.

భారతి తల విదిలించింది. "నాకేం తెలియదు. రాత్రి ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది. నిద్రలేచాను. భారతీ అని ఎవరో పిలిచారు. లేచి వెళ్ళి తలుపు తీశాను. బయట చీకటిగా ఉంది. ఎవరూ లేరు. భయం వేసి తలుపు ముయ్యబోయాను. మూసుకోలేదు ఊపిరి ఆడనట్లు, తల తిరుగుతునట్లు అనిపించింది. స్పృహ పోతున్నట్లయింది అంతే, ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. మళ్ళీ నిద్ర మెలుకువ వచ్చి చూసేసరికి నా పక్కన -" అని ఆగిపోయింది భారతి.

అందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. అందరి మనసుల్లో అనేకమైన ప్రశ్నలు! ఎవరు సమాధానం చెప్పలేని ప్రశ్నలు!

"పద్మా! పొద్దున్న చెపితే విన్నావు కావు" అన్నాడు ప్రసాద్.

"ఏం చెప్పావు? అడిగాడు లింగమూర్తి కొడుకుని.

"ఈ ఇంట్లో దెయ్యం ఉందనీ. వెంటనే వెళ్ళిపొమ్మనీ చెప్పాను"

"పిచ్చి పిచ్చిగా మాట్లాడక" అన్నాడు శేఖర్.

## 24

**సూర్యుడు** కనిపించకుండానే తెల్లారింది, ఆరుగంటలు దాటిన తర్వాత మసక మసక వెలుగు వచ్చింది తెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది,

"అంతా నీళ్ళ మయం" అన్నాడు లింగమూర్తి కిటికీ లోంచి బయటకి చూసి, అందరూ కిటికీ దగ్గరికి పరిగెత్తారు. కనుచూపు మేరవరకూ నేల ఎక్కడా కనిపించడం లేదు. పెద్ద పెద్ద చెట్లు చాలా విరిగి పడిపోయాయి.

"చాలా పెద్ద తుఫాను" అన్నాడు కామరాజు.

"అందుకే ఎలక్ట్రిసిటీ పోయింది, టెలిఫోన్ తీగెలు కూడా తెగిపోయాయి" అన్నాడు శేఖర్.

తోటమాలి శేషయ్య, అతని కొడుకు మొద్దబ్బాయి, వాళ్ళున్న ఔట్ హౌస్‌లోంచి బయటికి వచ్చి వసారాలో నిలుచునుండడం చూశాడు శేఖర్. "డ్రయివర్ని పిలిపించి, కారులో పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు చెయ్యమనాలి." అన్నాడు తండ్రితో.

కామరాజు తల ఊపాడు బాధ్యత అంతా కొడుక్కి అప్పచెప్పినట్లు.

"శేషయ్యా! డ్రయివర్ ఇంకా లేవలేదా?" కేకేశాడు శేఖర్.

"చూడలేదండి" శేషయ్య అక్కణ్ణించే బదులు చెప్పాడు.

"వెళ్ళి నిద్రలేపు. డ్రైవర్ని పిలుచుకుని నువ్వూ, మొద్దబ్బాయీ రండి."

శేషయ్య తల ఊపి మొద్దబ్బాయితో డ్రైవర్ ఉండే ఇంట్లోకి వెళ్ళడం చూస్తూ నిలుచున్నాడు శేఖర్.

ఇరవయి నిమిషాల తర్వాత శేషయ్య, మొద్దబ్బాయి, రాజారాం, సావిత్రి బయటికి వచ్చారు. మోకాళ్ళ లోతు నీళ్ళల్లో నడుస్తూ రావడం చూసి మేడ మీదకి రమ్మని కేకేశాడు శేఖర్. వాళ్ళు మేడమీదకి రాగానే ఆదుర్దాగా రాజారాంని చూసి "ఏమైంది? మొహానికి గాయాలు ఏమిటి?" అడిగాడు.

"ఏమోనండి! నాకు తెలియదు రాత్రి పడుకున్నాను. తెల్లారి లేచేటప్పటికి మొహం మీద గాయాలున్నాయి. కదలకుండా మంచానికి తాళ్ళతో కట్టివేయబడ్డాను" అన్నాడు డ్రైవర్.

"అదేమిటి! చెవి చివర్న కోసేసి ఉంది. అంత పెద్ద గాయం అవుతుంటే మెలుకువ రాలేదూ!"

"లేదండి! నాకే కాదు సావిత్రికి కూడా మెలుకువ రాలేదు " అన్నాడు రాజారాం.

"నేను ఇతని ఇంట్లోకి వెళ్ళినప్పుడు ఇతనూ, ఈమె ఇద్దరూ మంచానికి తాళ్ళతో కట్టేసి ఉన్నారండి కట్లు విప్పి తీసుకొచ్చాను" అన్నాడు శేషయ్య.

"నా మాట వినండి దయచేసి, అందరం ఈ ఇంట్లోంచి వెళ్ళిపోదాం. ఈ ఇంట్లో ఏదో దుష్ట శక్తి ఉంది" అన్నాడు ప్రసాద్.

"అవును దుష్టశక్తి ఉందని నేను ఒప్పుకుంటాను! ఆ దుష్టశక్తి ఒక హత్య కూడా చేసింది. ఆ దుష్టశక్తిని పట్టుకుని శిక్షించవలసిన అవసరం చాలా ఉంది" అన్నాడు శేఖర్ గంభీరంగా.

"మానవాతీతమైన శక్తిని ఎలా పట్టుకుంటాము! శిక్షించడం ఎలా! అకారణంగా ఇంతమంది బలికావడం దేనికి? నా మాట వినండి" అన్నాడు ప్రసాద్ ఆవేశంతో.

"ఏమిటి ప్రసాద్! అలా పిచ్చిగా మాట్లాడుతున్నావు? నీకు మతిపోయింది ఒక మనిషి ఈ ఇంట్లో మరణించాడు. సహజమైన చావు కాదు. ఆ చావుకి కారణం ఏమిటో తెలుసుకోవాలి. పోలీసులు రావాలి. అంతవరకూ మనం ఇక్కణ్ణుంచి కదలకూడదు" అన్నాడు కామరాజు.

"సరే పోలీస్ రిపోర్టు ఇవ్వండి. పోలీసులు రాగానే ఇల్లు వాళ్ళకి అప్పజెప్పి పోదాం."

"పోలీసులు రాగానే వాళ్ళ అనుమతి తీసుకుని నువ్వు వెళ్ళవచ్చు" అన్నాడు శేఖర్ మండిపడుతూ.

"శేఖర్! అలా అనడం మర్యాదకాదు. ప్రసాద్ తన క్షేమం గురించే ఆలోచించడంలేదనీ, మన అందరి గురించీ క్షోభ పడుతున్నాడని గ్రహించలేవూ! ఆ భీకర రూపాన్ని మనం ఎవరూ చూడలేదు. అతను చూశాడు. అందుకే ఇంత ఆందోళన పడుతున్నాడు" అని కామరాజు ప్రసాద్ వైపు తిరిగి "పోలీసులు వచ్చేంతవరకూ మనం ఏం చెయ్యలేం. వాళ్ళు రానీ.... తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు.

కారు తీసుకుని వెంటనే బయలుదేరి వెళ్ళి పోలీస్‌లకి రిపోర్టు చేసి రమ్మనీ, అలాగే టెలిఫోన్ హౌస్‌కి వెళ్ళి ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంటుకి కూడా కంప్లయింటు ఇవ్వమని చెప్పాడు రాజారాంకి శేఖర్. రాజారాంకి తోడుగా మొద్దబ్బాయిని వెళ్ళమన్నాడు.

అరగంట తర్వాత కారు తిరిగి రావడం చూశాడు శేఖర్. ఆదుర్దాగా కిందకి దిగివెళ్ళి గుమ్మం దగ్గర వాళ్ళని కలుసుకుని "అప్పుడే ఎలా వచ్చేశారు?" అడిగాడు.

"వెళ్ళడానికి వీలులేదండీ! అంతా నీళ్ళ మయం. రెండు మైళ్ళ తర్వాత రోడ్డు అరఫర్లాంగు మేర కొట్టుకుపోయింది. ఆ నీటి ప్రవాహం చూస్తే తల తిరిగిపోయింది" అన్నాడు రాజారాం.

"ఇంకో తోవలేదా?" అడిగాడు శేఖర్.

"నాకు తెలియదండి, కొత్తగా వచ్చాను" అన్నాడు రాజారాం.

మేడమీదకి వెళ్ళి తండ్రితో ఆ విషయం చెప్పాడు శేఖర్.

"ఇక్కడ్నించి పట్నానికి వెళ్ళే రోడ్డు అది ఒకటే ఇంకో రోడ్డు లేదు" చెప్పాడు కామరాజు.

"పోనీ కాలి నడకన వెళితే?" అడిగాడు శేఖర్.

"వెళ్ళడానికి వీలుండదు. పాలార్ నది చెంగల్‌పట్ దగ్గర రెండు పాయలుగా చీలుతుంది. ఈ ప్రాంతానికి రెండు వేపుల నుంచీ ప్రవహిస్తుంది. ఓ మైలు దూరంలో మళ్ళీ కలుసుకుంటుంది. అంటే ఇది ఒక లంక లాంటిది."

"గుడ్ గాడ్!" అని శేఖర్ తన గదిలోకి పరుగెత్తి ట్రాన్సిస్టర్ రేడియో తీసుకు వచ్చాడు. "వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా నార్త్ఆర్కాటు జిల్లాలో కుంభవర్షం కురియడం వల్ల పాలార్, పెన్నార్ నదులు పొంగిపోయాయి. నిన్నటినుంచీ మద్రాస్ చెంగల్ పట్టు ప్రాంతాలకూడా వర్షం ప్రారంభమయింది. ఈ వర్షం ఇంకా నాలుగు రోజుల పాటు కురుస్తుంది. పాలార్ నదీ, పూండీ రెడ్ హిల్సు రిజర్వాయర్లు పొంగిపోయాయి. పల్లపు ప్రాంతాలకి తీవ్రమైన వరద దెబ్బ తగిలింది, రైళ్ళ రాకపోకలకు అవరోధం కలిగింది కొన్ని ప్రాంతాలు పూర్తిగా జలమయం అయి బయట ప్రపంచంతో సంబంధం లేకుండా పోయాయి" రేడియోలో చెప్పిన ఈ విషయం అందరూ శ్రద్ధగా విన్నారు. ఇప్పుడిక ఏం చెయ్యాలి అనే ప్రశ్న అందరి మొహంలోనూ కనిపిస్తుంది.

ప్రసాద్‌నీ, లింగమూర్తినీ తండ్రినీ తన గదిలోకి రమ్మని పిలిచాడు శేఖర్.

"ఈ శవాన్ని పెట్టుకుని ఎన్ని రోజులు పోలీసుల కోసం కాచుకుంటాము, కుళ్ళిపోవడం మొదలు పెడుతుంది, ఇంట్లో ఉండలేము!" అన్నాడు శేఖర్.

"పోలీసులు రాకుండా శవాన్ని దహనం చెయ్యడం నేరంకాదూ!" అడిగాడు కామరాజు.

"విపరీతమైన పరిస్థితిల్లో ఏం చేస్తాం! శవాన్ని దహనం చేసే ముందు ఈ ఇంట్లో అందరినించీ వాంగ్మూలాలు తీసుకుందాము, భారతి చేత శవాన్ని పరీక్ష చేయించి ఆ వివరాలు వ్రాసుకుందాం. అందరం సంతకాలు పెడదాము. ఆ రిపోర్టు పోలీసులకి ఇద్దాము" అన్నాడు కామరాజు.

"అయితే దహన క్రియలకి ఏర్పాటు చేయమంటాను" అని శేషయ్యా అని కేకేశాడు శేఖర్. శేషయ్య రాగానే చెప్పాడు.

"అయ్యగారూ! నేను సలహా చెపుతున్నందుకు క్షమించండి. మా ఊళ్ళో ఓసారి ఇలాగే జరిగింది. పోలీసులు రాకుండా శవాన్ని దహనం చేసినందుకు పోలీసులకి చాలా కోపం వచ్చింది కనక పోలీసులు వచ్చేంతవరకూ ఔట్ హౌస్‌లో పెడితే మంచిదని నా అభిప్రాయం" అన్నాడు శేషయ్య.

శేషయ్య ఇచ్చిన సలహా గురించి లింగమూర్తి కామరాజు కాసేపు చర్చించారు. చివరికి శేషయ్య సలహా పాటించడానికే అంగీకరించారు.

"శవాన్ని ఇక్కణ్ణించి కదిలేేముందు అందరి వాంగ్మూలాలు తీసుకోవాలి. అందర్నీ ఈ గదిలోకి రమ్మని చెప్పు!" అన్నాడు శేఖర్ శేషయ్యతో.

వైకుంఠరావు బతికి ఉండగా ఆఖరిసారి చూసింది పద్మ అని తేలింది. నిద్రపోవడానికి తన గదికి వెళుతూ తండ్రి గదిలోకి వెళ్ళానని చెప్పింది. మిగతా వాళ్ళందరూ తమకేమీ తెలియదని చెప్పారు. ఈ విషయాలన్నీ విపులంగా రాశాడు శేఖర్. తర్వాత అందరిచేతా సంతకాలు పెట్టించాడు.

"భారతీ! కష్టంగా ఉన్నా తప్పదు. శవాన్ని పరీక్ష చేయించడానికి నీ సహాయం కావాలి." అన్నాడు శేఖర్.

భారతి తల ఊపింది. శేషయ్యనీ, ముసలయ్యనీ పద్మనీ సాక్షులుగా రమ్మని పిలిచాడు. పద్మ రానన్నది. బలవంతం చెయ్యొద్దన్నాడు కామరాజు. శవాన్ని భారతి పరీక్ష చేసి "మాడు మీద గాయమైంది. రక్తం బాగా కారింది. కళ్ళు, నాలిక వెళ్ళుకు వచ్చాయి. మెడ ఉబ్బిపోయి ఉంది. నల్లగా గుర్తులున్నాయి. పొట్ట వరకు కొయ్యబారిపోయింది. కాళ్ళు ఇంకా పూర్తిగా కొయ్యబారిపోలేదు. అంటే ప్రాణం పోయి ఇంకా పన్నెండుగంటలు కాలేదు" అని చెప్పింది. శేఖర్ ఆ వివరాలన్నీ వ్రాసుకున్నాడు. భారతీ శేఖరూ, లింగమూర్తి కాక శేషయ్యనీ, ముసలయ్యని కూడా సంతకాలు పెట్టమన్నారు. తర్వాత శేషయ్య, ముసలయ్య కలిసి శవాన్ని శేషయ్య ఉండే ఔట్‌హౌస్‌లోకి తీసుకెళ్ళారు.

## 25

పద్మ తన గదిలోంచి కదలలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుంది. భారతి ఎంత ఓదార్చిన ప్రయోజనం లేకపోయింది. భోజనం చెయ్యలేదు. ఎంతో బతిమాలగా ఒక కప్పు కాఫీ తాగింది. శేషయ్య, మొద్దబ్బాయి, రాజారాం, సావిత్రి ఔట్ హౌస్‌లలోంచి వచ్చేసి యజమాని ఇంట్లోనే మకాం పెట్టారు, వంట ఇంటి అవతలవున్న గదులవాళ్ళకి ఇవ్వబడ్డాయి, వాన ఆగలేదు. చుట్టూ నీళ్ళు ఎక్కువ అవుతున్నాయే కాని తగ్గడం లేదు, శేఖర్ రేడియో పక్కనే కూర్చున్నాడు రోజంతా.

సాయంకాలం అయింది. చీకటి పడపోతోంది. చీకటి పడిన తర్వాత దారుణమైన సంఘటనలు ఏవీ జరగకుండా జాగ్రత్త పడడానికి శేఖర్ పధకం ఆలోచించసాగాడు.

"రాత్రంతా వంతుల మీద ఎవరో ఒకరు మెలుకువగా ఉండి ఇంట్లో గస్తీ కాయాలి " అన్నాడు శేఖర్.

కామరాజు నవ్వి "ఎవరుంటారు! అడిగి చూడు" అన్నాడు.

"పన్నెండు గంటలవరకూ నేనూ, శేషయ్యా మెలుకువగా ఉంటాం. ఆ తర్వాత మొద్దబ్బాయి" అన్నాడు శేఖర్. "నేను ఉంటాను మొద్దబ్బాయికి తోడుగా!" అన్నాడు ప్రసాద్. శేఖర్ ఆశ్చర్యంతో ప్రసాద్‌ని చూసి "నువ్వా! మళ్ళీ దడుచుకుంటావు" అన్నాడు విసుగ్గా.

"శేఖర్! నేను పిరికివాణ్ణి కాను. దయచేసి ఆ విషయం జ్ఞాపకం ఉంచుకో! ఈ ఇంట్లో దెయ్యం ఉందని ఎందుకన్నాను! నేను నా కళ్ళతో చూశాను కనక. నా బదులు నువ్వు చూసి నేను చెప్పినట్లే చెపితే నేనూ నమ్మేవాణ్ణికాను" అన్నాడు గంభీరంగా.

"ఆల్‌రైట్! దెయ్యం విషయం కనుక్కుందాం. నేను ఓపెన్ మైండ్‌తో ఉంటాను. శేషయ్య ఏడి? శేషయ్యా?" అని పిలిచాడు శేఖర్.

పలకలేదు మొద్దబ్బాయి వచ్చాడు "శేషయ్య ఏడి! అడిగాడు కామరాజు.

"తెలియదండీ. ఇంట్లో ఎక్కడో ఉండి ఉంటాడు."

"పిలు"

మొద్దబ్బాయి వెళ్ళిపోయాడు. శేఖర్ కిటికీ దగ్గిర నిలబడి ఆకాశం వైపూ, సముద్రం వైపూ, సముద్రంలాగా ఉన్న నీటి ప్రవాహం వైపూ చూస్తూ పదినిమిషాలు నిలబడి "శేషయ్య ఇంకా రాలేదా. ఏమయ్యాడు అంటూ ఆగిపోయాడు.

"ఏమిటి అలా చూస్తున్నావు?" అడిగాడు ప్రసాద్.

కిటికీ దగ్గరికి రమ్మని సంజ్ఞచేశాడు శేఖర్. చీకటిపడుతోంది. ఆకాశం మీద మబ్బులు దట్టంగా పరుచుకున్నాయి. వాన జోరుగా కురుస్తోంది. ఔట్ హౌస్ వైపు వేలు పెట్టిన ఔట్ హౌస్ తలుపు చూపించాడు శేఖర్. కొద్దిగా తెరిచి ఉన్నది. లోపల దీపం వెలుగుతోంది. తలుపు సందులోంచి ఎవరో లోపల కదులుతున్నట్టు కనిపిస్తోంది.

"మామయ్యని ఆ ఇంట్లోనేగా పెట్టారు?" అడిగాడు ప్రసాద్.

శేఖర్ తల ఊపాడు. దీపం కూడా కదులుతోంది ఆ ఇంట్లో.

"ఆ ఇంట్లోకి ఎవరో వెళ్ళారు" అన్నాడు శేఖర్.

"ఆ ఇంట్లో శవం తప్ప ఏముంది? ఎందుకు వెళతారు?"

"ఏమో! వెళ్ళి చూసి వస్తాను"

"ఒద్దు మనిషి అయితే బయటికి వస్తాడుగా! ఇక్కణ్ణించే చూద్దాం."

"చీకటి పడిన తర్వాత అత్తు బయటికి వస్తే ఎవరో మనకి ఎలా తెలుస్తుంది! క్షణంలో చూసి వస్తాను. నువ్వు ఇక్కడే ఉండు."

"శేఖర్! మూర్ఖంగా ప్రవర్తించక మనిషి అవునో కాదో తెలియకుండా వెళ్ళడం ధైర్యం అనిపించుకోదు, అవివేకం అవుతుంది."

"ఏమిట్రా మీ ఇద్దరూ వాదించుకుంటున్నారు!" అడిగాడు అప్పుడే ఆ గదిలోకి వచ్చిన కామరాజు.

ప్రసాద్ చెప్పి "శేఖర్ వెళ్ళి చూస్తానంటున్నాడు. ఒద్దని చెపితే వినడంలేదు" అన్నాడు.

"వెళ్ళవద్దు శేఖర్! ఈ కిటికీ వద్దే నిలుచుని చూద్దాం" అన్నాడు కామరాజు.

శేఖర్ నవ్వి "నువ్వు కూడా దెయ్యం అని భయపడుతున్నావా! అదుగో ఎవరో లోపల్నించి వస్తున్నారు. సరిగా చూద్దాం." అని టార్చి వెలిగించి కాంతి బౌట్ హౌస్ వైపు వేశాడు.

బౌట్ హౌస్ లోంచి నెమ్మదిగా బయటకి వస్తున్న శేషయ్యని చూసి నిర్ఘాంతపోయారు ముగ్గురూ.

"శేషయ్య! శేషయ్య అక్కడ ఏం చేస్తున్నాడు" అన్నాడు కామరాజు.

"రానీ, అడుగుదాం."

శేషయ్య! శేషయ్య అక్కడ ఏం చేస్తున్నాడు" అన్నాడు కామరాజు.

"రానీ, అడుగుదాం."

శేషయ్య గొడుగు మూసి ఇంటి మెట్లు ఎక్కుతుండగా శేఖర్ కేకేశాడు.

"వస్తున్నానండీ" అని శేషయ్య మేడమీదకి వచ్చాడు.

"ఆ బౌట్ హౌస్‌లో ఏం చేస్తున్నావు?" అడిగాడు శేఖర్.

"దీపం వెలిగించి వచ్చానండీ. శవాన్ని అలా చీకట్లో ఉంచకూడదంటారు పెద్దలు."

ఎన్నో అనుమానాలు కలిగాయి. ఎంతో కోపం వచ్చింది శేఖర్‌కి. కాని శేషయ్యని ఏమీ అనలేకపోయాడు.

## 26

"పద్మా! లే! భోజనానికి లే! అని పిలిచింది భారతి.

ఎర్రగా జేవురించి ఉన్నాయి పద్మ కళ్ళు. తల దువ్వుకోలేదు. చీర నలిగిపోయివుంది. ఏడ్చి ఏడ్చి కళ్ళల్లోని నీళ్ళు అయిపోయాయి. "నాకు వద్దు నేను రాను" అన్నది.

"చిన్నపిల్ల మల్లే ప్రవర్తిస్తావేమీటి! రావమ్మా అందరం ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్ళమే!" అంటూ పద్మ తల నిమురింది భారతి.

"నాకు ఆకలి వేయటం లేదు."

"అట్లాగే అనిపిస్తుంది. సయించినంతే తిను. రా! అని పద్మ చెయ్యిపట్టుకుని లాగింది భారతి.

ఇద్దరూ నడవాలోకి వెళ్ళారు. ఇంట్లో మూడే లాంతర్లున్నాయి. బాటరీ అయిపోతుందేమోనని టార్చి లైటు పొదుపుగా వాడుకుంటున్నారు.

హాల్లో వున్న లాంతరు వెలుగు నడవాలో కొద్దిగా పడుతోంది. పద్మగదికి అయిదడుగుల దూరంలో ఎవరో నిలుచున్నట్లనిపించి భయంతో, ఆశ్చర్యంతో ఆ ఇద్దరు యువతులూ అటు చూశారు.

"నాన్నా!" అని పద్మ రెండడుగులు ముందుకి వేసింది. మసక చీకట్లో గోడకి ఆనుకుని నిలబడ్డ ఆకారం అవతల వైపు నడిచి చీకట్లోకి వెళ్ళిపోయింది.

"నాన్న! నాన్న బతికేవున్నాడు!" అని అరిచింది పద్మ.

"ఉష్! పద్మా! ఊరుకో" అంటూ భారతి భయంతో పద్మని గట్టిగా కావలించుకుంది.

"నన్ను ఒదులు - నాన్న - బతికేవున్నాడు" మరింత దగ్గరగా అరిచింది పద్మ.

అప్పుడే భోజనాల గదిలోకి వెళ్ళబోతున్న శేఖర్, ప్రసాద్ పరిగెత్తుకుంటూ వాళ్ళదగ్గిరికి వెళ్ళారు.

"ఏమిటి పద్మా! అలా అరుస్తున్నావు. ఈ చీకట్లో నిలబడ్డారేం రండి" అన్నాడు శేఖర్.

"శేఖర్! నాన్న బతికే ఉన్నాడు" అని నవ్వడం ప్రారంభించింది పద్మ.

"పాపం! షాక్ వల్ల హిస్టీరియా వచ్చింది లోపలికి తీసుకువెళ్ళు భారతీ!" అన్నాడు ప్రసాద్.

"చెప్పు భారతీ! నువ్వు చెపితే నమ్ముతారు. నాన్న బతికేవున్నాడని చెప్పు. నువ్వూ చూశావుగా!" అరిచింది పద్మ.

నలుగురూ పద్మ గదిలోకి వెళ్ళారు. శేఖర్ కూజాలోంచి చల్లని నీళ్ళు తీసి పద్మ మొహం మీద చల్లుతున్నాడు.

"హిస్టీరియా కాదు. నిజంగానే మేము వైకుంఠరావు గారిని చూశాము" అన్నది భారతి.

శేఖర్, ప్రసాద్‌ని భారతిని పరీక్షగా చూశారు.

"ఏమంటున్నావు భారతీ! నీకు కూడా– " అన్నాడు శేఖర్.

"లేదండీ! నాకు మతిపోలేదు. భ్రమకాదు. గోడకి ఆనుకుని నిలుచున్నారు. మసక వెలుగే అయినా గుర్తు పట్టడం కష్టం కాలేదు. వైకుంఠరావుగారే! పద్మ రెండడుగులు వేసిందో లేదో ఆయన చీకట్లోకి పరిగెత్తారు. నేను చూశాను."

"వాట్ నాన్‌సెన్స్ ఈజ్ దిస్, భారతీ! శవాన్ని నువు చూశావు. రిగర్ మార్టిన్ అంటే ఏమిటో తెలుసు. శవం కొయ్యబారిపోయింది. మనం ఏదో పొరబాటు చేశామనీ, మామయ్య బ్రతికే ఉంటే పద్మ పిలవగానే ఎందుకు అలా పారిపోతాడు" అన్నాడు శేఖర్.

"మిస్టర్ శేఖర్! నా కళ్ళతో చూసిన విషయం చెప్పాను. మా ఇద్దరిలో ఏ ఒక్కరమో చూసి ఉంటే భ్రమ అనుకోవచ్చు. ఇద్దరం చూశాము" అన్నది భారతి.

శేఖర్ ప్రసాద్ వైపు తిరిగి "ఫాంటాస్టిక్‌గా ఉంది. చచ్చిపోయిన మనిషి కొయ్యబారిపోయిన శవం బతికి రావడం ఏమిటి?" అన్నాడు.

"శేఖర్! వీళ్ళిద్దరూ చూసింది చూడలేదని మనం ఎలా కాదనగలం! ఔట్ హౌస్‌లోకి వెళ్ళి శవం ఇంకా అక్కడ ఉందో లేదో చూడటం మంచిది, పద" అన్నాడు ప్రసాద్.

"ముందు వీళ్ళిద్దర్ని భోజనాల గదిలోకి తీసుకు వెళ్ళి తర్వాత మనం వెడదాం" అన్నాడు శేఖర్.

అప్పటికి అందరూ భోజనాల గదిలోకి చేరుకున్నారు కామరాజు కూడా కిందకి వచ్చాడు.

"మేము ఇప్పుడే వస్తాం" అన్నాడు శేఖర్.

"ఎక్కడికి?"

"క్షణంలో వస్తాం" అని కేకేసి శేఖరూ, ప్రసాదూ గొడుగులు వేసుకుని బయలుదేరారు. వాన జోరుగా కురుస్తోంది. టార్చి లైట్లు వెలిగించుకుని, మోకాళ్ళ లోతు నీళ్ళల్లో కాళ్ళీడ్చుకుంటూ నడిచారు.

ఔట్ హౌస్ తలుపు మూసి ఉంది. కిటికీలోంచి వెలుగు బయట వున్న నీళ్ళల్లో పడి ప్రతిబింబిస్తోంది. శేఖర్ తలుపు బయట గడియ తీశాడు. తలుపు దగ్గరే ఆగి ఇద్దరూ లోపలికి తొంగి చూశారు, మంచం, మంచం పక్కన బల్ల, బల్ల మీద బుడ్డిదీపం కనిపించాయి. మంచం ఖాళీగా ఉంది.

"నేలమీద పడుకోబెట్టారేమో!" అన్నాడు ప్రసాద్.

శేఖర్ టార్చి వెలుగు నేలమీద వేసి చూశాడు. నేల మీద శవం లేదు.

"ఈ గదిలోనే శవాన్ని పెట్టారా?" అడిగాడు ప్రసాద్.

"ఈ గదిలోనే అయ్యుండాలి. అయినా చూద్దాం" అని లోపల అడుగుపెట్టాడు శేఖర్. ఆ గదికాక ఓ చిన్న వంట గది, నీళ్ళ గది మాత్రం ఉన్నాయి ఆ ఔట్ హౌస్‌లో. శవం అక్కడలేదు. మంచం దగ్గర ఆగి ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. మానవాతీతమైన శక్తులేవో ఈ ఇంటి ప్రాంతాల్లో ఉన్నాయని అప్పుడు మొదటిసారిగా శేఖర్‌కి అనుమానం కలిగింది.

"ఏమంటావ్?" అడిగాడు శేఖర్.

ప్రసాద్ భుజాలు చరిచి "శవం లేదు. చచ్చిపోయిన మనిషి ఇంట్లో తిరగటం భారతీ, పద్మా చూశారు, ఈ రెండు విషయాలు యదార్థాలు. వీటికి ఏమిటి అర్థం?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

శేషయ్య ఈ గదిలోకి వచ్చి ఏం చేశాడంటావు నిజంగా దీపం వెలిగించడానికే వచ్చాడంటావా?"

"ఎందుకు వచ్చి ఉంటాడు? శవాన్ని దొంగిలించడానికా! దొంగిలించినా దానంతట అది నడిచి వెళ్ళేటట్లు చెయ్యలేడుగా !"

"నా తల తిరిగిపోతోంది, ఈ వాన ఆగితే బావుండును పద పోదాం." అన్నాడు శేఖర్. ఇద్దరూ ఔట్ హౌస్‌లోంచి బయటకి వెళ్ళారు. మళ్ళీ నీళ్ళల్లోకి దిగి కాళ్ళీడ్చుకుంటూ నడవడం ప్రారంభించారు. హాలు తలుపులు తెరిచేవున్నాయి మధ్య బల్లమీద లాంతరు వెలుగుతోంది. దూరాన్నించి హాలు అంతా కనిపిస్తోంది ఇద్దరికీ.

"ఎవరో హాల్లో సోఫాలో కూర్చున్నారు కదూ!" అన్నాడు ప్రసాద్.

"అవును. భోజనానికి వెళ్ళకుండా హాల్లో ఒంటిగా కూర్చున్నదెవరో!" అన్నాడు ప్రసాద్ బిగ్గరగా.

ఎక్కణ్ణించో పకపక నవ్వు వినిపించింది - దగ్గర్నించీ కాదు. దూరాన్నించీ కాదు. శేఖర్ నీళ్ళల్లో అక్కడే ఆగిపోయి చుట్టూ చీకట్లోకి చూశాడు.నిమిషం తర్వాత "ఇదంతా ఏదో మోసం. నేను నమ్మను" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

"ఏమిటి మోసం? ఏమిటి నమ్మవు?" అడిగాడు ప్రసాద్.

"నాకు దెయ్యాలలో నమ్మకం లేదు. చచ్చిపోయిన వాళ్ళు దెయ్యాలయి వస్తారని అంతకన్నా నమ్మను. ఇందులో ఏదో కిటుకున్నది. పద, ఇల్లంతా వెతుకుదాం." అన్నాడు శేఖర్ మెట్లు ఎక్కి హాల్లోకి వెళ్ళగానే. ప్రసాద్ మాట్లాడకుండా సోఫా దగ్గరకి వెళ్ళి లాంతరు తీసుకుని సోఫా మీద పరీక్షగా చూశాడు.

"అదుగో! ఎవరో కూర్చున్నట్లు సోఫా పరుపు మీద గుంట పడింది. దెయ్యం కూర్చుంటే బరువుండదంటారుగా!" అన్నాడు శేఖర్.

"దెయ్యానికి బరువున్నదో లేదో, కాళ్ళు నేలమీద ఆనతాయో లేదో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా మామయ్య ఈ సోఫాలో కూర్చున్నాడు. కూర్చున్నవాడల్లా లేచి చీకట్లోకి వెళ్ళిపోయి అదృశ్యమైనాడు అంతే" అన్నాడు ప్రసాద్.

"శేషయ్యా! ఆ ఔట్‌హస్ లోకి వెళ్ళి నువ్వేం చేశావు? నిజం చెప్పు!" అడిగాడూ శేఖర్ కోపంగా.

"చెప్పాను కదండీ! దీపం వెలిగించి వచ్చాను."

"శవాన్ని ఎక్కడ పెట్టారు?"

"మంచం మీద"

"దీపం వెలిగించడానికి వెళ్ళినపుడు శవం మంచం మీద ఉందా?"

"అదేమీటండీ. శవం అక్కడ లేకుండా ఏమవుతుంది?"

"అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పు!"

"ఉందండీ!"

"శవం దానంతట అది నడిచిపోలేదని నువ్వు ఒప్పుకుంటావా!"

శేషయ్య తలూపాడు. అప్పుడే భోజనం ముగించి రాజు, లింగమూర్తి హాల్లోకి వచ్చారు.

"శవం ఇప్పుడు ఔట్‌హౌస్‌లో లేకపోవడానికి కారణం చెప్పగలవా?" అడిగాడు శేఖర్. శేషయ్య ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిటీ! శవం ఔట్ హౌస్‌లో లేదా? ఏమైంది? " అడిగాడు కామరాజు. శేఖర్ జరిగింది తండ్రికి చెప్పాడు.

"పద్మ భారతి కాక నువ్వూ ప్రసాద్ కూడా చూశారన్నమాట" అన్నాడు కామరాజు.

శేఖర్ తలవూపాడు.

"ఇంకెవరైనా ఆ విషయం చెప్పివుంటే భ్రమో, లేక మతి చెడిందో అనుకునేవాణ్ణి. మెట్లమీద ఏదో భీకర ఆకారం చూశానని ప్రసాద్ చెపితే నమ్మలేదు. కాని ఇప్పుడు నలుగురు ప్రత్యక్ష సాక్షులున్నారు. ఈ ఇంట్లో ఏదో దుష్టశక్తి ఉండి వుండాలి. వీలయినంత త్వరలో మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోవడం మంచిది" అన్నాడు కామరాజు.

"నాన్నా నువ్వు కూడా అలా మాట్లాడతావేం! దెయ్యాలేమీటి! నేను నమ్మను"

"అయితే నీ కళ్ళతో చూసిన దాన్ని కూడా నువ్వు నమ్మవా?"

"ఏదో కిటుకు ఉండి ఉంటుంది?"

"ఆ కిటుకేమిటో తెలిసేంతవరకూ మనం ఈ ఇంట్లో ఉండడం మంచిదికాదు. అకారణంగా మనందరి ప్రాణాలకి అపాయం తెచ్చుకోవడం ధైర్యం అనిపించుకోదు" అన్నాడు కామరాజు.

"అవును శేఖర్" అన్నాడు ప్రసాద్.

శేఖర్ నవ్వాడు "చావు తప్పితే చాలంటారు. సరే అందరూ వెళ్ళండి, నేను మాత్రం ఈ విషయం ఏమిటో అంతుతేలేవరకూ రాను" అన్నాడు.

"ఈ వాన వరదలు తగ్గేంతవరకూ ఎవరూ వెళ్ళడానికి ఎలాగూ వీలులేదుగా! ఇంకా ఎన్ని రోజులు మనం ఈ ఇంట్లో ఉండవలసి వస్తుందో తెలియదు కనక ముందు మనం ఆలోచించవలసిన విషయం ఎవరికీ ఏ అపాయం కలగకుండా కట్టుదిట్టం చేయడం అనేది."

నౌకర్లతో సహా అందరూ హాల్లోకి వచ్చేశారు. అందరితోపాటు పద్మ కూడా వచ్చి వాళ్ళ మధ్య నిలబడింది.

"నాన్న పోలేదు బతికే ఉన్నాడు. నాకు కనిపించాడు. నాన్నని ఏం చేశారో చెప్పండి! నాన్నమీద ఎందుకు మీరంతా ఇలా పగపట్టారు?" అని అడిగింది పద్మ.

''పద్మా! నేచెబుతున్న విషయం శ్రద్ధగా విను. నాన్న మరణించాడు. అందులో సందేహం లేదు. నేను నీతో అబద్ధం చెప్పను కాని నువ్వు మీ నాన్నని చూశావన్న విషయం నేనూ నమ్ముతున్నాను'' అన్నాడు ప్రసాద్.

''నువ్వూ చూశావా? ఎక్కడ? ఎక్కడున్నాడు? ఎప్పుడు చూశావు?'' అడిగింది పద్మ ఆత్రంగా.

''ఇంతకుముందే! ఇక్కడ సోఫాలో కూర్చుని చదువుకుంటున్నాడు. నేనూ, శేఖర్ ఇద్దరం చూశాం.'

''అయితే ఎందుకు వెళ్ళిపోనిచ్చారు? ఎక్కడికి వెళ్ళాడు?''

''మేము హాల్లోకి రాకముందే ఆ నడవలోకి వెళ్ళిపోయాడు. శ్రద్ధగా విను.. చచ్చిపోయిన మనిషి ఇంట్లో తిరగడం సాధ్యమా! మనతో మాట్లాడడం సంభవమా! కాదు -'' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా ''ప్రసాద్! ఆగు! భయంతో ప్రాణాలు పోయేట్లు విపులంగా చెప్పడం దేనికి!'' అన్నది భానుమతి.

తల్లి అలా అనగానే ప్రసాద్ చెప్పడం ఆపేశాడు.

''మామయ్య చావుకి కారణం ఏమిటో, భారతి గదిలోకి ఎలా వచ్చాడో తెలుసుకోలేక పోతున్నాము. ఈ ఇంట్లో దెయ్యమో, దెయ్యాలో ఉన్నాయని కొందరి అభిప్రాయం. నాకు దెయ్యాలలో నమ్మకం లేదు. ఎవరో మనిషే ఈ చేష్టలన్నీ చేస్తున్నాడని నా అనుమానం. దెయ్యమైనా మనిషి అయినా మనం జాగ్రత్త పడాలి. ఎవరికీ అపాయం కలగకుండా చూడాలి, ఈ వానా, వరదా ఇంకా ఎన్నిరోజులుంటుందో తెలీదు. మనం తీసుకోవలసిన జాగ్రత్తలు: మొదటిది ఎవరూ ఒంటిగా ఇంట్లో ఉండొద్దు. రెండు ఆడవాళ్ళకి ఎవరో ఒక మగాడు ఎప్పుడూ తోడు ఉండాలి. ఏదైనా అసహజమైనది చూస్తే వెంటనే నాకు తెలియచెయ్యాలి'' అన్నాడు శేఖర్. అందరూ తలలు ఊపారు.

''ఇక నౌకర్ల విషయం - ఈ హెచ్చరికలన్నీ మీకూ వర్తిస్తాయి.'' అని శేఖర్ అంటుండగా

''అదేమిటి?'' అన్నది పద్మ.

''ఏమిటి?'' అడిగాడు ప్రసాద్ ఆదుర్దాగా.

పద్మ చెయ్యి చాచింది. చేతిమీద ఎర్రగా కనిపించింది అందరికీ.

''ఏమైనా గీసుకుందా?'' అడిగాడు ప్రసాద్.

''లేదు ఏదో పడింది చేతిమీద'' అని తుడిచేసింది పద్మ చేతిమీద గాయం లేదు.

''నా మెడమీద ఏదో పడ్డది'' అన్నది భారతి.

''పురుగయ్యుంటుంది'' అన్నాడు లింగమూర్తి.

''నేను చూస్తాను'' అని భారతి మెడ పరీక్షగా చూసి వేలితో మెడమీద ఎర్రగా ఉన్న చోట రాసి ''రక్తం'' అన్నాడు శేఖర్.

''నా మీద కూడా ఏదో పడ్డది'' అని కేకేసింది భానుమతి చెయ్యి జాపుతూ. ఆమె చేతి మీద ఎర్రని రక్తపు చుక్క ఉన్నది.

''ఈ రక్తం చుక్కలేమిటి?'' అన్నాడు కామరాజు.

''నా మీద కూడా పడ్డది'' అని కేకేసింది సావిత్రి.

''అందరి మీద చినుకుల్లా రక్తపుబొట్లు పడుతున్నాయి'' అన్నాడు ప్రసాద్.

శేఖర్ లాంతర్ పైకెత్తి పట్టుకుని కప్పు చూశాడు. బాగా ఎత్తుగా ఉండడం వల్ల ఏమీ కనిపించలేదు. వెలుగు అంత పైకి పోవడం లేదు. ''టార్చి కావాలి. తెస్తానుండడి'' అని లాంతర్ బల్లమీద పెట్టాడు.

''ఒంటిగా వెళ్ళొద్దు'' అన్నది భారతి.

''అవును శేఖర్ శేషయ్యనీ, మునయ్యనీ తోడు తీసుకువెళ్ళు'' అన్నాడు లింగమూర్తి.

"ఛా ఛ నాకు తోడేమిటి!" అన్నాడు శేఖర్.

"ఇప్పుడు నువ్వేగా ఎవరూ ఎక్కడికీ ఒంటిగా వెళ్ళకూడదని చెప్పావు. శేషయ్యా! అబ్బాయి కూడా వెళ్ళు!" కామరాజు ఆజ్ఞాపించాడు.

శేఖర్ తన గదిలోకి వెళ్ళి నిమిషంలో టార్చి తీసుకుని తిరిగి వచ్చాడు. అందరూ తలలు పైకెత్తి చూశారు. ఎర్రని మరక - చుక్కలు చుక్కలుగా రక్తం పైనుంచి కిందపడుతోంది. ఒక్కసారిగా ఆ మరక కిందనుంచి పక్కకి జరిగారు అందరూ.

"గుడ్ గాడ్! ఎంత రక్తమో!" అన్నాడు ప్రసాద్.

"అందరూ ఇక్కడే ఉన్నారా?" అడిగాడు శేఖర్.

"ఆఁ!"

అందరినీ పేర్లు పెట్టి పిలిచాడు శేఖర్. అందరూ పలికారు.

"అమ్మయ్య! మనలో ఎవరయినా ఇక్కడ లేరేమోనని ఆందోళన పడ్డాను. మేడమీదకి వెళ్ళి చూస్తాను" అన్నాడు శేఖర్.

"ఒద్దు, వెళ్ళవద్దు" అన్నది భారతి శేఖర్‌కి దగ్గిరగా జరిగి.

"చదువుకున్న దానివి నువ్వే ఇలా కంగారు పడతావేమిటి భారతీ! ఎవరో ఒకళ్ళు వెళ్ళి చూడాలి కదా!"

"ఒద్దు - ఏమీ చూడవద్దు మనం అందరం ఇక్కడే ఈ గదిలోనే ఉందాం. వరదలు తగ్గగానే వెళ్ళిపోదాం." అన్నది భారతి ఆవేదనతో.

"అవును. భారతి చెప్పింది బావుంది. అనవసరంగా ప్రాణానికి తెగించడం దేనికి!" అన్నాడు లింగమూర్తి.

"ఈ రక్తం ఎక్కణ్నించి వచ్చిందనే రహస్యం తెలుసుకోవద్దూ" అడిగాడు శేఖర్ చికాకుతో.

"ఏం తెలుస్తుంది? ఇంతకు ముందు జరిగిన వాటిని గురించి ఏం తెలిసింది? ఇదీ అంతే తెలుస్తుంది. ఈ ప్రపంచంలో అన్నీ మనకి తెలిసిన విషయాలు మనం తెలుసుకోగల విషయాలే కావు. తెలియని విషయాలు చాలా ఉన్నాయి. వాటిలో ఇదొకటి. శేఖర్! నువ్వు కాని, మరెవరు కాని సాహసం చెయ్యడం అవివేకం, చావు తప్పితే చాలనుకుని ఇక్కణ్ణించి బయటపడదాం" అన్నది భానుమతి.

"వరదలు తగ్గగానే అందరూ ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవచ్చు. కాని ఆలోగా ఈ ఇంట్లో ఏం జరుగుతున్నదీ, ఎందుకు జరుగుతున్నదీ తెలుసుకోవలసిన బాధ్యత ఉంది మనమీద" అని శేఖర్ మెట్లవైపు నడిచాడు.

"ఆగు శేఖర్! నేనూ వస్తున్నాను" కేకేశాడు ప్రసాద్.

"నో! ఏదయినా అపాయం ఉంటే ఆ అపాయంలోకి నిన్ను తీసుకు వెళ్ళడం న్యాయం కాదు" మెట్ల దగ్గిర ఆగి అన్నాడు శేఖర్.

"నువ్వు వెళ్ళడం మాత్రం న్యాయమా! మీ నాన్నకి నువ్వు ఒక్కడివేగా!" ప్రసాద్ జవాబు చెప్పాడు.

"శేఖర్! మేడమీదకి వెళ్ళి చూడాలని నిశ్చయించుకుంటే వెళ్ళు." నేను అభ్యంతరం పెట్టను. కాని నీ కూడా ఇంకో ఇద్దర్ని తీసుకెళ్ళు." అన్నాడు కామరాజు.

"నేనూ, మొద్దబ్బాయి వెళతాం సారే!" అన్నాడు శేషయ్య మెట్ల దగ్గరకి వెళుతూ.

"ఊఁ!" అని ప్రోత్సహించాడు కామరాజు. ముగ్గురూ మెట్లు ఎక్కుతున్నారు. ఎవరూ మాట్లాడడం లేదు.

మేడమీద వాళ్ళు ఏం చూస్తారో అన్న ఆలోచనతో హాల్లో కూర్చున్న వాళ్ళు వణకడం ప్రారంభించారు, టపటపమంటూ రక్తపు చుక్కలు నేలమీద పడుతూనే ఉన్నాయి. బయట పడుతున్న వాన చినుకుల చప్పుడులోంచి, మెట్లమీద అడుగుల చప్పుళ్ళల్లోంచి బిగ్గరగా వినపడుతున్నాయి ఆ టపటపలు.

ముందు శేఖరూ, అతని వెనకే శేషయ్యా, శేషయ్య వెనక మొద్దబ్బాయి ముగ్గురూ మెట్లు ఎక్కారు. మెట్లు ఎక్కి వసారాలో ఆగి "అవతల నడవలో అయివుంటుంది. కింద హాలుకి సరిగా పైనున్నది నడవా!" అన్నాడు శేఖర్.

శేషయ్య తల ఊపాడు.

ముగ్గురూ ముందుకి నడిచారు. నడవలో వెలుగు కనిపించింది. ఆ నడవలోకి వెలుగు ఎలా వచ్చిందో గ్రహింపలేక పోయారు. శేఖర్ ఆగిపోయి " ఆ నడవలో దీపం వెలుగుతోంది" అన్నాడు శేషయ్యతో. శేషయ తల ఊపి "ఆ టార్చి ఇవ్వండి" అని శేఖర్ చేతిలోంచి టార్చి తీసుకుని ముందుకి నడిచాడు. అతని వెనక మొద్దబ్బాయి, శేఖర్ వెళ్ళారు. నడవలోకి వెళ్ళి ముగ్గురూ ఆగిపోయారు.

"గుడ్ గాడ్! ఎంత భీకర దృశ్యం!" అన్నాడు శేఖర్.

శేషయ్య మాట్లాడకుండా ముందుకి నడిచాడు. మొద్దబ్బాయి, శేఖర్ రాతి బొమ్మల్లా నిలబడ్డారు. నడవా మధ్య ఓ కుర్చీ ఉంది. కుర్చీ చేతిమీద ఒక కొవ్వొత్తి వెలుగుతోంది. వెలుగుతున్న కొవ్వొత్తి గోడమీద విచిత్రమైన నీడలు వెదజల్లుతోంది.

కాని అది కాదు భీకరం. కుర్చీలో కూర్చున్న మనిషి. ఆ మనిషి రెండు చేతులు కుర్చీ చేతుల మీద నుంచి కిందకి వెళ్ళాడుతున్నాయి. ఆ చేతుల కొనలనుంచీ రక్తం కారుతుంది. నేలమీద ఎర్రని మడుగు తయారైంది. అక్కడ కప్పు బీటపడడం వల్ల రక్తం చుక్కలు చుక్కలుగా కింద హాల్లో పడుతోంది.

కుర్చీలో కూర్చున్న ఆ మనిషి ఎవరో గుర్తుపట్టడం సులభం కాదు. వెళ్ళుకు వచ్చిన కళ్ళు తప్ప ఇంకేమీ స్పష్టంగా కనిపించడంలేదు. ఒంటిమీద చర్మం పూర్తిగా ఒలిచేసినట్లు ఒళ్ళంతా ఎర్రగా ఉంది. ఉబ్బిపోయిన మెడ వెళ్ళుకు వచ్చిన నాలిక మాత్రం కనిపిస్తున్నాయి. గాలికి కొవ్వొత్తి వెలుగు రెపరెపలాడుతోంది. ఆ రెప రెపలకి వెలుగునీడలు నాట్యం చేస్తున్నాయి. అందుకే కుర్చీలో కూర్చున్న మనిషి నవ్వుతున్నట్లు, కోపంగా చూస్తున్నట్లు, మాట్లాడుతున్నట్లు, కదులుతున్నట్లు కనిపిస్తోంది. అందుకే శేఖర్, మొద్దబ్బాయి ముందుకి అడుగు వెయ్యలేక పోయారు.

శేషయ్య మాత్రం కుర్చీలో ఉన్న శవాన్ని సమీపించాడు. వేలితో శవం ఒంటిమీద ఎర్రగా వున్న చోట రాశాడు ఏదో జిగటుగా అతుక్కుంది. దీపం వెలుగులో వేలు పరీక్షగా చూశాడు. తర్వాత మోకాళ్ళ మీదకి ఒంగి నేలని పరీక్షగా చూసి లేచి "ఈయన మీ మామయ్య వైకుంఠరావుగారు" అన్నాడు.

"మామయ్య ఇక్కడికి ఎలా వచ్చాడు?" అన్నాడు శేఖర్.

"తనంతట తను రాలేదనే నా నమ్మకం. ఎవరో ఎత్తుకు వచ్చి కుర్చీలో కూర్చోపెట్టి ఉండాలి.

"శవాన్ని ఎవరు ఎత్తుకు వస్తారు?"

"ఏమో! ఏదో కారణం ఉంటుంది."

శేఖర్ మొహం పాలిపోయింది. నుదురుమీద చమట పోసింది. "ఈ ఇంట్లో దెయ్యం ఉందని నాకూ నమ్మకం కుదురుతోంది. లేకపోతే శవాన్ని ఆ ఔట్‌హౌస్‌లోంచి తీసుకువచ్చి ఈ కుర్చీలో ఎవరు కూర్చోపెడతారు? ఈ రక్తం ఏమిటి?" అన్నాడు.

"ఇది రక్తం కాదనుకుంటాను" శేషయ్య చెప్పాడు.

"మరేమిటి?"

"ఏమిటో తెలియదు. రక్తం కాదు దాదాపు ఇరవై నాలు గంటల క్రితం చనిపోయిన మనిషిలో రక్తం ఇలా ఉండదు"

"దెయ్యాలేమిటి? అంటోంది నా వివేకం. కాని ఈ దృశ్యాలన్నీ చూస్తుంటే దెయ్యాలు ఉన్నాయేమో అనిపిస్తోంది శేషయ్యా! నువ్వేమంటావు?"

శేషయ్య లేచి నిలుచుని కుర్చీలో ఉన్న శవాన్ని కాసేపు పరీక్షగా చూసి, "దెయ్యాలున్నాయో లేవో నాకు తెలియదు. కానీ ఈ కుర్చీలోకి ఈ శవాన్ని తెచ్చి కూర్చోపెట్టింది దెయ్యం కాదు, మనిషే" అన్నాడు.

"ఆ విషయం ఎలా చెప్పగలుగుతున్నావు?" అడిగాడు శేఖర్. శేషయ్య కుర్చీకి ఒక అడుగు దూరంలో నేల చూపించి టార్చి వెలుగు నేలమీద వేశాడు.

ఎర్రటి అడుగుజాడ కనిపించింది. శేషయ్య టార్చి వెలుగు నేలమీద ముందుకు వేశాడు. ఒకవైపున వరసగా ఎర్రని అడుగుజాడలు తలుపు వరకూ కనిపించాయి.

శేఖరూ, మొద్దబ్బాయి గదిలోకి వెళ్ళారు. ఆ అడుగుజాడలు పరీక్షగా చూసి "ఇది ఎడమపాదం అడుగుజాడ, ఓ అడుగుజాడకీ, ఇంకో అడుగుజాడకీ ఎంత దూరం వుందో చూడు శేషయ్యా! ఒక పాదం జాడలే ఇవి. రెండో పాదం జాడలు లేవు" అన్నాడు ఆందోళనతో.

"అవును. ఒక పాదం జాడలే."

"మనిషి అయితే ఇంకో పాదం ఏదీ? ఒక్క కాలుతో ఎలా నడవగలిగాడు !"

"రెండో పాదానికి రక్తం అంటలేదేమో! అందుకే జాడలు కనిపించలేదేమోనండీ!"

"ఈ రక్తపు జాడని బట్టి ఈ పని చేసింది మనిషేనని ఎలా చెప్పగలవు? ఒక పాదం జాడే ఉండడం బట్టి దెయ్యం కావచ్చనిపిస్తోంది." అన్నాడు శేఖర్.

"దెయ్యాలకి పాదాలుంటాయో ఉండవో, ఉన్నా నేల మీద ఆనతాయో, ఆనవో నాకు తెలియదు. కాని ఈ శవాన్ని ఈ గదిలోకి తీసుకువచ్చింది మనిషేనని నా అభిప్రాయం, ఇది చూడండి!" అన్నాడు శేషయ్య.

శేఖర్ శేషయ్య చూపించిన చోటచూపి "ఏముంది ఇక్కడ? నాకేమీ కనిపించడంలేదే!" అన్నాడు

"ఆ ఎర్రని మడుగు అంచున మసి అనిపిస్తున్నది కదండీ"

"అవును."

"ఈ శవాన్ని ఈ కుర్చీలో ఇక్కడ కూర్చోపెట్టి నేలమీద ఈ రక్తపు మడుగు తయారు చేసిన తర్వాత ఈ మసి పడింది. ఈ మసి తరహా, రంగు బట్టి సిగిరెట్ మసికానీ అయివుండాలని తేలుతోంది."

"అయితే?" అడిగాడూ శేఖర్.

"ఈ శవాన్ని కుర్చీలో కూర్చోపెట్టిన తర్వాత ఈ కుర్చీదగ్గర నిలబడి ఎవరో సిగిరెట్టో వెలిగించారు. ఈ శవాన్ని ఇక్కడికి తీసుకు వచ్చిన మనిషే అయ్యుండాలి. ఇంకెవరన్నా అయితే శవం ఇక్కడ వునన్ విషయం మీకు చెప్పేవాడనుకుంటాను" అన్నాడు శేషయ్య

శేఖర్ నవ్వి "నీ వాదన బాగానే ఉంది. కాని దెయ్యాలు సిగిరెట్ తాగుతాయో, తాగవో నాకు తెలియదు మామయ్య సిగిరెట్ తాగేవాడు" అన్నాడు.

"మనం ఈ గదిలో నిలబడి చెయ్యగలిగిందేమీ లేదు. ఏమయ్యామా అని కిందవున్న వాళ్ళు కంగారు పడుతుంటారు" అన్నాడు శేషయ్య.

"పోదాం పద. ఈ శవాన్ని ఏం చేద్దాం!"

"ఇక్కడే ఉండనివ్వండి."

"మరి పడుకోవడం?"

"అందరూ కింద పడుకుంటే సరి."

## 27

"పద్మా!"

"ఏమిటి?"

"ఈ వరదలు తగ్గిపోగానే అందరం ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నాము. నువ్వు ఏం చెయ్యదలుచుకున్నావు?" అడిగాడు ప్రసాద్ పక్కన కూర్చుంటూ.

"అంటే?"

"నువ్వు ఎక్కడ ఉండదలచుకున్నావు? నీ భవిష్యత్తు గురించి ఆలోచించావా?"

"ఆలోచించలేదు. ఆలోచించేందుకు ఏముంది?"

"నీకు శేఖర్ అంటే ఇష్టమా!"

పద్మ జవాబు చెప్పలేదు.

"అతని కళ్ళన్నీ ఆ భారతి మీద ఉన్నాయి. నీ సంగతి పట్టించుకునే స్థితిలో లేడు"

"గమనించాను"

"అతని మీద ఆశ పెట్టుకుంటే బాధపడతావు."

పద్మ నవ్వి "ఏం సలహా! మరి నువ్వెందుకు నా మీద ఆశ పెట్టుకున్నావు?" అడిగింది.

"అందుకే చెపుతున్నాను."

"ఏం చెపుతున్నావు?"

"మామయ్య నాకు ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. ఇక్కణ్ణించి మద్రాసుకి వెళ్ళగానే ఏర్పాటు చేస్తానన్నాడు."

"మంచిదే"

"నాతో నీ జీవితం పంచుకోమని మళ్ళీ అడుగుతున్నాను."

"ప్రసాద్! అలా అడగడానికి ఇదా సమయం?"

"నువ్వు చాలా దిగులుగా ఉన్నావని తెలుసు. మీ నాన్న పోవడం వల్ల నీకు దిక్కుతోచక ముందు గతేమని బెంగ పెట్టుకున్నావేమోనని ఈ విషయం ఇప్పుడు ప్రస్తావించాను. క్షమించు."

పద్మ చిన్నగా నవ్వి "ప్రసాద్ నువ్వు ఎంత మంచివాడివోయ్!" అంటూ అతని తల తన ఒళ్ళోకి లాక్కుంది.

"భారతీ!"

"ఏమిటి?"

"ఇలా ఒంటరిగా ఇక్కడ నిలబడ్డావేం. ఎవరు ఒంటిగా ఉండకూడదని చెప్పలేదూ!"

"చెప్పారు. అవతల గదిలో అంతా ఉన్నారుగా అరిస్తే వస్తారు. భయం ఏం ఉన్నది?"

"ప్లీజ్! ఇలాంటి మొండిపనులు చెయ్యక, మన శత్రువు బలం మనకి తెలియదు. జాగ్రత్త అవసరం నీకేదయినా అపాయం కలిగితే నేను - "

"మీరు?"

"తర్వాత ఎలా బతుకుతాను భారతీ! టెన్నిస్ కోర్టు దగ్గర నేను దురుసుగా ప్రవర్తించినందుకు క్షమించు. నీమీద చులకన భావం వల్ల కాదు నీమీద ఇష్టం అలా చేయించింది.

"మీకెవరిమీద ఇష్టం కలిగినా అలా ప్రవర్తిస్తారు ఇష్టాన్ని ఆ విధంగా ప్రదర్శించడం విదేశాలలో నేర్చుకున్నారేమో?"

"ప్లీజ్! అలా హేళన చెయ్యక. ఇంతకు పూర్వం నాకు ఎవరిమీదా అలాంటి ఇష్టం కలగలేదు భారతీ! నిన్ను చూసిన మరుక్షణం నుంచీ నా జీవితానికి ఓ అర్థం, ఓ సార్థకతా ఉన్నట్లు అనిపించింది."

"నేను ఒంటిదాన్ని కాను"

శేఖర్ ఒక అడుగు వెనక్కి వేసి "క్షమించు నాకు తెలియదు. పొరపాటు చేశాను" అని వెనక్కి తిరిగాడు.

"శేఖర్"

"ఏమిటి?"

"నేను ఒంటిదాన్ని కానంటే నాకు తల్లీ, తమ్ముడు ఉన్నారనీ, వాళ్ళని పోషించవలసిన భారం నాది అనీ" నవ్వింది భారతి.

శేఖర్ కూడా నవ్వాడు. "ఓ క్షణం నా గుండె ఆగిపోయింది. నీ వాళ్ళని పోషించే బాధ్యత నాకు ఉండదా భారతీ? నన్ను పెళ్ళిచేసుకుంటావా?"

"మీ నాన్నగారు -"

"నాన్న ఒప్పుకుంటాడు."

## 28

కామరాజు, లింగమూర్తి, ప్రసాద్, శేఖర్, పద్మా, భానుమతి, భారతి హాల్లో పడుకున్నారు. హాలు పక్కనున్న ఇంకో గదిలో శేషయ్య, మొద్దబ్బాయి, రాజారాం, సావిత్రి, మునయ్య వంటమనిషి దాసీది పడుకున్నారు. రెండు గదుల్లోనూ ఒకొక్క లాంతరు వెలుగుతున్నది.

కిటికీల తలుపులు అన్నీ మూసేసి ఉన్నాయి. బయట వాన గాలిహోరుమంటోంది క్రితం రాత్రి కూడా నిద్రలేకపోవడం వల్ల పడుకోగానే శేఖర్‌కి తప్ప అందరికి నిద్రపట్టింది. శేఖర్ ఒక్కడే దిండు గోడకి ఆనించి జారిగిలబడి సిగరెట్ తాగుతున్నాడు.

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. సిగరెట్ నేలమీద నలిపి, ఆవులించి, ఒళ్ళు విరుచుకుని పడుకుందామని అనుకుంటుండగా పైన మెట్లమీద ఏదో చప్పుడయినట్లు వినిపించింది. మెట్లు హాల్లోకి లేవుగాని హాల్లోంచి మెట్లు కనిపిస్తున్నాయి. లాంతరు ఇవతల వైపు ఉండడంవల్ల మెట్లు దగ్గిర వెలుగులేదు. గాలికి ఏ తలుపో కొట్టుకుని ఉంటుందని అనుకుని శేఖర్ దిండు సర్దుకుంటున్నాడు. ఎవరో మెట్లు ఎక్కుతున్నట్లు వినిపించింది తలెత్తి చూశాడు. అస్పష్టంగా మెట్లపైన ఓ ఆకారం కనిపించింది. శేఖర్ లేచి కూర్చున్నాడు. కళ్ళు చిట్లించి చీకట్లోకి చూశాడు. ఆ ఆకారం అక్కడే ఆగిపోయింది. కదలడంలేదు. శేఖర్ టార్చి తీశాడు. టార్చి అద్దం మెట్లవైపు పెట్టి చటుక్కున వెలిగించాడు. వలయాకారంలో టార్చి వెలుగు మెట్లమీద పడ్డది. మరుక్షణం శేఖర్ చెయ్యి ఒణికి టార్చి జారి కిందపడ్డది.

కుర్చీలో కూర్చున్న శవం - వైకుంఠరావు శవం - ఎర్రని చేతులు, ఎర్రగా రక్తమయమైన వేళ్ళు, మెట్లమీద నిలబడి ఉన్నది. అంత ధైర్యస్తుడయిన శేఖర్‌కి భయంవేసి చేతులు ఒణికాయి. ఓ నిమిషంలో తేరుకుని టార్చి మళ్ళీ వెలిగించి మెట్లమీద వేశాడు. ఆ ఆకారం అక్కడ లేదు. కిందికే దిగి వచ్చిందో, వెనక్కి వెళ్ళిపోయిందో తెలియలేదు. వెళ్ళి చూసే ధైర్యం శేఖర్‌కి కూడా లేదు.

"శేషయ్యా!" కేకేశాడు శేఖర్.

"పిలిచావా?" అంటూ ప్రసాద్ నిద్రలేచాడు.

"శేషయ్యని పిలిచాను."

"ఎందుకు?"

శేఖర్ ప్రసాద్‌కి చెప్పాడు.

"రా వెళ్ళి చూద్దాం" అన్నాడు ప్రసాద్.

"నీకు భయంగా లేదూ" అడిగాడూ శేఖర్.

ప్రసాద్ నవ్వాడు " ఆ విషయం దేనికి? వెళదాం పద!" అన్నాడు

ఇద్దరూ మెట్లు దగ్గరికి వెళ్ళారు శేషయ్య లేచి వచ్చి "పిలిచారా?" అడిగాడు.

శేఖర్ శేషయ్యకి చెప్పాడు. శేషయ్య శేఖర్ చేతిలో టార్చి తీసుకుని ముందుకి నడిచాడు. టార్చి వెలుగు మెట్ల మీద వేసి మెట్లు పరీక్షగా చూస్తూ మెట్లు ఎక్కాడు. ఆఖరి రెండు మెట్ల మీద ఎర్రని అడుగుజాడలు కనిపించాయి.

"అయితే కిందకి దిగి వెళ్ళలేదు" అన్నాడు శేఖర్.

శేషయ్య మాట్లాడలేదు. ముగ్గురూ శవం ఉన్న నడవలోకి వెళ్ళారు శవం కుర్చీలోనే ఉన్నది. అంతకుముందు ఎట్లా కూర్చుని ఉందో అట్లాగే ఉంది.

శేఖర్ శవాన్ని పరీక్షగా చూస్తూ తలుపు దగ్గిరే నిలుచున్నాడు. "శేఖర్ గారూ! ఈ శవాన్నే మెట్లమీద చూశానని నిశ్చయంగా చెప్పగలరా?" అడిగాడూ శేషయ్య.

"టార్చి వెలిగించాను. ఆ వెలుగులో చూశాను. నా కళ్ళు నేనే నమ్మలేకుండా ఉన్నాను. శవం నడిచి రావడం ఏమిటి? మళ్ళీ నడిచి వచ్చి కుర్చీలో కూర్చోవడమేమిటి?" అన్నాడు శేఖర్.

శేషయ్య శవాన్ని పరీక్షగా చూస్తున్నాడు. అంతలో కిందనుంచి కెవ్వుమని కేక వినపడింది. చెవులు చిల్లులుపడే కేక. ఇంటికప్పు ఎగిరిపోయేటంత పొలికేక - గుండెలాగిపోయేటంత భయంకరమైన కేక.

ముగ్గురూ కిందకి పరిగెత్తారు.

********

శేఖర్ శేషయ్యని పిలిచిన పిలుపుకి భారతి నిద్రనుంచి లేచింది. తను పడుకుందాం అనుకుంటుండగా ప్రసాద్ లేవడం వాళ్ళ సంభాషణ విన్నది. ఇద్దరూ లేచి వెళ్ళడం చూస్తూ పడుకున్నది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తర్వాత ఆమెకి భయం ఎక్కువై నెమ్మదిగా భానుమతి పక్క మీదకి దొర్లి ఆమెని తట్టి లేపింది.

"ఏమిటి?" అడిగింది భానుమతి.

"నాకు భయం వేస్తోంది" అన్నది భారతి.

"నీ పక్క ఇలా దగ్గరికి జరుపుకో!" అన్నది భానుమతి.

అంతలో మెట్ల దగ్గర ఏదో చప్పుడయింది. ఇద్దరు స్త్రీలూ అటు చూశారు.

"ఏమిటా చప్పుడు?" అడిగింది భానుమతి.

"శేఖర్ గారు, మీ అబ్బాయి అయ్యుంటారు. మేడ మీదకి వెళ్ళారు. "

"ఎందుకు? ఆ శవం ఉన్న చోటికి ఎందుకు వెళ్ళారు?"

"ఏదో చప్పుడయేటప్పటికి చూడడానికి వెళ్ళారు" భారతి అంటుండగా లాంతర్ మీద ఏదో పడినట్లు ఖంగుమన్నది. ఇద్దరూ ఉలిక్కిపడి చూశారు. లాంతర్ పక్కకి పడిపోయింది. చిమ్నీ పగిలిపోయింది. వత్తి నేలకి తగిలింది. ఆరిపోతూ సన్నగా వెలుగుతోంది.

"లాంతర్ కింద పడింది" అన్నది భారతి.

"అవును తీస్తానుండు" అని భానుమతి లేచి రెండడుగులు వేసి ఆగిపోయి తలుపు వేపు చూస్తూ నిలబడ్డది. భారతిని పిలవబోయింది కాని పిలవలేకపోయింది.

భారతి లేచి భానుమతి దగ్గరికి వెళ్ళింది. భానుమతి నోటమాట లేదు. కనుగుడ్లు పెద్దవి చేసి చూస్తోంది. చీకట్లోకి భారతి కూడా అటు చూసింది తన కళ్ళు తను నమ్మలేక, చూడలేక, చూడకుండా ఉండలేక రాతి బొమ్మలా నిలబడ్డది.

మెట్ల పక్కనున్న గోడని ఆనుకుని నిలుచున్నది ఓ ఆకారం ఇకిలిస్తున్నట్లు పళ్ళు బయటికి కనపడుతున్నాయి. ఒళ్ళంతా ఎర్రగా ఉంది. రక్తం - రక్తంతో పూర్తిగా తడిసిపోయిన ఒళ్ళు. చేతుల వేళ్ళ కొనలనుంచి రక్తం కారుతోంది. నేలమీద ఎర్రగా మడుగు కట్టింది. భారతి కేకలు పెట్టి అందర్నీ లేపాలనుకుంది కాని గొంతు పెగలలేదు. ఆ రూపం కళ్ళు సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఆమెను మంత్రముగ్ధురాల్ని చేసేస్తున్నాయి.

అంతలో ఎవరో అవతల గదిలో కదులుతున్నట్లు అలికిడి అయింది. గోడమీద పెద్ద నీడ - కప్పువరకూ పడుతున్న నీడ - కనిపించింది. ఆ నీడనీ, ఆ నీడలో కలిసిపోయిన ఆ ఆకారాన్ని చూస్తూ నిలబడిపోయారు వాళ్ళిద్దరూ. పక్కగదిలోంచి ఎవరో లేచివస్తున్నట్లు అడుగుల చప్పుడు - వినీవినపడని చప్పుడు ఆ మనిషి నీడే అది. అవతల గదిలో ఉన్న లాంతర్‌కి అడ్డంగా రావడంవల్ల ఆ మనిషి నీడ మీద పడుతోంది.

వెనక్కి వెళ్ళి గోడకి అతుక్కున్నట్లు నిలబడింది మెట్ల పక్కన వున్న ఆకారం. అవతల గదిలోంచి వచ్చిన మనిషి మెట్లదగ్గరికి వచ్చాడు.

అతను మొద్దబ్బాయి, భారతినీ, భానుమతినీ చూశాడు. వాళ్ళూ అతన్ని చూశారు. మాట్లాడవద్దన్నట్లు నోటిమీద వేలు పెట్టుకుని సంజ్ఞ చేసి, మెట్లపక్కకి ఒక్క అడుగు వేశాడు.

మెట్ల పక్కనున్న ఆకారం మెరుపులా కదిలింది - రెండు చేతులూ పైకెత్తి ఒక్క గంతేసింది, బిగించిన పిడికళ్ళతో మొద్దబ్బాయి తలమీద బాదింది. మొద్దబ్బాయి నేలమీద పడిపోయాడు. ఆ ఆకారం భానుమతీ, భారతీ నిలుచున్న వైపు వచ్చింది.

ఇద్దరూ ఒక్కసారిగా చెవులు చిల్లులు పడేటట్లు అరిచారు. ప్రాణాలు పోతున్నట్లు కేకలు పెట్టారు. గొంతులు చించుకుని బొబ్బలు పెట్టారు. వెనక్కి తిరిగి పరిగెత్తారు. కొంచెం దూరం పరిగెత్తి ఇద్దరూ కింద పడిపోయారు.

29

శేషయ్య, ప్రసాద్, శేఖర్ త్వర త్వరగా మెట్లు దిగి, తిన్నగా హాల్లోకి వెళ్ళారు. కిందపడిపోయిన లాంతర్‌ని ఎత్తి పెట్టాడు ప్రసాద్. శేషయ్య టార్చి వెలుగులో హాలంతా పరీక్షగా చూశాడు. ఒకళ్ళని ఒకళ్ళు గట్టిగా పట్టుకుని గజ గజ ఒణుకుతూ నేలమీద పడున్న ఆ ఇద్దరు స్త్రీలని చూసి దగ్గరకు వెళ్ళి "లెండమ్మా! లెండి! భయంలేదు, మేమంతా మెలుకువగానే ఉన్నాము, శేఖర్‌గారు, ప్రసాద్ గారూ కూడా ఇక్కడే వున్నారు" అన్నాడు శేషయ్య.

భయం వల్ల మొహాలకి చేతులు అడ్డం పెట్టుకున్న, ఆ ఇద్దరూ వేళ్ళ సందుల్లోంచి చూశారు. శేషయ్యని చూడగానే పోయిన ప్రాణం వచ్చినట్లయింది. లేచి కూర్చున్నారు.

"ఏమమ్మా! ఎందుకు అరిచారు?" అడిగాడు శేషయ్య.

"మొద్దబ్బాయి - మొద్దబ్బాయిని దెయ్యం చంపేసింది" అన్నది భానుమతి.

"మొద్దబ్బాయినా!? ఎక్కడున్నాడు? మీరెప్పుడు చూశారు?" ఆందోళనతో అడిగాడు శేషయ్య.

"ఆ మెట్లపక్కన" అని భానుమతి అంటుండగానే శేషయ్య పరిగెత్తాడు.

మెట్లపక్కన గోడదగ్గర నేలమీద పడున్నాడు మొద్దబ్బాయి. అతని ప్రక్కన ఎర్రని రక్తపు మరకలు కనిపించాయి. శేషయ్య మోకాళ్ళ మీదకి వొంగి మెద్దబ్బాయి గుండె మీద చెయ్యి పెట్టి చూసి సంతోషంతో నిట్టూర్చాడు. మొద్దబ్బాయి గుండె కొట్టుకుంటోంది. ఊపిరి పీలుస్తున్నాడు.

"అమ్మయ్యా! ప్రాణానికి మోసం లేదు" అన్నాడు శేషయ్య పక్కనే నిలుచున్న ప్రసాద్‌తో.

"ఆ రక్తం ఏమిటి? గాయం తగిలిందా?"

"చూడాలి" అంటూ శేషయ్య మొద్దబ్బాయిని పరీక్ష చేసి "గాయం తగలలేదు. స్పృహ పోయింది అంతే. చల్లని నీళ్ళు తీసుకురండి" అన్నాడు.

మొహం మీద నీళ్ళు చల్లిన కాసేపటికి కళ్ళు తెరిచాడు మొద్దబ్బాయి. జరిగినదంతా భారతి శేషయ్యకి చెప్పింది. అప్పటికి తతిమ్మా వాళ్ళందరూ నిద్రలేచారు. ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు. అంతవరకూ దెయ్యమని నమ్మని వాళ్ళందరూ దెయ్యమేనని రూఢీ చేసుకున్నారు. అందరి కళ్ళూ భయంతో, ఆదుర్దాతో చూస్తున్నాయి.

"నేనొక మాట చెపుతాను. అందరూ జాగ్రత్తగా వినండి." అన్నాడు కామరాజు. ఇంటి పెద్ద ఆ మాట అనగానే అందరూ ఆయనవేపు తిరిగారు,

"ఇంట్లో ఉన్న వాళ్ళంతా ఈ క్షణం నుంచీ కట్టకట్టుకుని ఒకేచోట ఉండాలి. ఎవరూ ఒంటిగా ఎక్కడికీ వెళ్ళకూడదు. దెయ్యమో, దెయ్యం లాంటిదేదో కనిపిస్తే అదేమిటో తెలుసుకునేందుకు వెళ్ళకూడదు. వెళ్ళవలసిన అవసరం లేదు. ఈ ఇంట్లో దెయ్యం ఉందో లేదో తెలుసు కోవడం మనవల్లకాదు. అంత సాహసించవలసిన అవసరం లేదు. వరద తగ్గితే చావు తప్పితే చాలునని అందరం ఈ ఇంట్లోనుంచి వెళ్ళిపోదాం. కుర్రవాళ్ళూ ధైర్యస్తులూ అయిన శేఖర్, ప్రసాద్‌లకి ముఖ్యంగా చెపుతున్నాను. ఎక్కడ ఏ చప్పుడయినా మీ ఇద్దరిలో ఎవరికి ఆపద కలిగినా తర్వాత మా గతేం కాను!? కనుక అవివేకంగా ప్రవర్తించవద్దు, భయంకరమైన స్వరూపాలు కాని, భయంకరమైన సంఘటనలు కాని జరిగితే భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కూర్చుందాము" అన్నాడు కామరాజు.

కామరాజులో ధైర్యం పూర్తిగా నశించిందని అందరికీ అర్థమైంది. చావు తప్పితే చాలు - అదొక్కటే అందరి ఆదుర్దా.

"నిద్రపోలేదూ?" మృదువుగా, లాలనగా వినిపించాయి ఆ మాటలు.

ఉలిక్కిపడి పక్కకి చూశాడు శేఖర్.

"నేనే -" అన్నది భారతి చిరునవ్వుతో.

శేఖర్ కూడా నవ్వి "చీమ చిటుక్కుమంటే ఒళ్ళు జలదరిస్తోంది. అలా తయారయింది ఈ ఇల్లు. నీకూ నిద్రపట్టలేదా?" అడిగాడు.

"లేదు, కళ్ళు మూసుకుంటే రక్తమయమైన వైకుంఠరావుగారి శవం కళ్ళముందు కట్టినట్లు కనిపిస్తోంది. కళ్ళు తెరిచి గోడవైపు చూస్తూ కూర్చోవడం నయంగా ఉంది"

"అవును మొగాళ్ళం మాకే ఇలా ఉంటే ఇక మీ విషయం చెప్పాలా!" అంటూ భారతి చెయ్యి తన చేతిలోకి తీసుకుని "ఈ ఇంట్లో ఉంటే చావు తప్పదు అని అందరికీ భయం పట్టుకుంది. ఎంత త్వరగా వెళ్ళిపోదామా అనే అందరి ఆలోచనా. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఈ వరద తగ్గితే వెళ్ళిపోవచ్చు."

"అవును వెళ్ళిపోవచ్చు. నా దగ్గర్నించి ఉత్తరం రాలేదని మా అమ్మ చాలా ఖంగారు పడుతూ ఉంటుంది."

"భారతీ నేను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పలేదు నువ్వు"

"ఏమడిగారు?"

"నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అడిగాను కదూ?"

"చెప్పానుగా."

"చెప్పలేదు, మా నాన్న ఒప్పుకోరన్నావు."

"అవును, మీ నాన్న ఒప్పుకుంటే నేను ఒప్పుకుంటాననేగా దాని అర్థం."

శేఖర్ భారతి భుజం మీద చెయ్యివేసి ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. ఆ హాల్లో పడుకున్న వాళ్ళల్లో ఇంకెవరయినా మెలుకువగా ఉండి చూస్తున్నారేమోనని విషయం జ్ఞాపకం రాలేదు.

"భారతీ! నేను విదేశాలకి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి నువ్వు కనిపిస్తావని తెలిసివుంటే ఇంకా ఎంతో త్వరగా వచ్చేవాణ్ణి. నా మాట నమ్ముతావా!"

"ఏమిటి?" అడిగింది భారతి అమాయకంగా.

"నిన్ను చూసిన తర్వాత నాలో కొత్త జీవం పోసినట్లయింది. ఇన్నాళ్ళూ బతకడం నిన్ను చూడడానికేననీ, నీ కోసమే నేను పుట్టాననీ, నీ కళ్ళల్లోకి చూడడం కోసమే నాకు కళ్ళున్నాయనీ, నిన్ను స్పృశించడానికే నాకు చేతులున్నాయనీ, నీతో మాట్లాడడానికే నాకు నోరున్నదనీ, అనిపిస్తోంది."

భారతి నవ్వుతూ "చాలు! చాలు! మీరిలా ఆవేశంతో ఉపన్యాసం ప్రారంభిస్తే అందరూ లేస్తారు" అని అతని నోటికి చెయ్యి అడ్డుపెట్టింది. ఆమె అరిచేతిని శేఖర్ పెదిమలతో స్పృశించాడు.

"ఏమిటీ అల్లరి?" అంటూ భారతి చెయ్యి తీసేసుకుంది.

సరిగ్గా ఆ సమయానికి ఎక్కణ్ణించో ధన్ ధన్ మన్న శబ్దం వినిపించింది.

"ఎక్కడా చప్పుడు?" అడిగింది భారతి.

"మేడమీదలా ఉంది" అన్నాడు శేఖర్,

మళ్ళీ ధన్ ధన్ మని చప్పుడయింది. భారతి శేఖర్‌కి ఇంకొంచెం దగ్గరగా జరిగి "నాకు భయం వేస్తోంది." అన్నది అతని చెవిలో.

"నేనున్నానుగా! నా దగ్గిరేవున్నావుగా. ఎందుకు భయం?" అంటూ ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరికి లాక్కున్నాడు.

ధన్ ధన్ మని త్వర త్వరగా చప్పుళ్ళు వినపడుతున్నాయి. దేన్నో కొడుతున్నట్లు, ఇల్లు అదురుతున్నట్లు ఉన్నది. "ప్రసాద్!" పద్మ కేకేసింది.

"ఏమిటి పద్మా?"

"ఆ చప్పుడు, భయం వేస్తోంది."

"గాలికి కిటికీలు కొట్టుకుంటున్నాయేమో! భయం ఎందుకు?"

పద్మ లేచి ప్రసాద్ దగ్గరికి వెళ్ళి "నేనిక్కడ కూర్చుంటాను. నాకు భయం వేస్తోంది" అన్నది.

"రా! ఇలా పక్క మీద కూర్చో! పిచ్చి పిల్లా.. మేమంతా ఇక్కడే ఉన్నాంగా! భయం ఎందుకు?" అని అతను పద్మ చేతిని తన చేతిలోకి తీసుకుని "నేనున్నానుగా.. నిద్రపో!" అన్నాడు.

ధన్ ధన్ మంటూ చప్పుడు వినిపిస్తూనే ఉంది.

"తలమీద ఎవరో కొడుతున్నట్లు చప్పుడవుతుంటే నిద్ర ఎలా వస్తుంది?" అడిగింది పద్మ.

"ఏ కిటికీ తలుపో అయివుంటుంది. వెళ్ళి మూసేసి వస్తే సరి."

"అమ్మయ్యో! ఒద్దు నువ్వు ఇక్కణ్ణించి కదలడానికి వీల్లేదు. మామయ్య ఇందాక ఏం చెప్పాడు!? ఎవర్నీ సాహసం చెయ్యవద్దని చెప్పలేదూ!" అన్నది పద్మ అతని చెయ్యి గట్టిగా పట్టుకుని.

"నిజమే కాని ఇలా చప్పుడవుతుంటే నిద్ర ఎలా పడుతుంది?" అన్నాడు ప్రసాద్.

అంతలో కామరాజు లేచి లాంతర్ ఒత్తి పెద్దది చేసి "ఏమ్రా మీరెవరూ నిద్రపోలేదూ?" అడిగాడు.

"అలా చప్పుడవుతుంటే ఎలా నిద్ర పడుతుంది మామయ్యా?" అన్నది పద్మ.

"అవును. అందుకే నాకూ నిద్రరాలేదు."

"ఏమిటో ఆ చప్పుడు?" అన్నాడు శేఖర్.

"నువ్వూ మెలుకువగానే ఉన్నావా?" అంటూ కామరాజు కొడుకువైపు తిరిగాడు. భారతి శేఖర్‌కి దూరంగా జరిగింది.

"భారతి కూడా నిద్రపోలేదు. ఆ చప్పుడు వింటూ కూర్చున్నాం" అన్నాడు శేఖర్.

"బహుశా ఏ తలుపో గాలికి కొట్టుకుంటూ ఉంటుంది." అన్నాడు లింగమూర్తి.

"అయుండవచ్చు కాని ఎవరూ ఈ గదిలోంచి వెళ్ళకండి" అన్నది భానుమతి.

ప్రసాద్ నవ్వాడు.

"ఎందుకురా నవ్వు?"

"సామాన్యంగా ఇంట్లో ఎక్కడ ఏ చప్పుడయినా, "ఏమండీ ఏదో చప్పుడవుతోంది వెళ్ళి చూడండి" అని నాన్నని వేపుకు తినేదానివి ఎవర్నీ కదలవద్దంటే నవ్వు వచ్చింది."

"సామాన్యంగా ఇంట్లో అయే చప్పుళ్ళు వేరు, ఈ చప్పుళ్ళు వేరు. మన ఇంట్లో ఎన్నడయినా శవం నడిచి వచ్చిందిట్రా?"

"నోరు ముయ్యి! ఆడపిల్లలు, అసలే భయంతో వణికిపోతుంటే నువ్వు ఈ ఆ విషయాలన్నీ జ్ఞాపకం చేస్తావేమిటి?" అన్నాడు లింగమూర్తి.

మేడమీద చప్పుడు అవుతూనే ఉంది.

"నాన్నా! ఆ చప్పుడు వింటూ రాత్రంతా ఇలా మెలుకువగా ఉండవలసిందేనా?" అడిగాడు శేఖర్.

"మరి చేసేదేముంది?"

"వెళ్ళి చూసి -"

"ఒద్దు, వెళ్ళొద్దని ఇందాకే చెప్పాను. కాసేపట్లో నిద్రపడుతుందిలే నిద్రపట్టనివాళ్ళు నా నిద్రమాత్రలు వేసుకోండి."

"అదికాదు నాన్నా! నేను ఒంటిగా వెళ్ళను."

"ప్రసాద్‌ని తీసుకు వెళతానంటావు! ఒద్దు నాయనా! నువ్వూ వెళ్ళవద్దు వాణ్ణి తీసికెళ్ళవద్దు" అన్నది భానుమతి.

"ప్రసాద్‌ని కాదు శేషయ్యనీ, మునయ్యనీ, రాజారాంనీ, తీసుకువెళతాను."

" మీరంతా వెళ్ళిపోయి మమ్మల్ని.." అన్నది పద్మ.

"నాన్న, బాబాయి, వంటమనిషి ఉంటారుగా ఇక్కడ."

"వద్దండి! రాత్రి చీకట్లో వెళ్ళొద్దు.. మేడమీద.." అని పూర్తిగా చెప్పకుండా ఊరుకుంది భారతి.

మేడమీద నడవాలో ఉన్న శవం అందరికీ జ్ఞాపకం వచ్చి ఒళ్ళు జలదరించింది.

"ఆ విషయం ఇక చర్చించకండి," అన్నాడు కామరాజు. అయిదు నిమిషాలపాటు అందరూ మౌనంగా ఉండిపోయారు. మేడమీద ఎక్కడో అవుతున్న ఆ చప్పుడు తప్ప వాళ్ళకి ఇంకేమీ వినిపించడం లేదు. ఆ చప్పుడు ఎందుకు వస్తోంది అనే విషయం గురించి ఎవరికి వాళ్ళు ఊహించుకుంటున్నారు.

"నాన్నగారూ! మేము నలుగురం కలిసి వెళితే భయం ఏముటుంది?" అన్నాడు శేఖర్.

"అబ్బ! ఏం మొండితనం శేఖర్! సరే, అంత సాహసం చెయ్యాలని ఉంటే ముందు శేషయ్యనీ, రాజారాంనీ, మునయ్యనీ కేకేసి పిలు. తర్వాత చూద్దాం." అన్నాడు కామరాజు.

శేఖర్ దిండు కిందనుంచి టార్చి తీసి వెలిగించి లేచి నిలుచున్నాడు. "నేనూ వస్తానుండు" అని ప్రసాద్ లేచాడు.

"నా దృష్టిలోంచి అవతలకి వెళ్ళవద్దు. తలుపు దగ్గిర నిలబడి కేక వెయ్యి" అన్నాడు కామరాజు.

"అందరికన్నా ముందు మీరు వెళ్ళకండి" అన్నది భారతి శేఖరుతో.

"నౌకర్లు వచ్చిన తర్వాత శేఖర్‌కి తోడు వెళతారులే" అన్నది పద్మ.

శేఖర్, ప్రసాద్ తలుపువైపు నడిచారు. శేఖరు చేతిలో ఉన్న టార్చి వెలుగు పైకీ కిందకీ పడుతోంది తలుపుకి ఇంకా నాలుగు అడుగుల దూరంలో ఉండగా, భారతి లేచి ఒక్క గంతు వేసి శేఖర్‌నీ ప్రసాద్‌నీ మెడలు పట్టుకుని వెనక్కి లాగింది. ఆకస్మికంగా వెనకనించి ఎవరో వచ్చి మెడ పట్టుకోగానే ఆ ఇద్దరికి మతిపోయినట్లయి పిడికిలి బిగించి వెనక్కి తిరిగి చూసుకోకుండా భారతిని కొట్టారు.

"శేఖర్ మతిపోయిందా! భారతి" అని అరిచాడు కామరాజు.

కామరాజు అలా అరవగానే వెనక్కి తిరిగి చూసి "భారతీ! నువ్వా..? నిన్నా కొట్టాను?" అన్నాడు శేఖర్ గద్గద కంఠంతో. ప్రసాద్ ఖిన్నుడై తన చేతులు చూసుకుంటూ "క్షమించు భారతీ ఏదో వచ్చి మా మీద పడిందనుకున్నాను"

వాళ్ళు కొట్టిన దెబ్బలకి నేలమీద పడిపోయిన భారతి పక్కన కూర్చుని మోకాళ్ళ మీద వొంగి "భారతీ! నొప్పి పుడుతోందా? తలమీద కొట్టానా? చెప్పు భారతీ!" అని బతిమాలాడు శేఖర్.

"ఎందుకు భారతీ మమ్మల్ని అలా మెడలు పట్టుకుని లాగావు?" అడిగాడు ప్రసాద్.

"నాకు నాలుగు దెబ్బలు తగిలితే జరిగిన పెద్ద హాని ఏం లేదు" అంటూ భారతి లేచి నిలబడి రెండడుగులు వెనక్కి వేసి "అదుగో! అక్కడ చూడండి!" అన్నది గుమ్మం వైపు వేలు పెట్టి తలుపుపైన చూపిస్తూ. అందరూ అటు చూశారు. "ఏముంది? ఏం లేదే" అడిగాడు ప్రసాద్.

"బయటకి వెళ్ళవద్దంటావా?" అడిగాడు శేఖర్.

"సరిగా చెప్పు అమ్మాయీ? ఏమిటి గుమ్మం పైన ఏమున్నది?" అడిగాడు కామరాజు. పద్మ, భానుమతి భారతిని సమీపించి చెరో చెయ్యి పట్టుకుని "పాపం భయంతో వణికిపోతోంది" అన్నారు.

"అక్కడ పామున్నది" అంది భారతి హీన స్వరంతో. అందరూ మళ్ళీ అటు చూశారు. శేఖర్ టార్చి వెలుగు గుమ్మంపైన ద్వార బంధం మీద వేసి "ఏం లేదే!"

"రా పడుకోవమ్మా! కళ్ళు మూసుకుని ఆంజనేయ జపం చెయ్యి" అన్నది భానుమతి దయగా.

"నేను భ్రమపడలేదు. నాకళ్ళతో చూశాను. ఆ ద్వారం పైన పెద్ద పామున్నది. ఇందాక తల కనిపించింది. పైకి వెళ్ళిపోయివుంటుంది" అన్నది భారతి గజ గజ వణుకుతూ

"పామా! పామయితే పర్వాలేదు కొడితే చస్తుంది"

"ప్రసాద్‌గారూ! ఆ పాము ఎలా ఉందో మీరు చూడలేదు" అన్నది భారతి.

శేఖర్ మొహం చిట్లించాడు. భారతి మాట నిర్లక్ష్యం చేసి వెళ్ళటం ఇష్టం లేదు. గదిలో ఉండనూ లేడు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. టార్చి వెలుగు ద్వారం పైన వేసి ఉంచాడు. నల్లగా తళతళ మెరుస్తున్నాయి కళ్ళు. తలముందు కనిపించింది... తర్వాత ఒంపులు తిరుగుతూ నెమ్మదిగా కిందకి జారింది. రెండడుగుల పొడుగున ద్వార బంధం మధ్య వేళ్ళాడుతోంది. గిర గిర తిరుగుతోంది. ఒళ్ళు విరుచుకుంటోంది. దీపం వేపు చూస్తోంది. అందరూ ఊపిరి బిగపట్టి కదలకుండా నిలుచున్నారు. పాము నెమ్మదిగా ఇంకో రెండడుగులు కిందకి జారిందిగాని తోక కనిపించలేదు. "చాలా పెద్దది. ఆరు అడుగులపైన ఉండి ఉండాలి" అన్నాడు లింగమూర్తి రహస్యంగా.

తలుపుకి నాలుగయిదు అడుగుల దూరంలో నిలుచున్న శేఖర్ని, ప్రసాద్‌నీ, భారతినీ వెనక్కి లాగి "దూరంగా రండి ఎంత పెద్ద పామో!" అన్నాడు కామరాజు రొప్పుతూ. ఒకళ్ళని ఒకళ్ళు ఆనుకుని గుంపులుగా నిలుచున్నారు అందరూ. ఆడవాళ్ళు భయంతో క్షణ క్షణానికి నేల మీద చూస్తున్నారు. ఇంకో పాము ఏమూలనుంచో వస్తుందేమోనన్న భయంతో శేఖర్, ప్రసాద్ తలుపు మీద ఉన్న పాముని రెప్ప వాల్చకుండ చూస్తున్నారు.

"నీ పిస్తోలేమైంది?" అడిగాడు ప్రసాద్.

"నా గదిలో ఉంది తీసుకురావడం మరచిపోయాను."

"డామిట్! అవసరం అయినపుడు లేకుండా పోతుంది" అన్నాడు ప్రసాద్ విసుగ్గా.

"అదితాచు. నల్లని తాచు" అన్నది భానుమతి.

"వాళ్ళిద్దరి ప్రాణాలు రక్షించినందుకు భారతికి చాలా ఋణపడివున్నాం" అన్నాడూ లింగమూర్తి.

శేఖరు పామునే తదేక దృష్టితో చూస్తున్నాడు. ఆ తాచు కిందవరకూ పాకుతూ వచ్చి మళ్ళీ నెమ్మదిగా పైకి పాకి వెళ్ళిపోయింది. తల కనిపించడం లేదు.

"ఈ ఇంట్లో పాములున్నాయా నాన్నా?" అడిగాడు శేఖర్. "ఇంతకుముందు ఎన్నడూ పాము ఇంట్లోకి రాలేదు. ఒకటి రెండుసార్లు చిన్న చిన్న పాములని తోటలో చంపారు" అన్నాడు కామరాజు.

"ఈ పాముని చంపితే కాని బయటకి వెళ్ళడానికి వీల్లేదు."

"తలుపుకి అవతల ద్వారం పైన ఉన్న పాముని ఎలా చంపడం?" అన్నాడు లింగమూర్తి.

మళ్ళీ ఆ పాము నెమ్మదిగా తలకిందకి జారవిడిచింది. మెలికలు తిరుగుతూ బుసలు కొడుతూ, ద్వార బంధానికి ఆనుకుని నెమ్మదిగా కిందకి జారింది. నేలకి అడుగు ఎత్తు వరకు వచ్చి మళ్ళీ పైకి వెళ్ళిపోవడం ప్రారంభించింది.

"ప్రసాద్! ఆ కుర్చీ విరగగొట్టి కోడు ఇలా ఇయ్యి" అన్నాడు శేఖర్.

"దేనికి?" అడిగాడు కామరాజు.

"పాముని చంపడానికి" దృష్టి తలువైపు నుంచి మరల్చకుండానే చెప్పాడు శేఖర్,

పాము మళ్ళీ పైకి వెళ్ళిపోయింది. కనిపించడం లేదు. ప్రసాద్ కుర్చీ నేలకేసి కొట్టి, విరిచి రెండు కోళ్ళు ఊడతీసి ఒక కోడు శేఖర్ కిచ్చి రెండో కోడు తను తీసుకున్నాడు. పాము మళ్ళీ నెమ్మదిగా కిందకి జారుతోంది.

"బాబాయ్! టార్చి తీసుకుని వెలుగు తలుపు మీద వెయ్యి." అన్నాడు శేఖర్.

"ఒకమాట" అన్నది భారతి.

"ఏమిటి?" అడిగాడు శేఖర్.

"అది పామేనా! నిజంగా పామా కాదా అని ఆలోచించారా?"

"కళ్ళకి పాము స్పష్టంగా కనిపిస్తుండగా పాము కాదేమో అన్న సందేహం ఎందుకు కలిగింది?" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

"ఒక విషయం ఆలోచించారా?" అడిగింది భారతి శేఖర్ చెయ్యి పట్టుకుని.

"ఏమిటది?"

"అది ఆ తలుపు దగ్గరే గుమ్మానికి అతుక్కున్నట్లు ఎందుకు అక్కడే తిరుగుతోంది!"

"ఏమో!" అన్నాడు ప్రసాద్. పాము మెలికలు తిరుగుతూ గుమ్మం మీద నుంచీ కిందకి జారుతోంది. తల ఇటూ అటూ తిప్పుతోంది. క్షణం క్షణం నాలిక బయట పెడుతోంది. నిగ నిగ మెరుస్తున్న పాము మీద నుంచి టార్చి వెలుగు వివిధ కోణాల్లోంచి ప్రతిబింబిస్తోంది. నల్లని ఆ తోలు మీద, నల్లని గీతలు, నల్లని గీతల్లో ఇంకా నల్లగా ఉన్న చుక్కలు. ఆ నల్లని చుక్కల్లో మరీ నల్లగా ఉన్న గీతలు.

"నిజమైన పామే అయితే మనుష్యులు దగ్గర్లో మాట్లాడుతుంటే అలా అక్కడే ఉంటుందా? పారిపోదూ!" అన్నది భారతి. అందరూ పాముని పరీక్షగా చూస్తున్నారు.

శేఖర్ నవ్వాడు. "నిజం పాము కాదనీ, రబ్బరు పాము అనీ అంటున్నావా? కాదు నిజం పామే! నాలిక బయటికి పెడుతోంది. కళ్ళు చూడు ఎట్లా మెరుస్తున్నాయో!"

"అబ్బా! నేను చూడలేను. రబ్బర్ పాము కాదు నిజం పామే. కాని సామాన్యమైన తాచుపాము కాదేమోనని నా అనుమానం. పాము మనుష్యుల అలికిడి వింటే పారిపోతుంది. అక్కడే ఎందుకుంటుంది? మనల్ని ఎలా చూస్తున్నదో, నవ్వుతున్నట్లు, ధైర్యం ఉంటే గుమ్మందాటి రండి మీ పనిపడతాను, ఏమౌతారో చూస్తాను అంటున్నట్లు చూస్తోంది. నిజ పామైతే ఆ తలుపు దగ్గరే కిందకీ పైకీ ఎందుకు నాట్యం చేస్తుంది?" అన్నది భారతి భయంతో.

శేఖర్ నవ్వి "బావుంది అయితే ఈ పాము దెయ్యం అంటావా భారతీ. దగ్గరికి వెళ్ళగానే పాము పులిగా మారుతుందా?" అన్నాడు.

"పులిగా మారుతుందో, సింహంగా మారుతుందో మీరు కొట్టే దెబ్బలకి చావకుండా మిమ్మల్ని కాటు వేస్తుందో నేనేం చెప్పగలను?" అన్నది భారతి.

"భారతి చెప్పిన విషయంలో నిజం లేకపోలేదు శేఖర్. మామూలు పామైతే ఇంతసేపు ఆ తలుపు మీద ఎందుకుంటుంది? నువ్వు ఆ కర్ర యిలాతే" అన్నాడు కామరాజు శేఖర్ చేతిలో కర్ర లాక్కుంటూ.

"అయితే ఆ పాముని చూస్తూ ఊరుకోవాలా!" అడిగాడు శేఖర్. "అవును చూస్తూ కూర్చుందాం. అది ద్వారబంధం మీద నుంచి కిందకి దిగి లోపలికి వస్తే కొడదాం. లేదా తెల్లారేంతవరకూ దాన్ని చూస్తూ కూర్చోవాలి."

"తెల్లారిన తర్వాత?"

"నౌకర్లు ఎవరయినా ఇటు వస్తారు. వెలుగుంటుంది అది ఎటు పోతుందో చూడవచ్చు" అన్నాడు కామరాజు. టార్చి వెలుగు గుమ్మం మీదే వేసి ఉంచారు. అందరి కళ్ళు ఆ పాముమీదే ఉన్నాయి. రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చున్నాడు.

"పోనీ నౌఖర్లని ఇప్పుడే పిలిస్తే?" అడిగాడు ప్రసాద్.

"పాపం వాళ్ళకి మాత్రం ప్రాణాపాయం కాదూ!" అన్నాడు కామరాజు.

30

"మేడ మీద ఏదో చప్పుడవుతోంది. చెవుల్లో గునపం పెట్టి కొడుతున్నట్లున్నది. నిద్రపట్టడం లేదు" అన్నది సావిత్రి.

"ఏమిటో ఆ చప్పుడు?" అన్నది దాసీది.

మునయ్య, శేషయ్య, మొద్దబ్బాయి ఒకవైపున, రాజారాం, సావిత్రి, దాసీది, వంటమనిషి ఇంకో పక్కనా పడుకున్నారు. లాంతర్ సన్నగా వెలుగుతోంది.

"వెళ్ళి చూసివస్తే సరి" అన్నాడు మునయ్య.

"అర్ధరాత్రి ఈ దెయ్యం కొంపలో ఎవరు వెళతారు మేడమీదికి" అన్నది దాసీది.

"నాకేం భయం లేదు. నేను ఒంటిగా వెళ్ళగలను" అని మునయ్య లేచాడు.

శేషయ్య, మొద్దబ్బాయి పడుకునే ఉన్నాడు.

"లాంతరు తీసుకువెళ్ళనా?" అడిగాడు మునయ్య.

"అమ్మ బాబోయ్! ఈ గదంతా చీకటైపోదూ?" అన్నది సావిత్రి ఖంగారుగా.

మునయ్య నవ్వి "అయితే చీకట్లో ఎలా వెళ్ళడం?" అంటూ తలుపు వైపు రెండడుగులు వేసి, చటుక్కున ఆగిపోయి వెనక్కి నాలుగు అడుగులు వేశాడు.

"ఉత్తరకుమారుడి మల్లే -" అని నవ్వింది దాసీది.

"ఉష్!" అన్నాడు మునయ్య.

"ఏమిటి?"

"పాము నల్ల తాచు. తలుపు పైన చూడండి" మునయ్య రొప్పుతూ అన్నాడు. శేషయ్య, మొద్దబ్బాయి లేచి నిలుచున్నారు. తతిమ్మా వాళ్ళంతా తలుపుకి దూరంగా వెళ్ళి గోడకి నక్కి నిలుచున్నారు. గుమ్మం పై నుంచి కిందకి పాకి, మళ్ళీ పైకి పాకిపోయింది పాము. మౌనంగా అందరూ ఆ పామునే చూస్తూ నిలుచున్నారు. అది మళ్ళీ కిందకి పాకి వచ్చి గుమ్మం మీద తారట్లాడుతోంది.

"కర్ర ఇలాతే మొద్దబ్బాయ్!" అన్నాడు శేషయ్య.

"ఏం చేస్తావయ్యా? పాముని కొడతావా? నీకేమైనా మతి పోయిందా? బుద్ధిలేని పని చెయ్యక" అన్నాడు మునయ్య శేషయ్య చెయ్యి పట్టుకుని.

"ఎవరో ఒకళ్ళు ధైర్యం చెయ్యాలి, లేకపోతే ఎలా?"

"ఎందుకు తెగించడం? కాసేపు అక్కడే తారట్లాడి వెళ్ళిపోతుందిలే."

"వెళ్ళకపోతే, లోపలికి వస్తే?" అడిగాడు మొద్దబ్బాయి.

"అప్పుడు కొట్టవచ్చు" సలహా ఇచ్చాడు మునయ్య.

"లోపలికి రానివ్వడం ఎందుకు? ఈసారి కిందకి దిగినప్పుడు తలమీద కొడితే సరి" అని మొద్దబ్బాయి ఇచ్చిన కర్ర గట్టిగా పట్టుకున్నాడు శేషయ్య. మునయ్య బాగా వెనక్కి వెళ్ళి నిలబడ్డాడు. మొద్దబ్బాయి లాంతర్ ఎత్తిపట్టుకున్నాడు. పాము నెమ్మదిగా కిందకి

దిగుతోంది. శేషయ్య కర్ర ఎత్తిపట్టుకున్నాడు. అందరూ ఊపిరి బిగపట్టి కళ్ళు పెద్దవి చేసి, రెప్పలార్పకుండా చూస్తున్నారు. పాము బుసలు కొడుతోంది. మెలికలు తిరుగుతోంది. ద్వార బంధం ఆనుకుని కిందకి దిగుతోంది. శేషయ్య కర్ర పైకి ఎత్తాడు. మొద్దబ్బాయి ఒక చేత్తో లాంతరు, రెండో చేత్తో కర్రా పట్టుకున్నాడు. శేషయ్య ఒక్క అడుగు ముందుకు వేసి ఓ దెబ్బ కొట్టాడు. పాము తలకింద మెడమీద తగిలి చితికి పోయింది. నిమిషంపాటు తల ఇటూ అటూ ఆడించి, మెలికలు చుట్టుకుని తలవాల్చేసింది. కింద పడలేదు.

"చావలేదా?" అడిగాడు మొద్దబ్బాయి.

"చచ్చే ఉండాలి" అంటూ శేషయ్య కర్రతో ణము తల ఇటూ అటూ కదిల్చాడు. జీవం లేదు.

"చచ్చినా కిందపడలేదేం?" అడిగాడు మొద్దబ్బాయి.

"ఏమో చూడాలి" అంటూ శేషయ్య లాంతరు తీసుకుని పాము పక్కనుంచి గుమ్మం దాటి అవతలికి వెళ్ళాడు.

గదిలో అందరూ ఆశ్చర్యంతో చూస్తున్నారు. తలుపుకి అవతల నిలబడి లాంతర్ పైకెత్తి పెట్టి పరీక్ష చేసి, శేషయ్య మొద్దబ్బాయిని రమ్మని సంజ్ఞ చేశాడు. మొద్దబ్బాయితో మునయ్య కూడా వెళ్ళాడు.

"చూడు ఎందుకు కింద పడలేదో తెలిసిందా!"

మొద్దబ్బాయి గుమ్మం పైన చూశాడు. గుమ్మము పైన ఉన్న మేకుకి పాము తోక గట్టిగా తాడుతో కట్టేసి ఉంది. తోక తెగిపోయేంత గట్టి ముడి వేసి ఉంది.

శేషయ్య చచ్చిపడివున్న పాము తల చేతితో పట్టుకుని నీరు తెరిచి "దీపం చూపించమన్నాడు" మొద్దబ్బాయి, శేషయ్య పాము నోరు పరీక్ష చేశారు. కోరలు లేవు.

శేషయ్య నవ్వి "పద మేడమీదకి వెళ్ళి ఆ చప్పుడేమిటో చూద్దాం" అన్నాడు.

"నేనూ వస్తాను" అన్నాడు మునయ్య వాళ్ళ పక్కనే నిలబడి.

శేషయ్య తలూపాడు. ముగ్గురూ మెట్లవైపు వెళ్ళారు.

"శేషయ్యా!?" కామరాజు పిలుపు వినబడగానే శేషయ్య వెనక్కి తిరిగాడు. ఆ గదిలో అందరూ ద్వారానికి దూరంగా గుంపుగా నిలుచుని ఉండడం అప్పుడు చూశాడు శేషయ్య.

"ఏమండీ!" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు.

"ఆగు! ఆగు! గుమ్మం మీద పామున్నది" అన్నాడు శేఖర్.

శేషయ్య మొద్దబ్బాయిని చూసి చిన్నగా నవ్వి "ఈ పాముకయినా కోరలుంటాయేమో చూడాలి" అన్నాడు.

"ఏమో! చంపిన తర్వాతగాని తెలియదు."

"కర్ర పట్టుకురా!"

నిమిషంలో మొద్దబ్బాయి రెండు కర్రలు తెచ్చాడు. "దీపం నా చేతికి ఇవ్వు. నేను పట్టుకుంటాను!" అన్నాడు మునయ్య.

"నా చేతిలోనే ఉంటే బాగా కనిపిస్తుంది" అన్నాడు మొద్దబ్బాయి దీపం ఇవ్వకుండా.

పాముని చంపేసి నోరు తెరిచి పరీక్ష చేసి "దీనికీ కోరలు లేవు" అన్నాడు శేషయ్య.

ఆ మాట విని శేఖర్ "దీనికీ కోరలు లేవు అంటున్నావు. ఇంకో పాముని చంపారా?" అడిగాడు.

శేషయ్య చెప్పాడు.

"విచిత్రంగా ఉంది! కోరలు లేని రెండు పాముల్ని తెచ్చి గుమ్మానికి ఎవరు కట్టివుంటారు? మనిషి అయినవాడు చేసే పని కాదు" అన్నాడు కామరాజు.

మేడమీద ధన్ ధన్ మని చప్పుడు ఇంకా వినబడుతోనే ఉంది.

" ఆ చప్పుడు ఏమిటో చూసివస్తాను" అన్నాడు శేషయ్య.

"నేను కూడా వస్తాను. ముందు నా గదిలోకి వెళి పిస్తోలు తీసుకోవాలి" అన్నాడు శేషయ్య. శేషయ్య, మొద్దబ్బాయి, శేఖర్, మునయ్య మెట్లు ఎక్కుతున్నారు.

"అదుగో దాన్ని చూడండి!" అని కేకేశాడు మునయ్య ఆఖరు మెట్టు ఎక్కుతూ ఆ నిశ్శబ్దంలో అతని అరుపు లౌడ్ స్పీకర్లోంచి వినిపించినట్లున్నది.

"ఏమిటది? " అడిగాడు శేఖర్.

"ఆ నడవాలో పరిగెత్తింది ఓ పెద్ద ఆకారం. ఎలుగు బంటిమల్లే ఉన్నది."

"ఎలుగు బంటి వస్తే శేఖర్ పిస్తోలుతో కాల్చేస్తాడులే!" అన్నాడు శేషయ్య.

"చప్పుడు ఆగిపోయింది" అన్నాడు శేఖర్.

"అవును అసలు ఎక్కణ్ణించి వచ్చిందో చూద్దాం" అన్నాడు శేషయ్య.

అందరూ నడవాలోకి వెళ్ళారు, కుర్చీ అలాగే ఉంది. నేల మీద గడ్డకట్టిన రక్తం మడుగున్నది. కుర్చీలో శవం లేదు. "మళ్ళీ ..." అన్నాడు శేఖర్ రహస్యంగా.

"ఎక్కడో ఉంటుందిలెండి, రండి!" అని అవతల గదిలోకి దారితీశాడు. అది భారతి గది,

నలుగురూ తలుపు దగ్గరే ఆగిపోయారు. రెండడుగుల పొడగున గోడకి పెద్ద రంధ్రం కనిపించింది. పక్కనే ఓ గెడ్డపార ఉంది. నేలమీద సున్నమూ, ఇటికల ముక్కలూ కుప్పలుగా పడివున్నాయి. పక్కన ఓ అస్థిపంజరం ఉంది. ఆ అస్థిపంజరం చేతుల ఎముకలు కిందకి జారివున్నాయి.

"గుడ్ గాడ్! ఏమిటిది?" అన్నాడూ శేఖర్.

శేషయ్య గదిలోకి అడుగు వెయ్యబోతుండగా శేఖర్ అతని చెయ్యి పట్టుకుని "శేషయ్యా! వద్దు మన వివేకానికి అతీతంగా ఉన్నాయి ఈ ఇంట్లో జరుగుతున్న సంఘటనలు, కిందకి వెళ్ళిపోదాం" అన్నాడు.

శేఖర్ చెయ్యి విదిలించుకుని శేషయ్య లోపలికి వెళ్ళాడు. అస్థిపంజరం పక్కన నిలబడి నేలనీ, అస్థిపంజరాన్నీ పరీక్షగా చూశాడు.

## 31

"సావిత్రి"

"ఏంటి రాజా!"

"ఇలా దగ్గరికి జరుగు."

"చాలా?"

అన్నది సావిత్రి రాజారాం మెడలో తన మొహం దాచుకుంటూ.

"ఈ వరద తగ్గితే -"

"తగ్గితే -?"

"మనం వెళ్ళిపోదాం ఈ ఇంట్లోనుంచి ఎంత త్వరగా వెళ్ళిపోతే అంత మంచిది" అన్నాడు రాజారాం. సావిత్రి నడుం చుట్టూ చెయ్యివేసి ఇంకా దగ్గరికి లాక్కుంటూ. మృదువుగా అతని పెదిమలని తన పెదిమలతో తాకింది సావిత్రి. అతను ఆమెని గాఢంగా కావలించుకున్నాడు.

"పోయిందా?" అడిగింది సావిత్రి.

"ఏమిటి?"

"నా మీద కోపం -"

"నీ మీద కోపం లేదే"

"నీ చెల్లెలుగా..."

"అదా!? చెప్పానుగా నువ్వు నా చెల్లివి కావని మనసులోకి ఇంకాలని."

"ఇంకిందా?"

"బాగా ఇంకింది ఏవీ? నీ పెదిమలు" అన్నాడు రాజారాం.

అయిదు నిముషాల తర్వాత "మరి మనం వెళ్ళిపోతే నువ్వు వచ్చిన పని?" అడిగింది సావిత్రి రహస్యంగా.

"మేడమీద గదిలోకి వెళ్ళాలి. నడవాలో శవం ఉంది. అస్తిపంజరం తిరుగుతోంది. ఈ దెయ్యాల కొంపలో ఎలా?"

"అందుకని ఒదిలేసి వెళ్ళిపోదామా? తీసుకుని వెళ్ళిపోతే సరి!"

"ఎలా తీసుకోవడం! రాత్రి వెళ్ళడానికి ధైర్యం చాలదు లేచి తిరిగే శవాలు, అస్తిపంజరాలు, పాములు!"

రాజారాం జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి, అతని చెంపకి తన చెంప రాసుకుంటూ "ఆ శేషయ్య ధైర్యశాలి మల్లే ఉన్నాడు. ముసలాడయినా భయపడకుండా ఆ పాముల్ని ఎలా చంపాడో! అతన్ని సహాయం అడిగితే!"

"ఇదేమయినా బరువు మోయడమా సహాయం అడగడానికి." సావిత్రి నవ్వింది.

"కొంత ఇస్తానని చెప్పు! మంచి మాటలతో ఒప్పించు. డబ్బుకి లొంగనివాడెవడుంటాడు. శేషయ్యలాంటి బీదవాడు వెంటనే ఒప్పుకుంటాడు."

రెండు నిముషాలపాటు రాజారాం మౌనంగా ఉండి "ఏమంటాడో రేపు అడిగి చూస్తాను!" అని సావిత్రిని మరింత గట్టిగా కావలించుకున్నాడు.

## 32

"వరదలు తగ్గుతున్నాయి" అన్నాడు శేఖర్.

"ఎలా తెలుసు?" అడిగాడు లింగమూర్తి.

"రేడియోలో చెప్పారు."

"అవును మర్చేపోయాను. నీ దగ్గిర ట్రాన్సిస్టర్ ఉందిగా! అయితే ఒకటి రెండు రోజుల్లో ఈ లంక లోంచి బయట పడతాం" అన్నాడు లింగమూర్తి సంతోషంతో.

వరద తగ్గుతుందనీ, ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయేందుకు వీలవుతుందనీ తెలియగానే అందరి మొహాలు వికసించాయి. గుండెల్లో బరువు తగ్గింది. మహా అయితే ఇక ఒకరోజో, రెండు రోజులో! ఈ రెండు రోజులూ ఎలాగో గడిపేస్తే చాలు. వరద తగ్గు ముఖం

పట్టిందని నౌఖర్లకి కూడా తెలిసింది. సంతోషంతో వాళ్ళ మొహాలూ వికసించాయి. శేషయ్య చుట్టతాగుతూ కనుచూపుమేర వరకూ కనిపిస్తున్న నీటి ప్రవాహం చూస్తూ వసారాలో నిలుచున్నాడు.

"శేషయ్యా!"

"ఆ!" అని పక్కకి తిరిగాడు శేషయ్య.

"ఓ మాట!" అన్నాడు రాజారాం.

"ఏమిటా మాట!"

"నీకు లక్ష రూపాయలు వస్తాయింటే ఏం చేస్తావు?" అడిగాడూ రాజారాం చిరునవ్వుతో.

"విరగబడి నవ్వుతాను. నాకు లక్ష రూపాయలు ఎలా వస్తాయి నాయనా!"

"వచ్చే మార్గం నేను చెపుతానంటాననుకో!"

"నాకు చెప్పడం దేనికి! నువ్వే తీసుకో ఆ లక్షా!" అన్నాడు శేషయ్య నవ్వుతూ.

"నాకూ, నీకూ వచ్చే మార్గం ఉంది. హాస్యం కాదు. నిజం!"

"అలాగా! ఏమిటి నాయనా ఆ చిట్కా?" అడిగాడు శేషయ్య.

"శేషయ్యా! బిగ్గరగా మాట్లాడక. ఎవరయినా వింటారు, ఇది రహస్యం సుమా! ఈ ఇంట్లో కొన్ని లక్షలున్నాయి."

"ఏమిటి? దెయ్యాలా?" అడిగాడు శేషయ్య.

"హాస్యానికి చెప్పడంలేదు అన్నానుగా! ఈ ఇంట్లో ఒక చోట కొన్ని లక్షలున్నాయి. అవెక్కడున్నాయో నాకు తెలుసు. మనం వెళ్ళి తీసుకోవడమే తరువాయి."

"అయితే ఇంకా ఎందుకు ఇక్కడ నిలుచున్నావు? వెళ్ళి తీసుకో!"

"రాత్రిళ్ళు ఈ ఇంట్లో దెయ్యం తిరుగుతోంది. ఒంటిగా ఎలా వెళతాను!

"అందుకని?"

"రాత్రి నాకు తోడుగా రా. ఎవరికి తెలియకూడదు సుమా! నువ్వు నాకు తోడు వస్తే నీకు ఓ లక్ష ఇస్తాను."

"ఈ దెయ్యాల భయంతో నీ మతి చెడిపోయింది."

"శేషయ్యా! నేను నిజం చెబుతున్నాను" అని రాజారాం ఇటూ అటూ చూసి ఆ ప్రాంతాల్లో ఎవరూ లేరని నిశ్చయించుకుని "నిజం చెపుతున్నాను. నేనే కొన్నేళ్ళ క్రితం చాలా విలువ చేసే నగలు ఈ ఇంట్లో దాచాను."

"ఎక్కడ దాచావు, నాకు సహాయం చేస్తే నీకు భాగం ఇస్తాను." శేషయ్య తలూపాడు.

"అయితే రాత్రి అందరూ నిద్రపోయాక నిన్ను పిలుస్తాను. నాతో రా!"

శేషయ్య మళ్ళీ తలూపాడు. సరిగా ఆ సమయానికి ఎవరో వెనక కదిలినట్లు అలికిడి అయింది. ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. ఎవరూ లేరు. కాని కిటికీ తెర కదిలింది. గాలికే కదిలిందో, లేక మనిషే కదిల్చాడో తెలియలేదు.

వాన ఆగిపోయింది. బాగా ఎండకాస్తోంది కాని ఇంకా ఇంటి చుట్టూ నీళ్ళు ఉన్నాయి, మర్నాటికి నీటి మట్టం బాగా తగ్గుతుందని అందరి ఆశ. కిటికీలోంచి, తలుపుల్లోంచి నిగనిగమంటూ ఎండ ఇంట్లో అన్ని మూలలా పడుతూ ఉంటే అందరికి ధైర్యం వచ్చింది. అయినా ఎవరూ మేడమీదకి వెళ్ళలేదు. మేడమీద శవం విషయం ఎవరూ మరిచి పోలేదు. కామరాజు లింగమూర్తి చదరంగం

ఆడుతూ రోజంతా గడుపుతున్నారు. శేఖర్, ప్రసాద్, భారతీ, పద్మా పేకాటలో పొద్దుపుచ్చుకుంటున్నారు. నౌఖర్లు ఎవరి పనులు వాళ్ళు చూసుకుంటున్నారు.

చీకటి పడసాగింది. లాంతర్లు వెలిగించారు. చీకటితో పాటు మళ్ళీ అందర్లో భయం కలిగింది. ఈ రాత్రి - ఈ ఒక్క రాత్రి ఏ అఘాయిత్యమూ జరగకుండా గడిస్తే మర్నాడు ఆ ఇంట్లోంచి వెళ్ళిపోవచ్చునని ఆశపడుతున్నారు. ఎనిమిది గంటలకల్లా భోజనాలు పూర్తి అయ్యాయి.

"ఏమర్రా వాన తగ్గిపోయింది. వరదా తగ్గిపోతోంది బహుశా రేపు మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోవచ్చుననుకుంటాను. ఎవరికీ ఏ ఆపదా కలగకుండా ఈ రాత్రి గడిస్తే చాలు!" అన్నాడు కామరాజు.

లింగమూర్తి, భానుమతి తలలు ఊపారు. "ఆపద రాకుండా మనం ఏం చెయ్యగలం?" అన్నాడు ప్రసాద్. "జాగ్రత్తగా ఉంటే సరి. ఈ గది తలుపులు మూసేసి లోపల గడియ పెట్టేద్దాం. ఎక్కడ ఏ చప్పుడు అయినా, తెల్లారేంతవరకూ ఇక్కణ్ణించి ఎవరూ వెళ్ళకూడదు. రాత్రంతా వంతుల మీద ఇద్దరేసి చొప్పున కాపలా ఉండాలి శేఖర్! పిస్తోలు దగ్గర ఉంచుకో" అన్నాడు కామరాజు.

"నౌకర్లు?" అడిగాడు శేఖర్. "నౌకర్లని కూడా ఈ రాత్రికి మనతోపాటు ఈ హాల్లోనే పడుకోమందాం, ఎందుకయినా మంచిది."

శేఖర్ నవ్వి "పిడుగుపడినా, భూకంపం వచ్చినా మనం ఈ హాల్లోంచి కదలకూడదంటావు!" అన్నాడు.

కామరాజు తీక్షణంగా శేఖర్ని చూసి, "సాహసం చేసి మాట మాటికి నువ్వు చొరవచేసుకుని వెళ్ళి తెలుసుకున్నదేమిటి?" అడిగాడు. శేఖర్ పెదిమ విరిచాడు. "అందుకే చెపుతున్నాను." కామరాజు మాటకి ఎవరూ ఎదురు చెప్పలేదు.

భోజనాలు ముగించిన తరువాత నౌకర్లందరూ హాల్లోకి వచ్చి పడుకోవాలని కామరాజు ఉత్తరువు అని ప్రసాద్ నౌకర్లకి చెప్పివచ్చాడు. తొమ్మిది గంటలయింది. దాసీది హాల్లోకి వచ్చింది.

"మిగతావాళ్ళేరి?"

"వంటమనిషి, మొద్దబ్బాయ్ వసారాలో నిలుచున్నారండి!"

"మునయ్య, రాజారాం, అతని చెల్లెలు?"

"వాళ్ళు కనిపించడం లేదండీ."

"అదేమిటీ? ఎలా కనిపించకుండా పోతారు? అందరూ కలిసి భోజనాలు చెయ్యలేదా?" అడిగాడు శేఖర్.

"అందరం కలిసే భోజనం చేసామండీ! రాజారాం, సావిత్రి ముందుగా భోజనం ముగించి చేతులు కడుక్కోవడానికి సావిట్లోకి వెళ్ళారు. తర్వాత నేనూ, మొద్దబ్బాయి, మునయ్య వెళ్ళాం. మా వెనకే వంటమనిషి, దాసీది వచ్చారండి! రాజారాం, సావిత్రి చేతులు కడుక్కుని వెళ్ళారు. వాళ్ళ గదిలోకో, హాల్లోకో వచ్చారనుకున్నాము" అన్నాడు శేషయ్య

"వాళ్ళ గదిలో కూడలేదా?"

"చూశానండీ లేరు"

"మునయ్య ఏడి?"

"అతను కనిపించడం లేదండీ! నేను, మొద్దబ్బాయి రాజారాం కోసం వెతుకుతుండగా మునయ్య వెళ్ళిపోయారండి!"

కామరాజు రెండు నిమిషాలు ఆలోచించి "వాళ్ళ ముగ్గుర్నీ వెంటనే రమ్మని కేకవెయ్యి."

మొద్దబ్బాయి కేకేశాడు. ప్రతిధ్వని తప్ప జవాబులేదు. అయిదు నిముషాలుండి మళ్ళీ కేక పెట్టాడు. ప్రయోజనం లేక పోయింది.

"ఒకళ్ళకి ఒకళ్ళు తోడుగా ఎక్కడికో వెళ్ళి ఉంటారు. కాసేపు చూస్తే సరి" సలహా ఇచ్చాడు లింగమూర్తి.

మొద్దబ్బాయి, శేషయ్య హాలు తలుపు దగ్గరే నిలుచున్నారు. వంటమనిషి, దాసీది హాల్లోకి వెళ్ళి ఓ మూల చాపలు పరుచుకున్నారు. అరగంట దాటింది. శేషయ్య తలుపు దగ్గర పచార్లు చేస్తున్నాడు.

"వాళ్ళు ఏమయ్యారో వెళ్ళి చూసి వద్దామా" అడిగాడు మొద్దబ్బాయి.

"నాకు లక్ష రూపాయలు వచ్చే మార్గం చూపిస్తానన్నాడు రాజారాం" చెప్పాడు శేషయ్య రహస్యంగా

"ఎప్పుడు?"

"పొద్దున్న చెప్పాడు. రాత్రి తనకూడా రమ్మన్నాడు.

"అయితే మనం వెళ్ళి వెతకడం మంచిదనుకుంటాను."

శేషయ్య తలవూపి "వీళ్ళని తలుపులు వేసుకోమని చెప్పాలి. అందరూ అప్పుడే నిద్రపోయినట్లున్నారు."

"శేఖర్ మెలుకువగానే ఉన్నాడేమో చూస్తాను" అని లోపలికి వెళ్ళి నిమిషంలో శేఖరుతో తిరిగి వచ్చాడు మొద్దబ్బాయి, "వాళ్ళు ముగ్గురూ అంతులేరు. మేం వెతకడానికి వెళుతున్నాము. తలుపు గడియపెట్టుకోండి" అన్నాడు శేషయ్య. శేఖర్ తలతిప్పి "భారతితో తలుపు వేసుకోమని చెపుతాను. నేనూ వస్తాను" అన్నాడు.

"మీ నాన్నగారు?"

"నాన్న నిద్రపోతున్నాడు"

"అవసరంలేదు. మీరు ఇక్కడే ఉండండి."

"ఇద్దరికి ముగ్గురం ఉంటే మంచిది." అని లోపలికి వెళ్ళాడు శేఖర్. అయిదు నిముషాల తర్వాత బయటకి వచ్చి "వెళ్ళడానికి వీల్లేదని భారతి పట్టుపట్టింది. ఆమెని ఒప్పించేటప్పటికి ఇంతసేపు అయింది." అన్నాడు.

ముగ్గురూ బయలుదేరారు. నాలుగు అడుగులు వేశాక శేఖర్ చెయ్యి పట్టుకుని "దయచేసి మాట్లాడవద్దు, చప్పుడు చెయ్యవద్దు. నిశ్శబ్దంగా ఉండండి" అన్నాడు శేషయ్య.

"ఎందుకని?" అడిగాడు శేఖర్.

"తర్వాత చెపుతాను. ఆ టార్చి ఇలా ఇవ్వండి." అని టార్చి తీసుకుని అద్దానికి అరిచెయ్యి అడ్డుపెట్టి, వేళ్ళ సందుల్లోంచి కొద్దిగా వెలుగు వేస్తూ శేషయ్య ముందుకి నడిచాడు.

వంట గదీ, భోజనాల సావిడీ, కొట్టుగదీ, కింద అన్ని గదులూ వెతికారు, ఆ ముగ్గురి జాడ కనిపించలేదు వంట గది పక్కన ఉన్న వసారాలో శేషయ్య ఆగిపోయి టార్చి వెలుగులో నేలంతా పరీక్షగా చూశాడు - ఒక మూల ఉండగా ఉన్న దూది కనిపించింది. మొద్దబ్బాయి ఆ దూది ఉండ తీశాడు. శేషయ్య దాన్ని వాసన చూసి జేబులో పెట్టుకున్నాడు.

"ఏమిటది?" అడిగాడు శేఖర్.

"ఉష్! తర్వాత చెపుతాను" అని శేషయ్య మెట్లవైపు దారి తీశాడు.

శేఖర్ మెట్ల దగ్గర ఆగిపోయాడు. వాళ్ళతో మేడమీదకి వెళదామా వద్దా అని ఆలోచిస్తున్నాడు. శేషయ్య, మొద్దబ్బాయిల ప్రవర్తన అతనికేమాత్రమూ నచ్చలేదు.

"మీరిక్కడే నిలుచునుంటారా!" అడిగాడు శేషయ్య.

"శేషయ్యా! ఏదో గూడుపుఠాణి చేస్తున్నారు మీరు. అదేమిటో చెపితేకాని వీల్లేదు." అన్నాడు శేఖర్ గంభీరంగా.

"మీకే తెలుస్తుంది, దయచేసి మాతో రండి! మీ సహాయం మాకు అవసరం కావచ్చు" అని శేషయ్య మేడ మెట్లు ఎక్కసాగాడు.

శేషయ్య వెనకే మొద్దబ్బాయి, శేఖరూ వెళ్ళారు.

నడవాలో కుర్చీలో వైకుంఠరావు శవం అలాగే ఉన్నాయి. ఎక్కడా ఏ మార్పు రాలేదు. ఒక్కొక్క గది వెతికారు. రాజారాం, సావిత్రి, మునయ్యల ఆచూకీ తెలియలేదు.

"వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయారేమో!" అన్నాడు శేఖర్. శేషయ్య జవాబు చెప్పలేదు. డాబా మీదకి మెట్లున్నాయి. ఆ మెట్ల దగ్గర ఆగి టార్చివెలుగులో నేల పరీక్షగా చూశాడు శేషయ్య. అస్పష్టంగా కనిపించిన అడుగుజాడలు మొద్దబ్బాయికి చూపించి మొలలోంచి పిస్తోలు తీశాడు, శేషయ్య పిస్తోలు తీయగానే శేఖర్ అమితాశ్చర్యంతో "అదెక్కడిది నీకు?" అడిగాడు.

"నాదే" అని శేషయ్య డాబా మెట్లు ఎక్కసాగాడు. మొద్దబ్బాయి శేషయ్య వెనకే వెళ్ళాడు.

చాలా పెద్ద డాబా అది. మెట్లగది అవతల నిలబడి శేషయ్య చెవులు రిక్కించుకుని విన్నాడు. తర్వాత టార్చి వెలుగు చుట్టూ వేసి, డాబా అంతా పరీక్షించాడు. ఎవరూ లేరూ మెట్లగది పక్కన పిట్టగోడనించి నేలకి చిన్న గుడారంలా ఒక కాన్వాస్ బట్ట ఉంది. శేషయ్య చర చర అటు నడిచాడు. ఒక మనిషి లోపలికి వెళ్ళగలిగేటంత చిన్న గుడారం అది. ఆ కాన్వాస్ బట్ట లాగేశాడు శేషయ్య. ఒక రేకు పెట్టె, రెండు సీసాలు, ఒక ఉలి, రెండు కత్తులు కనిపించాయి. ఆ సీసాలు పరీక్ష చేశాడు ఖాళీగా ఉన్నాయి. కాని అడుగున ఎర్రని ద్రావకం ఏదో ఉన్నది. రేకు పెట్టె తెరిచాడు కొన్ని బట్టలున్నాయి అవిగాక రెండు విగ్గులు, ఒక మేకప్ బాక్సు, ఒక సీసాలో క్లోరోఫాం, ఇంకో రెండు సీసాల్లో ద్రావకాలు ఉన్నాయి. పెట్టెలోంచి పాంటు తీసి రెండు చేతుల్లో పట్టుకుని "ఇది మున్నయ్యది కాదు." అన్నాడు శేషయ్య. మొద్దబ్బాయి తలవూపాడు.

"ఏమిటి ఇవన్నీ! ఇక్కడికి ఎలా వచ్చాయి శేషయ్యా? వెంటనే చెప్పు" అడిగాడు శేఖర్ కోపంగా.

"తొందరపడకండి అంతా తెలుస్తుంది. మనం ఇప్పుడు బోట్ హౌస్‌లోకి వెళ్ళాలి. వెళ్ళేటప్పుడు ఏ మాత్రం చప్పుడు చెయ్యకూడదు. అడుగులో అడుగు వేసుకుంటూ గట్టిగా ఊపిరి పీల్చకుండా వెళ్ళాలి. నీళ్ళల్లో చప్పుడు చెయ్యకుండా నడవాలి. ఆ విషయం జ్ఞాపకముంచుకోండి!" అన్నాడు శేషయ్య కిందకి దిగుతూ.

బోట్ హౌస్‌లో తలుపులు, కిటికీలు మూసివున్నాయి. పిక్కలవరకూ లోతు నీళ్ళల్లో గోడపక్కన నిలబడ్డారు ముగ్గురూ. వైకుంఠరావు శవాన్ని ఆ బోట్ హౌస్‌లో ఉంచారు. ఆ బోట్ హౌస్ లోంచే ఆ శవం మాయమయి ఇంట్లో ప్రత్యక్షమైంది. శేషయ్య ప్రవర్తన విచిత్రంగా తోచింది శేఖర్‌కి. కాని శేషయ్యలో ఠీవి, గాంభీర్యమూ చూసి శేఖర్ ఎదురు చెప్పలేక అతను చెప్పినట్లు చేస్తున్నాడు.

కిటికీ తలుపుకి చెవి ఆనించి కాసేపు విన్నాడు శేషయ్య. మొద్దబ్బాయికి సంజ్ఞ చెయ్యగానే, మొద్దబ్బాయీ కిటికీ రెక్కకి చెవి ఆనించి, విని తలూపాడు. శేఖర్ కూడా అలాగే చేసాడు. లోపల్నుంచీ అస్పష్టంగా మాటలు వినపడ్డాయి. ఎవరో ఏడుస్తున్నారు. ఏదో చెప్పడానికి శేఖర్ నోరు తెరవగానే మొద్దబ్బాయి శేఖర్ నోరు అరిచేత్తో మూసేశాడు. "దయచేసి నిశ్శబ్దంగా ఉండండి. చప్పుడు చెయ్యకూడదు" అన్నాడు శేషయ్య ఇంగ్లీషు భాషలో శేఖర్ చెవిలో. తోటమాలి శేషయ్య చెవిదగ్గర నోరుపెట్టి "ఎవరు మీరు మారువేషంలో ఎందుకు మా ఇంటిలో పనికి కుదిరారు?" అడిగాడు.

శేషయ్య జవాబు చెప్పలేదు. చిన్నగా నవ్వాడు. శేఖర్నీ, మొద్దబ్బాయినీ తలుపు దగ్గర నిలుచోమని చెప్పి బోట్ హౌస్ వెనక్కి వెళ్ళాడు. నీళ్ళ గది వెనకవైపుంది. ఆ నీళ్ళ గదికీ, పెరటికీ మధ్య రేకు తలుపు ఉన్నది ఆ తలుపు నెమ్మదిగా తోశాడు శేషయ్య. కదులింది. చప్పుడు చెయ్యకుండా అంగుళం, అంగుళం చప్పున తోశాడు తలుపు పూర్తిగా తెరుచుకున్న తర్వాత లోపలికి వెళ్ళాడు. నీళ్ళగదికీ వంట గదికీ మధ్య తలుపు లేదు. వంట ఇంట్లోకి వెళ్ళి ఆగాడు. స్పష్టంగా వినపడుతున్నాయి మాటలు. ఇంకో రెండడుగులు వేసి తలుపు పక్కన ఆగి తొంగి చూశాడు.

గది మధ్య కొవ్వొత్తి వెలుగుతోంది. రాజారాం గోడకి ఆనుకుని నిలబడి ఉన్నాడు. రెండు చేతులూ పైకెత్తి ఉంచాడు. మంచం మీద సావిత్రి కూర్చున్నది. పెద్ద బాకు పట్టుకుని రాజారాం పక్కన అతని వైపు తిరిగి నిలుచున్నాడు మునయ్య. సావిత్రికి ఎదురుగా రాజారాంని చూస్తూ ఇంకో మనిషి గది మధ్య కుర్చీలో కూర్చున్నాడు. అతని మొహం కనిపించడం లేదు. నల్లని పాంటు, నల్లని కోటు వేసుకున్నాడు. భారీ మనిషి కాడు. అతని చేతిలో పిస్తోలు ఉంది. నీతో చర్చించేందుకు నాకు వ్యవధి లేదు ఆఖరిసారి అడుగుతున్నాను చెప్పు! తెల్లారే లోపున నేను వెళ్ళిపోవాలి. ఈ వరద తగ్గితే పోలీసులు వస్తారు. పోలీసులు వస్తే ఆ నగలు నీకూ నాకూ కాకుండా పోతాయి. ఆ శేషయ్యతో నువు పెట్టిన బేరం నీకు నేను పెడుతున్నాను. నీకు లక్ష రూపాయల విలువగల నగలు ఇస్తాను. చెప్పు" అన్నాడు కుర్చీలో కూర్చున్న మనిషి.

రాజారాం మాట్లాడలేదు. కళ్ళు మూసుకున్నాడు.

కుర్చీలో కూర్చున్న మనిషి సావిత్రివైపు తిరిగి "నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నించడం అవివేకం. నాదగ్గర రెండు వేల రూపాయలు తీసుకుని నన్ను మోసం చేసి ఈ రాజారాంతో ఎక్కడికో పారిపోదామనికున్నావా? అతనికి బుద్ధి చెప్పు. ప్రాణాలతో ఈ గదిలోంచి బయటపడాలంటే ఆ నగలు ఎక్కడ దాచినదీ చెప్పాలి" అన్నాడు.

సావిత్రి బెదురుతూ చూపింది. "నాకు తెలియదు తెలిస్తే చెప్పేదాన్నే! నేను మిమ్మల్ని మోసం చెయ్యాలనుకోలేదు. ఆ నగలు ఎక్కడ దాచినదీ కనుక్కోడానికి ప్రయత్నించాను" అన్నది. కుర్చీలో కూర్చున్న మనిషి నవ్వాడు.

"ఏమో! నువ్వు నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నించావో అతన్నే మోసం చెయ్యడానికి ప్రయత్నించావో దేవుడికి తెలియాలి. రాజారాం! చెపుతావా చెప్పవా?" అడిగాడు కోపంతో. ఆ నగలు ఎక్కడ దాచినదీ చెప్పిన మరుక్షణం తన ప్రాణం గడ్డిపరకతో సమానం అని రాజారాంకి తెలుసు. ఆ విషయం చెప్పనంతకాలమే తను ప్రాణాలతో ఉంటాడు. సావిత్రి కళ్ళల్లోకి చూశాడు, ప్రేమతో, బాధతో చూస్తున్నాయి ఆమె కళ్ళు. ఆమె తనని మోసం చెయ్యడానికి ప్రయత్నించలేదని రాజారాంకి తెలుసు. ఆ విశ్వాసమే అతనికి మనోబలం ఇచ్చింది. "నేను చెప్పను, చెప్పదలుచుకోలేదు. మీరు నన్నూ, సావిత్రినీ వదిలిపెట్టండి. ఆ నగలలో సగం మీకు ఇస్తాను" అన్నాడు. కుర్చీలో కూర్చున్న మునయ్యను చూసి "రుచి చూపించు" అన్నాడు.

మునయ్య రాజారాంని ఫెడీమని నోటిమీద కొట్టాడు. ఆ దెబ్బకి రాజారాం తల ఇటూ అటూ ఊగింది. పెదిమలు చిట్లి రక్తం కారింది. శేఖర్ ముందుకి అడుగు వెయ్యబోయాడు. శేషయ్య శేఖర్‌ని చెయ్యి పట్టుకుని ఆపాడు,

"రాక్షసుల్లా ప్రవర్తించకండి!" అని మంచం మీదనుంచి చివాలున లేచింది సావిత్రి. కుర్చీలో కూర్చున్న మనిషి సావిత్రిని ఒక్క తోపు తోశాడు. మంచం మీద పడ్డది.

"రాక్షసుల్లా కాదు - యమదూతల మల్లే ప్రవర్తిస్తాం. జాగ్రత్త!" సావిత్రి జుట్టు పట్టుకుని తల ఆడించాడతను.

"మీ చేతనయినంత నన్ను హింసించండి. అంతే కాని నగలు ఎక్కడ ఉన్నాయో తెలియని సావిత్రిని హింసించి ఏం లాభం" అన్నాడు రాజారాం.

కుర్చీలో కూర్చున్న మునయ్య కళ్ళల్లోకి చూసి ఏదో సంజ్ఞ చేశాడు. మునయ్య తలవూపాడు.

"బావుంది. మీ ఇద్దరూ ప్రేమలో పడ్డారన్నమాట. మంచిదే! మా పని సులభమైంది. ఊ! కాని!" అన్నాడు అతను మునయ్యతో. మునయ్య కింద పడివున్న తాడూ తీసి రాజారాం చేతులు బిగించి కట్టాడు. రాజారాంని గోడకి ఆనుకుని నిలబడమన్నాడు.

తర్వాత సావిత్రి వైపు తిరిగి "లే, ఇటురా" అన్నాడు.

సావిత్రి  భయపడి లేచి వెళ్ళింది. తోలుబెల్టు తీశాడు మునయ్య. ఫెళీమని సావిత్రిని ఆ తోలు బెల్టుతో కొట్టాడు.

"నేనేం చేశాను! మీకు సహాయం చెయ్యడానికి రాజారాం చెల్లెలుగా నటించినందుకా నాకీ శిక్ష! ఆ నగలు ఎక్కడ ఉన్నాయో నాకు తెలియదు. మీరెంత హింసించినా నేను చెప్పలేను." అన్నది సావిత్రి ఏడుస్తూ.

కుర్చీలో కూర్చున్న మనిషి నవ్వి "ఆ విషయం నాకు తెలుసు. నిన్ను హింసిస్తే రాజారాం రహస్యం బయట పెడతాడు" అన్నాడు. మునయ్య అటూ ఈటూ ఓసారి చూసి, కిటికి దగ్గిర గూడులోంచి ఓ బ్లేడు తీశాడు. అరి చేతిమీద రెండు నిముషాలు పదును పెట్టాడు.

"పాపం! అందమైన మొహం మీద అరంగుళం లోతున గండ్లు పడుతాయి!" అన్నాడు కుర్చీలో కూర్చున్న మనిషి. రాజారాం పళ్ళు బిగించాడు. సావిత్రి రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకున్నది

"చేతులు అడ్డం పెట్టుకుంటే ఆగుతుందా! ముందు చేతులు తెగుతాయి!" అన్నాడు మునయ్య. సావిత్రి ఏడుస్తోంది. రాజారాం మొహం తిప్పేసుకున్నాడు. మునయ్య సావిత్రి దగ్గరకు వెళ్ళాడు. బ్లేడు సావిత్రి చేతికి ఆనించి "రాజారాం! చూడు.. సావిత్రి గతి!" అన్నాడు.

సావిత్రి భయంతో కెవ్వున కేకపెట్టింది. "ఆగండి చెపుతాను" అన్నాడు రాజారాం. కుర్చీలో కూర్చున్న మనిషి నవ్వి "అదీ! అలా దారికి రా! ఇంతకు ముందు చెప్పినట్లు అబద్ధం చెప్పావా ఈసారి కనికరించను" అన్నాడు.

"చెపుతాను కాని మమ్మల్ని ఒదిలేస్తావా? వొదిలేస్తావని నమ్మకం ఏమిటి?" అడిగాడు రాజారాం. "ఆ నగలు మా చేతికి చిక్కాక ఈ ప్రాంతాల ఒక అరక్షణం ఉండం.. మిమ్మల్ని ఒదిలెయ్యక ఏం చేస్తాం! మా వెంట తీసుకు పోతామా?" అన్నాడు కుర్చీలో కూర్చున్న మనిషి.

"ఈ నగలు మీకు దొరికినట్లు ఎవరికీ తెలియకుండా ఉండేందుకు.."

"మిమ్మల్ని చంపేస్తాననా నీ భయం! పిచ్చివాడా! హత్య చెయ్యడం వివేకమైన పనికాదు. అన్ని నేరాలూ ఒక ఎత్తు, హత్యానేరం ఒక ఎత్తు" అన్నాడు అతను.

"నీ మాటలు ఎవరు నమ్ముతారు! వైకుంఠరావుని హత్య చెయ్యలేదూ!" అన్నాడు రాజారాం.

"మునయ్య పొరపాటువల్ల వైకుంఠరావు మరణించాడు. అతన్ని చంపాలన్న ఉద్దేశం లేదు" అన్నాడు కుర్చీలో ఉన్న మనిషి. రాజారాం ఆలోచిస్తున్నాడు.

"నీకు వేరే మార్గం లేదు. నిన్నూ, సావిత్రినీ చంపం. మా మాట నమ్మాలి. అంతే!" అన్నాడు అతను. రాజారాం తల ఊపాడు "చెప్పు!"

"మేడమీద కామరాజు పడకగదిలో.. "

"ఎక్కడ?"

"గుమ్మానికి, నాలుగు అడుగుల దూరంలో నేలకింద గోడలో."

కుర్చీలో కూర్చున్న మనిషి రాజారాం దగ్గరకి వెళ్ళి ఫెడీమని చెంప మీద కొట్టి అబద్ధం చెపుతున్నావు. మేడమీద నేలకింద ఎలా దాచి ఉండగలవు!" అన్నాడు కోపంగా.

"సావధానంగా విను. చెపుతాను. పదేళ్ళ క్రితం నేను ఆ ఇంట్లో ప్రవేశించినప్పుడు ఎవరూ లేరు. పాడుబడ్డ ఇల్లు మల్లే ఉంది. ఆ నగలు ఎక్కడ దాద్దామా అని ఇల్లంతా గాలించాను. ఓ గదిలో నేల అక్కడక్కడ పెచ్చులుపోయి ఉంది. గుమ్మానికి నాలుగు అడుగుల దూరంలో గచ్చు తవ్వి చిన్న గుంట చేశాను. ఆ గుంటలో నగలు దాచాను. తర్వాత ఆ గుంట పూడ్చేసి పైన సిమెంటు పూశాను. కొత్తగా

సిమెంటు పూసినట్లు తెలియకుండా సిమెంటు గీకి పైన సున్నం కలిసిన ఇసుక చల్లాను. ఎవరైనా వచ్చి చూసినా అక్కడ గుంట తవ్వినట్లుగాని, సిమెంటు పూసినట్లుగాని తెలియదు'' అన్నాడు'' రాజారాం.

కుర్చీలో కూర్చున్న మనిషి కాసేపు ఆలోచించి ''నమ్మశక్యం కాకుండా ఉంది. అటువంటి చోటదాస్తే వాటిని మళ్ళీ ఎలా తీసుకుందామనుకున్నావు?'' అడిగాడు.

''మళ్ళీ తీసుకోవటమా! అప్పుడప్పుడే తీసుకో వీలు కలుగుతుందని నాకు నమ్మకం లేదు. పోలీసులు నన్ను పట్టుకు తీరతారని నాకు తెలుసు నా వేలిముద్రలు దొరికాయని పత్రికల్లో వేశారు. ఎన్నేళ్ళు శిక్ష పడుతుందో తెలియదు. నేను జైల్లోంచి బయటికి రావడానికి పధ్నాలుగేళ్ళు పట్టినా పట్టవచ్చు. అప్పటివరకూ ఎవరికీ ఆ నగలు కనిపించకుండా ఉండాలి. అందుకే అక్కడ దాచాను.''

''నిజం చెపుతున్నావా?'' అడిగాడు అతను తీక్షణంగా రాజారాంని చూస్తూ రాజారాం తలూపాడు.

''మునయ్యా! వీళ్ళిద్దరూ ఇక్కణ్ణించి కదలకుండా చూస్తూ ఉండు. నేను వెళ్ళి వస్తాను'' అన్నాడు కుర్చీలో కూర్చున్న మనిషి.

''ఇంట్లో వాళ్ళు మెలుకువగా ఉన్నారేమో'' మునయ్య సందేహం వెలిబుచ్చాడు.

''ఆ మనిషి పకపక నవ్వాడు. మెలుకువగా ఉన్నా మేడమీదకి ఎవరూ రారు. కామరాజు గది లోపల గడియ పెట్టి బయట వైకుంఠరావు శవాన్ని కాపలా పెడతాను. అప్పటికీ, ఏ శేషయ్యో తెగించి మేడమీదకి వచ్చాడా ప్రాణాలు బలి ఇస్తాడు'' అని తలుపు వైపు తిరిగాడు.

''ప్రాణాలు తెగించడానికి ఇక్కడికే వచ్చాను. కదలక! చేతులు పైకెత్తు! నువ్వు కూడా మునయ్యా!''

ఆ మాట వినిపించేసరికి మునయ్యా, ఆ ఇంకో మనిషీ చకితులయి వెనక్కి తిరిగారు.

''చేతులు పైకెత్తు ఉంచండి. లేకపోతే నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను'' అన్నాడు శేషయ్య గదిలో ప్రవేశిస్తూ. అతని వెనకే మొద్దబ్బాయి, శేఖర్ కూడా గదిలో ప్రవేశించారు.

''నువ్వా? ఎందుకు వచ్చావు ఇక్కడికి?'' అడిగాడు మునయ్య.

''శేషయ్యా! శేషయ్య వచ్చాడు రాజా!'' అన్నది సావిత్రి సంతోషంతో, గదిలోకి వచ్చిన ముగ్గుర్నీ రాజారాం ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

''రాజూ పిస్తోలు మునయ్య మీద గురిపెట్టి ఉంచు. కదిలాడా కాల్చెయ్యి! మిస్టర్ శేఖర్! ఇదుగో ఇతనే మీ ఇంట్లో ప్రవేశించిన దెయ్యం'' అన్నాడు శేషయ్య.

''నువ్వు తోటమాలివి కావు! ఎవరు నువ్వు'' అడిగాడు మునయ్య.

''అవును నా పేరు శేషయ్య కాదు ఇతని పేరు మొద్దబ్బాయీ కాదు. నా పేరు యుగంధర్. ఇతను నా అసిస్టెంటు రాజు!'' అన్నాడు శేషయ్యగా అన్నిరోజులు సంచరించిన యుగంధర్.

''ఎవరూ! డిటెక్టివ్ యుగంధరా!'' అడిగాడు ఆ ఇంకో మనిషి. యుగంధర్ తలఊపాడు.

శేఖర్ అమితాశ్చర్యంతో నోట మాట లేకుండా నిలబడ్డాడు. మునయ్య ఒక్క గంతువేసి రాజుని ఒక్క తోపు తోశాడు. రాజు యుగంధర్ మీద పడ్డాడు. యుగంధరూ, రాజూ నేలమీద పడ్డారు.

''త్వరగా తలుపు తెరు'' కేకేశాడు మునయ్య ఆ ఇంకో మనిషి తలుపు గడియ మీద చెయ్యి పెడుతుండగా యుగంధర్ చేతిలోని టార్చి అతని చేతిమీదకి విసిరేశాడు. టార్చి వేళ్ళకి తగిలింది. ''అబ్బ!'' అంటూ చెయ్యి తీసేశాడు అతను.

అప్పటికి యుగంధరూ, రాజూ లేచారు. మునయ్య యుగంధర్ని కదలకుండా వెనకనుంచి గట్టిగా పట్టుకున్నాడు. రాజు మీదకి ఒక్క ఉరుకు ఉరికాడు తలుపు దగ్గిర ఉన్న మనిషి. శేఖర్ చేతిలో పిస్తోలు ఉన్నది కాని కాల్చడానికి వీల్లేకపోయింది. ఒకళ్ళతో ఒకరు

కలియబడి నేలమీద దొర్లుతున్నారు ఆ నలుగురూ, పిస్తోలు పేలిస్తే ఎవరికి తగులుతుందో! మునయ్య యుగంధర్ మెడచుట్టూ చేతులు వేసి బలం అంతా ఉపయోగించి మెడ నొక్కుతున్నాడు. అతను యుగంధర్ కన్నా భారీ మనిషి, పశుబలం ఉపయోగిస్తున్నాడు. యుగంధర్ చెయ్యి మడిచి మోచేతితో మునయ్య డొక్కలో గట్టిగా పొడిచాడు. "అబ్బా!" అంటూ యుగంధర్ మెడ మీదినుంచి పట్టు సడిలించాడు మునయ్య. ఆ అదను కోసమే కాచుకున్న యుగంధర్ అతన్నించి తప్పించుకుని లేచి నిలబడ్డాడు. మునయ్య లేస్తుండగా అతన్ని కాలితో గెడ్డం మీద ఈడ్చి తన్నాడు. మునయ్య వెనక్కు పడగానే కాలు మునయ్య గొంతు మీద పెట్టి, "కదిలితే పీక నొక్కేస్తాను" అన్నాడు యుగంధర్. అప్పటికి రాజు ఆ ఇంకో మనిషిని కింద పడేసి ఛాతీ మీద కూర్చుని "నీ పేరేమిటి?" అడిగాడు అతను మాటాడలేదు.

"చెప్పు! ఎలాగో పోలీసులు నీచేత చెప్పిస్తారు."

"జైరాజ్."

"మిస్టర్ శేఖర్! ఆ మూల ఉన్న తాడు తీసుకొచ్చి ఈ మునయ్య చేతులూ, కాళ్ళూ కట్టండి" అన్నాడు యుగంధర్.

అయిదు నిముషాలలో మునయ్య, జైరాజ్‌లు బంధితులయ్యారు, కాళ్ళూ చేతులూ కలిపి కట్టేశారు. యుగంధరూ, రాజూ కట్లు ఏమాత్రం గట్టిగా ఉన్నాయో పరీక్షించి, తృప్తి పడి లేచి నిలబడ్డారు. "వీళ్ళ విషయం?" అడిగాడు రాజు. రాజారాంనీ, సావిత్రినీ చూపించి "రాజారాంని ఇక్కడే ఉండనిద్దాం. సావిత్రిని ఇంట్లోకి తీసుకెళదాం"

"వీళ్ళకి కాపలా?" అడిగాడు శేఖర్. "రాజు కాపలా ఉంటాడు. కాసేపట్లో నేను వచ్చి కాపలా ఉంటాను. పదండి. మనం ఏమయినా అని మీ నాన్నగారు ఖంగారు పడుతుంటారు" అన్నాడు యుగంధర్.

## 33

"ఇంకా నమ్మలేకుండా ఉన్నాను" అన్నాడు కామరాజు.

"ఏమిటి నమ్మలేకుండా ఉన్నారు?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ,

"మీరు నిజంగా డిటెక్టివ్ యుగంధర్ అనీ, ఆ ముద్దబ్బాయి మీ అసిస్టెంటు రాజు అనీ, ఆ నగల విషయం తెలుసుకునేందుకు మీరు మారువేషాలలో రావడం అవసరమైనా, మీరు ఫలానా అని నాకు ముందే ఎందుకు చెప్పలేదో అర్థ కాకుండా ఉన్నది" అన్నాడు కామరాజు

"క్షమించండి. నేను ఫలానా అని మీకు తెలిసి ఉంటే మీ ప్రవర్తన సంభాషణల్లో ఎప్పుడో ఒకప్పుడు ఇతర్లకి అనుమానం కలిగేది. నేను యుగంధర్ అని తెలియక పోయినా, నిజంగా తోటమాలిని కానని తెలిసిపోయేది. అలా అనుమానం కలిగివుంటే రాజారామే కాక మునయ్య, జైరాజ్‌లు కూడా ఈ ఇంట్లోంచి పారిపోయేవాళ్ళు" అన్నాడు యుగంధర్. అంతలో గణగణ గంట మోగింది. అందరూ ఉలిక్కిపడ్డారు. యుగంధర్ నవ్వి "టెలిఫోన్. నేను చూసి వస్తాను" అని వెళ్ళి రిసీవర్ తీసి "హల్లో!" అన్నాడు. "90092" నెంబరేనా"

"అవును"

"టెలిఫోన్ ఎక్స్చేంజ్ నుంచి ఫోన్ చేస్తున్నాం. ఈ వరదల వల్ల లైను తెగిపోయింది ఇవాళే బాగుచేశాం. మీ టెలిఫోన్ పనిచేస్తున్నదో లేదో తెలుసుకునేందుకు ఫోన్ చేసాను"

''థాంక్స్!'' అని యుగంధర్ రిసీవర్ పెట్టేసి, ఓ నెంబర్ తిప్పి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుతో అయిదునిముషాలు మాట్లాడి హాల్లోకి వెళ్ళాడు. ''టెలిఫోన్ బాగయింది బహుశా ఇంకాసేపటిలో ఎల్క్ట్రిసిటీ కూడా వస్తుంది. తెల్లారేప్పటికి పోలీసులు వస్తారు'' అన్నాడు యుగంధర్ కామరాజుతో.

''ఈ ఇంట్లో దెయ్యం లేదని.. జైరాజ్, మునయ్య ఈ ఘోరాలన్నీ చేశారనీ అంటారా?'' అడిగాడు ప్రసాద్ ఆశ్చర్యంతో.

''అవును. అసలు జరిగినదంతా క్లుప్తంగా చెపుతాను వినండి. రాజారాం మీ డ్రయివర్‌కి డబ్బు ఇచ్చి అతన్ని ఉద్యోగం మానేయ్యమనీ, తనని డ్రయివరుగా కుదర్చమనీ అడిగినట్లు తెలుసుకున్నాను. దాన్ని బట్టి నగలు ఈ ఇంట్లో ఎక్కడో దాచి ఉండాలనీ గ్రహించాను. రాజారాంలా నేనూ తోటమాలికి డబ్బు ఇచ్చి అతన్ని మాన్పించి తోటమాలిగా నేనూ, నా కొడుకుమల్లే రాజా వచ్చాము. రాజారాం నగలు ఎక్కడ దాచిందీ తెలుసుకోవడానికి సావిత్రిని నియమించిన జైరాజ్, మునయ్యని ఈ ఇంట్లో ప్రవేశపెట్టాడు. మొదటినుంచీ నాకు మునయ్య మీద అనుమానం ఉంది కాని అతనికి యజమాని, అసలు మూలవిరాట్టు ఇంకో మనిషి ఉన్నాడని తెలియదు. రాజారాం నగలు ఎక్కడ దాచినదీ వాళ్ళకి తెలియదు. అడిగితే చెప్పడని తెలుసు. అతను నగలు తీసుకున్న తర్వాత ఆ నగలు అతన్నించి అపహరించాలని మునయ్య, జైరాజ్ ఆలోచించారు. అందుకే రాజారాం నగలు సంపాదించేందుకు రాజారాంకి తెలియకుండా మునయ్య సహాయ పడ్డాడు. ముందు తలుపు తెరిచి రాజారాం లోపలికి వచ్చిన తర్వాత మునయ్య తలుపు మూశాడు. తర్వాత ఎవరూ బయటికి రాకుండా అందరి గదులకీ బయట గడియలు పెట్టాడు. రాజారాం అన్వేషణకి ఆటంకం కలగకుండా ఉండాలని అతని ఉద్దేశం. దెయ్యంలా తన రూపం భీకరం చేసుకుని మెట్ల దగ్గర కాపలా ఉన్నాడు. రాజారాం పద్మ గదిలో ప్రవేశించాడు. అతని పొరపాటువల్ల పద్మ లేవడం కేకలు పెట్టడం జరిగింది. ప్రసాద్ తలుపు విరగకొట్టి బయటికి వచ్చాడు. అతను రాజారాంని చూసినా పట్టుకున్నా రాజారాం మళ్ళీ జైలుకి పోతాడు. అప్పుడు ఆ నగలు దక్కవు. అందుకని మునయ్య ప్రసాద్‌ని బెదిరించాడు. అతన్ని మెట్లమీదనుంచి తోసేసి రాజారాం పారిపోవడానికి అవకాశం కలిపించాడు. ఇకపోతే జైరాజ్ విషయం. జైరాజ్ డాబా మీద చిన్న గుడారం వేసుకుని అక్కడ దాక్కున్నాడు. రాత్రిళ్ళు మాత్రం బయటికి వచ్చేవాడు. దెయ్యంలా కనబడిన మునయ్యని చూసి, రాజారాం కూడా భయపడి మళ్ళీ ఇంట్లో ప్రవేసించే ప్రయత్నం చెయ్యలేదు. అందువల్ల మునయ్య రాజారాంని హింసించి నగలు ఎక్కడ దాచినదీ తెలుసుకోవడానికి ప్రయిత్నించాడు. రాజారాం అతనికి నిజం చెప్పలేదు. ఇక వైకుంఠంగారి హత్య విషయం ఆయన్ని హత్య చెయ్యాలన్న ఉద్దేశం లేదు మునయ్యకి. అర్ధరాత్రి వైకుంఠరావుగారు మేడ మీదకి బయలుదేరారు. మునయ్యని గుర్తుపట్టివుండాలి. లేకపోతే తనని గుర్తుపట్టాడని మునయ్య భయపడి ఉండాలి. లేదా చిన్న దెబ్బ కొట్టుతున్నాననుకుని పెద్ద దెబ్బ కొట్టివుండాలి, వైకుంఠంగారిని ఉద్దేశ్యపూర్వకంగా హత్య చెయ్యలేదని జైరాజ్ చెప్పాడు. ఆ మాట నమ్మవచ్చు. వైకుంఠరావుగారిని, హత్య చెయ్యడం జరిగిన తర్వాత, ఇంట్లో దయ్యం తిరుగుతున్నదనే భయమూ భ్రాంతీ అందరికీ ఎక్కువయ్యేందుకు ఆ హత్యని వినియోగించుకున్నాడు జైరాజ్. ఈ లోగా వాన, వరద ప్రారంభం అయింది. నౌకర్లము కూడా ఇంట్లోకి వచ్చేశాము. రాజారాం కూడా ఇంట్లోకి వచ్చేశాడు, రాజారాం మేడ మీద తారట్లాడడంవల్ల నగలు మేడమీద ఎక్కడో దాచి ఉండాలని జైరాజ్ గ్రహించాడు. ఇంట్లో వాళ్ళు ఎవరూ మేడమీదకి రాకుండా ఉండేందుకు వైకుంఠరావు శవాన్ని తీసుకొచ్చి మేడమీద పెట్టాడు. బీటలు పడ్డచోట రక్తంమల్లే కనపడేదేదో పోశాడు. అది బొట్లు బొట్లుగా కిందపడి మేడమీదకి వెళ్ళకుండా అందర్నీ భయపెట్టింది. జైరాజ్ నగలకోసం మేడమీది గదులు వెతకడానికి ఆటంకం లేకుండా చేసుకున్నాడు''

యుగంధర్ మాటలకి భారతి అడ్డువచ్చి ''చనిపోయిన వైకుంఠరావుగారు ఇంట్లో తిరగడం ప్రారంభించారు అది?'' అడిగింది.

''డాబామీద గుడారంలో ఉన్న జైరాజ్, వైకుంఠరావుగారు దాదాపు సమాన ఒడ్డు పొడుగు ఉండడంవల్ల జైరాజ్ రూపం మార్చుకుని వైకుంఠరావుగారిలా అప్పుడప్పుడు తిరిగాడు. స్పష్టంగా ఎవరూ చూడడానికి వీలులేకుండా ఎప్పుడు కనపడినా మసక

వెలుగులో కనిపించాడు. మాట్లాడలేదు. అందువల్ల వైకుంఠరావు అని అందరూ దడుసుకునేటట్లు చేయగలిగాడు" అన్నాడు యుగంధర్.

"ఇన్ని ఘోరాలు చేసి, అందర్నీ ఇంత భయపెట్టి వాళ్ళు సాధించింది ఏమిటి?" అడిగాడు కామరాజు.

"నిజానికి ఏమీలేదనే చెప్పాలి. రాజారాం భయపడకుండా నగలు తీసుకుని ఉంటే వాళ్ళ పథకం పారేది. కాని రాజారాం భయపడి రాత్రిళ్ళు కదలడం మానేశాడు. జైరాజ్ మేడమీద ఎంత వెతికినా నగలు ఎక్కడ దాచాడో తెలుసుకోలేకపోయాడు. వరద తగ్గిపోతోంది పోలీసులని పిలిపించి ఇల్లువాళ్ళకి అప్పచెప్పి, మీరంతా మద్రాసుకి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నారని మునయ్య జైరాజ్‌కి చెప్పాడు. పోలీసులు వచ్చారా ఇక వాళ్ళకి నగలు దక్కవు. రాజారాంని అనుమానం మీద పట్టుకుంటారు. నగలు ఈ ఇంట్లోనే దాచాడని పోలీసులు గ్రహిస్తారు. ఆ తర్వాత ఆ నగలు సంపాదించేందుకు తనకి ఆవకాశం ఉండదు. అందుకే రాజారామ్‌నీ, సావిత్రినీ, ఎత్తుకుపోయి ఔట్ హౌవుస్‌లో బంధించి, హింసించి నగలు ఎక్కడ దాచినదీ తెలుసుకునేందుకు తుది ప్రయత్నం చేశారు" అన్నాడు యుగంధర్.

"నిజంగా ఆ నగలు రాజారాం చెప్పిన చోట ఉన్నాయంటారా?" అడిగాడు శేఖర్.

యుగంధర్ తలవూపి "రాజారాం అబద్దం చెప్పలేదనే నా అభిప్రాయం. రండి చూద్దాం" అన్నాడు.

## 34

"కంగ్రాజులేషన్స్!" మీరు తోటమాలి వేషంలో ఈ ఇంట్లో ఉన్నారని చెంగల్పట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాకు కబురు పంపాడు. మిమ్మల్నీ, రాజునీ జీపు ఎక్కించుకుని తీసుకు వెళుతున్నప్పుడు మీరు ఫలానా అని తనకి తెలియనే తెలియదనీ మీరు చెప్పాక కూడా నమ్మలేక పోయాననీ చెప్పాడు" అని నవ్వాడు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"అవును. ఆయన ఈ ఇంటికి వచ్చినప్పుడు ఇక్కడే చెప్పితే ఆయనలో కలిగే మార్పును చూసి మునయ్య, రాజారాం అనుమానిస్తారని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళి తర్వాత చెప్పాను. పోలీసులు నన్ను అనుమానించడంవల్ల నా పాత్ర మరింత పటిష్టమైంది. వైకుంఠరావుగారు హత్య చెయ్యబడడం ఒకటే నాకు విచారంగా ఉంది. మునయ్య హత్య చేస్తాడని నేను అనుకోలేదు. అనుకుని ఉంటే ముందే జాగ్రత్త పడేవాణ్ణి" అన్నాడు యుగంధర్.

"అందులో మీ తప్పేముంది! ఆయన్ని హత్యచేయాలని మునయ్య ఉద్దేశించలేదట. అనుకోకుండా జరిగిన సంఘటన అది. మీరెలా ఆపగలరు!" స్వరాజ్యరావు అంటుండగా సార్జంట్ వచ్చి మునయ్యనీ, జైరాజ్‌నీ, రాజారాంనీ, సావిత్రిని వాన్‌లో ఎక్కించారనీ వాన్ బయలుదేరబోతున్నదనీ చెప్పాడు. "రాజారాంనీ, సావిత్రినీ తీసుకువెళ్ళనక్కర్లేదు. వాళ్ళు ఏ నేరమూ చెయ్యలేదు" యుగంధర్ అన్నాడు.

"గుడ్! బయలుదేరండి! రాజారాంనీ, సావిత్రినీ దింపెయ్యండి. నేనూ యుగంధరూ, రాజూ నా జీప్‌లో వెనకే వస్తాము" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కామరాజు కారు సిద్ధంగా ఉంది. అందరూ వసారాలోకి వచ్చి మద్రాసు వెళ్ళిపోవడానికి కారు ఎక్కారు. "ఇంకా ఒకటి రెండు రోజులు మా పోలీసులు ఈ ఇంటికి కాపలా ఉంటారు. కేసుకు సంబంధించిన వివరాలు సేకరించాలి. ఆ తర్వాత మీరు ఏదయినా ఏర్పాటు చెయ్యండి" అన్నాడు. స్వరాజ్యరావు కామరాజుతో. కామరాజు తల ఊపాడు. యుగంధర్‌కి షేక్ హాండ్ ఇచ్చి కారు ఎక్కాడు.

శేఖర్ యుగంధర్ దగ్గరికి వెళ్ళి "థాంక్స్ యుగంధర్!" అన్నాడు.

"ఏమిటి?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ .

"నాకు అసలు దెయ్యాలంటే నమ్మకంలేదు. కాని కొన్ని సంఘటనల తర్వాత దెయ్యాలు ఉన్నాయేమోనని అనుమానం కలిగింది. ఈ ఇంట్లో దెయ్యం లేదనీ, మనిషే ఆ భీకరాలన్నీ చేశాడని మీరు చెప్పకపోతే –"

యుగంధర్ నవ్వాడు. "ఈ ఇంట్లో దెయ్యం లేదని నిరూపించాను. అంతే. అసలు దెయ్యాలు ఉన్నాయో లేవో నాకు తెలియదు" అన్నాడు యుగంధర్,

"వస్తాను. మద్రాసులో మళ్ళీ కలుసుకుంటాంగా!"

"అలాగా!"

"అదేమిటి మీరు రారూ?"

"ఎందుకు రాను! తప్పకుండా వస్తాను" అన్నాడు యుగంధర్ నవ్వుతూ

"నేను మిమ్మల్ని ఎక్కడికి రమ్మన్నానో మీకు తెలుసా?"

"తెలుసు"

"అయితే చెప్పండి."

"మీ వివాహానికి."

"ఎలాతెలిసింది?"

"కళ్ళున్న ఏ మనిషికయినా తెలుస్తుంది.. మీకళ్ళల్లోకి, భారతి కళ్ళల్లోకి చూస్తేనే తెలిసిపోతుంది మీ వివాహంతోపాటు ప్రసాద్, పద్మల వివాహం కూడా చేసేయండి. గుడ్‌లక్!" అన్నాడు యుగంధర్.

**అయిపోయింది.**